ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 466
వెల : రూ.20/-
ఫిబ్రవరి 2024




జనసాహితి ప్రచురణ

# ప్రసిద్ధ ఆఫ్రికన్ - అమెరికన్ కవి లాంగ్‌స్టన్ హ్యూ
# లెనిన్‌పై రాసిన రెండు కవితలు

## లెనిన్

**ప్రపంచమంతా** సంచరిస్తుంటాడు లెనిన్
ఏ సరిహద్దులూ ఆయనను ఆటంకపరచలేవు
మిలటరీ బ్యారక్స్ కానీ, వీధుల్లో బారికేడ్లుకానీ
ముళ్ళ తీగెలు కానీ ఆయనను ఆపలేవు

ప్రపంచమంతా చుట్టేస్తుంటాడు లెనిన్
నలుపు, గోధుమ, తెల్లరంగులవారు ఆహ్వానం పల్కుతారు
భాష అసలు అడ్డంకే కాదు
రకరకాల భాషలవారు విశ్వసిస్తారు ఆయనను

ప్రపంచమంతటా తిరిగేస్తుంటాడు లెనిన్
సూర్యుడు ఒక మచ్చలా అస్తమిస్తాడు
రాత్రి చీకటికీ, ఉషస్సుకీ మధ్య
ఒక అరుణతార ఉదయిస్తుంది.



## లెనిన్‌పై ఒక పాట

**ఓ** రష్యా కామ్రేడ్ లెనిన్!
పాలరాతి సమాధిలో వున్న
కామ్రేడ్ లెనిన్
నా కోసం కొంచెం జరుగు!

బురదతో నిండిన బూట్లతో
వున్న నేను పేద రైతు ఇవాన్‌ను
నీతోపాటు పోరాడాను, లెనిన్!
ఇపుడు నా కర్తవ్యం ముగిసింది.

ఓ రష్యా కామ్రేడ్ లెనిన్!
పాలరాతి సమాధిలో సజీవంగా వున్న
కామ్రేడ్ లెనిన్!
కొంచెం జరిగి నాకూ చోటు ఇవ్వు.
మలమలమాడే ఎండలో చెరకు నరుకుతున్న
నీగ్రోని, నాపేరు చికో
నీ కోసం బతికాను కామ్రేడ్ లెనిన్!
ఇప్పుడు నా పని పూర్తయింది.

ఓ రష్యా కామ్రేడ్ లెనిన్!
పాలరాతి సమాధితో గౌరవించబడ్డ
కామ్రేడ్ లెనిన్!
కొంచెం ప్రక్కకి జరిగి నాకూ
చోటు ఇవ్వు కాస్త!

షాంగై వీధుల్లో సమ్మెలో వున్న
ఫ్యాక్టరీ కార్మికుడిని, చాంగ్ నా పేరు
విప్లవం కోసమే
పోరాడతా, ఆకలితో మలమల మాడుతా
మరణిస్తా!

రష్యా కామ్రేడ్ లెనిన్!
పాలరాతి సమాధి నుంచి అంటున్నాడిలా
కార్మికుల పక్షాన నిలబడు నిరంతరం
అపుడు ప్రపంచమే మన నివాసం!

తెలుగు అనువాదం : కొత్తపల్లి రవిబాబు

జనసాహితి ప్రచురణ

47 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

466

సంపుటి : 47

సంచిక : 7

ఫిబ్రవరి 2024

*website* : **www.prajaasaahithi.com**

## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ముఖచిత్రం | : | రాముడా రక్షించు! | – చిత్రం అంతర్జాలం నుండి | .....01 |
| రెండవ అట్ట | : | లెనిన్‌పై రాసిన రెండు కవితలు | అను : కొత్తపల్లి రవిబాబు | .....02 |
| మూడవ అట్ట | : | భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో కులవివక్షను చిత్రించిన కవితపై ఆంక్ష | | .....35 |
| నాల్గవ అట్ట | : | బంజారా చిత్రకళ | – చిత్రం అంతర్జాలం నుండి | .....36 |
| సంపాదకీయం | : | ఎన్నికల ఉచ్చులో భీమ్–రామ్‌లు | | .....05 |
| కథ | : | సృష్టికర్త | – పమిడిముక్కల లక్ష్మీకాంతమోహన్ | .....06 |
| వ్యాసాలు | : | అంటరానితనం సమస్య | – సింగారవేల్ చెట్టియార్ | .....10 |
| | : | నూతన అంధయుగాలలోకి.... | – ఓ.వీ.వీ.యస్ | .....16 |
| ధారావాహిక | : | దేశ విభజన వస్తువుగా సాహిత్యం (16) చమన్ నహల్ నవల 'ఆజాదీ' | – కొత్తపల్లి రవిబాబు | .....12 |
| గల్పిక | : | పేదరికం పోయిందటహో | – శంకరం | .....18 |
| సమీక్ష | : | లెనిన్ కావ్యంపై | – దాదాహయాత్ | .....20 |
| సినిమా సమీక్ష | : | 29వ కోల్‌కతా అంతర్జాతీయ చలనచిత్రోత్సవం | – బాలాజీ (కోల్‌కతా) | .....26 |
| స్పందన | : | 'కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్'పై | – మనస్విని | .....30 |
| కవితలు / పాట | : | టి.వి.రెడ్డి (**9**); డా॥ జి.వి. కృష్ణయ్య (**11**); ఉప్పెన (**15**); రవి నన్నపనేని (**29**); | | |
| వివిధ | : | సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు (**17**); జనసాహితి కార్యవర్గ తీర్మానాలు (**23**); విరసం 29వ మహాసభలలో జనసాహితి సౌహార్ద సందేశం (**28**); ఉత్తరం (**31**); ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**19**); చైతన్యవాహిని (**32**); ఈ పుస్తకాలు అందాయి (**33**); వార్తాసాహితి (**34**) | | |
| సంతాపం | : | నంబూరి పరిపూర్ణ (**04**) | | |
| కృతజ్ఞతలు | : | కార్జాల రామకృష్ణమ నాయుడు (**34**) | | |


**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు** **ఫోన్ : 9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి

జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి

30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,

దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.

ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

*రచనలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి

ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ

ఆర్మీ క్యాంటీన్ దగ్గర, దగ్లస్ స్కూల్ ఎదురు వీధి,

శ్రీకాకుళం – 532001

ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER

ISSN 0971-278X

LIBRARY OF CONGRESS LCCN 94903393

‘ప్రజాసాహితి’
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
“అకౌంట్ నెం.
*0680101004936*
*IFSC No. CNRB0000680*
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై ‘ప్రజాసాహితి, విజయవాడ’ అని రాయండి


ప్రజాసాహితి ప్రకటనల ధరలు
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం


## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత ‘ప్రజాసాహితి’కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# రచయిత్రి నంబూరి పరిపూర్ణ మృతికి సంతాపం



**ప్రజాకళాకారిణి,** తొలితరం విద్యార్థి ఉద్యమ నాయకురాలు, రచయిత్రి నంబూరి పరిపూర్ణ తన 93వ యేట 26-1-2024న బెంగళూరులో మరణించారు. వారు 1-7-1931న కృష్ణాజిల్లా బొమ్ములూరులో జన్మించారు.

వారి విద్యాభ్యాసం రాజమండ్రిలో, మద్రాసులో సాగింది. బి.ఏ. బి.ఇడి చదివి 1955 నుండి కొంతకాలం ఉపాధ్యాయినిగా చేసి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా మూడు దశాబ్దాలు పనిచేసి 1989లో ఉద్యోగ విరమణ చేశారు. 1944-49లలో చదువుకునే రోజుల్లోనే వామపక్ష విద్యార్థిసంఘ కార్యకర్తగా, 1950-52లలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగానూ పనిచేశారు. కొంతకాలం అజ్ఞాత జీవితం గడిపారు. మదరాసులో దర్శి చెంచయ్య ఇంటిలో వుండి చదువుకున్నారు. ఆ కాలంలో 1942లో ‘భక్త ప్రహ్లాద’ చలనచిత్రంలో ప్రహ్లాదునిగా నటించారు.

కమ్యూనిస్టు పార్టీ నాయకుడు దాసరి నాగభూషణరావు, పరిపూర్ణలు వివాహం చేసుకున్నారు. వారి పెద్ద కుమార్తె శిరీష, బ్యాంకు ఉద్యోగం మానేసి హైదరాబాదులో ‘ఆలంబన’ స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తూ తన 70వ యేట 2021లో మరణించారు. కొడుకు అమరేంద్ర ప్రసిద్ధ యాత్రికుడు - యాత్రా రచనలు రచించారు. మరో కుమారుడు శైలేంద్ర.

పరిపూర్ణ నవలా కథా రచయిత్రిగా 1985లో ‘మాకు సూర్యోదయాలు రావు’ అనే నవలనూ, 1988లో ‘ఉంటాయ్ మాకు ఉషస్సులు’ అనే కథాసంపుటినీ, 2006లో ‘కథాపరిపూర్ణం’, 2016లో ‘శిఖరారోహణ’; 2018లో ‘పొలిమేర’ నవల రచించారు. వారు ‘వెలుగుదారులలో’ అనే శీర్షికతో తన స్వీయచరిత్ర ప్రచురించారు. ఆమె జీవితం, సాహిత్యంపై ‘ఒక దీపం - వేయి వెలుగులు’ అనే పుస్తకం వెలువడింది.

మార్క్సిజంపట్లా, పీడిత ప్రజా ఉద్యమాల పట్ల అచంచలమైన విశ్వాసంతో నిజాయితీగా జీవించిన నంబూరి పరిపూర్ణ మరణానికి ‘ప్రజాసాహితి’ సంతాపాన్ని ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేస్తోంది.

## సంపాదకీయం

# ఎన్నికల ఉచ్చులో భీమ్-రామ్‌లు

**రాచరికయుగాలే** విస్తుపోయే మూఢత్వం!!
గత కాలాల కులమతాలే సిగ్గుపడే ఛాందసత్వం!!
ప్రభుత్వ మతం కాషాయం! చరిత్ర పాఠం విష కషాయం!!!

ప్రజలని ఎవరూ ఎక్కువకాలం మోసం చేయలేరని చరిత్ర చెబుతుంది. మతోన్మాదాన్ని రాజ్యం ఆయుధంగా వాడుకుంటూ ప్రజలను మూర్ఖత్వంలోనే ముంచి ఉంచటాన్ని గతం నుండీ చూస్తూనే వున్నాం. మతోన్మాదం బుర్రకెక్కితే సాధారణంగా చేయలేని ఎంతటి అమానుషమైన, పాశవికమైన, పైశాచికమైన కృత్యాలైనా చేయటానికి మనుషులు సిద్ధపడతారు. అందుకు దేశ విభజననాటి మత కల్లోలాలైనా, సిక్కుల ఊచకోతైనా, గుజరాత్ గాయమైనా, ముజఫర్‌నగర్ ఊచకోతలైనా, ఆ మధ్య కాశ్మీర్ దురాగతాలైనా, ఇటీవల మణిపూర్ అకృత్యాలైనా దీనికి ఉదాహరణలే.... రాజ్యం చేసిన మానవ హననాలే. మూడు దశాబ్దాలు పైబడిన అయోధ్య వివాదం, రామాలయ నిర్మాణం, రామ విగ్రహ ప్రతిష్టాపన – ఇవన్నీ పాలకవర్గాల ప్రమేయం లేకుండా జరిగినవి కావు. దళారీ శక్తులు అనుసరిస్తున్న పదవీ వ్యాపార పరమపద సోపానానికి ఎగుడుమెట్ల కుట్రలు ఇవి. ఇది బిజెపి మతతత్త్వ రాజకీయాల ఛిద్రపటం.

2014 సాధారణ ఎన్నికలలో లబ్ధి కోసం – దళిత, బలహీనవర్గాల ప్రజలను సమీకరించుకోవటానికి విజయవాడలో సామాజిక న్యాయం ప్రతిరూపంగా నిలబెట్టిన 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఒక ఎన్నికల కనికట్టు మాత్రమే. ఈ అంబేద్కర్ స్మృతి వనం – రాష్ట్రంలో దళితవర్గ ప్రజల మీద జరుగుతున్న అనేక పెత్తందారీ దాడులను ఆపగలవా, లేదా అన్నది 1000 డాలర్ల ప్రశ్న. కుహనా ప్రజాస్వామిక దళారీ బూర్జువా ఎన్నికల ఫలితాలు దళిత ప్రజల స్థితిగతులను మార్చలేవన్నది కూడా చరిత్ర మనకు నేర్పింది.

అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ, రెండు విగ్రహాల ఆవిష్కరణలు ప్రజలకు ఎన్నికల సందర్భంగా మోసపు భ్రమలను జేగీయమానంగా మిరుమిట్లు గొలిపేలా పాలకవర్గం సృష్టిస్తోంది. ప్రజాస్వామిక నిబద్ధత లేని పాలక ముఠాల విగ్రహావిష్కరణల తంతు దీపం బొమ్మ గీసి, వెలుగులు పంచుతున్నాం అనడంలాగే ఉంది.

1985 నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ బాబ్రీ మసీదు తలుపులు తెరిపించి కుహనా లౌకికవాదంతో రాజకీయ లబ్ధి పొందాడు. మరో పాలకముఠా ప్రయత్నమే అద్వానీ రథయాత్ర. బాబ్రీ మసీదు కూల్చివేత! రామశిలా న్యాస్ కార్యక్రమంతో ప్రారంభించి భారతీయ జనతా పార్టీ మతతత్త్వ రాజకీయాలను నడుపుకొస్తూంది. 2024 నాటి ఎన్నికల ఎత్తుగా మోడీ నాయకత్వంలో రామ మందిరం నిర్మాణం, రామ్ లల్లా విగ్రహ ప్రతిష్ట జరిగాయి. దేశమంతా మతోన్మాద పూనకాలు బ్యాలెట్ పెట్టె చుట్టూ వీరంగాలు వేస్తున్నాయి.

ఆర్థిక సామాజిక సంక్షోభం వల్ల ప్రజల్లో పెరుగుతున్న అభద్రత పెట్టుబడిదారులు పెంచి పోషిస్తూన్న వ్యాపార సంస్కృతి ప్రజల్లో విపరీతమైన భక్తిని పెంచుతోంది. ప్రజలను నిస్సహాయులుగా చేసి పెంచబడుతున్న మూఢభక్తి – ఈ దళారీ పాలకులకు ఎన్నికల పెట్టుబడి అవుతోంది. ముప్పాతికేళ్ళు గడిచినా కూడా ఆర్థిక సామాజిక సాంస్కృతిక సమానత్వం ఇంకా గగన కుసుమంగానే మిగిలిపోయింది. ఆఖరికి, సంక్షేమ పథకాల ముసుగులో చట్టబద్ధంగా ఓట్లను కొనుగోలు చేయడమే ప్రజాస్వామ్యంగా చలామణి అయిపోతోంది. ప్రజలు కోరుకున్న ప్రజాస్వామ్యం ఇది కాదు.

ఇక్కడ ప్రజాస్వామ్యమే ఒక దిష్టిబొమ్మ. వ్యక్తి పూజ, విగ్రహారాధన నియంతృత్వానికి దారితీస్తుంది. మనకు ప్రస్తుతం కావలసింది అంబేద్కర్ విగ్రహమా? ఆ మహనీయుని ఆచరణాత్మక స్ఫూర్తా? రాష్ట్రంలో గత ఐదేళ్ళుగా నిరంతరాయంగా దళితులపై దాడులు 7.3% ఎక్కువయ్యాయి. దళితులపై అత్యాచారాలకు సంబంధించి 2019లో 45,935 కేసులు నమోదు అయ్యాయి. స్వయంగా పాలకపక్ష నాయకులే దళితుల మీద అమానుష దాడులను చేసి బోరవిరుచుకుని తిరుగుతున్నారు. ఈ సామాజిక న్యాయం అనే విగ్రహం దళితులపై జరుగుతున్న దాడులను ఆపగలుగుతుందా? ఈ అసమాన సమాజంలో దళితులు, అణగారిన వర్గాల ప్రజలకు ఆత్మగౌరవ జీవనాన్ని ఇవ్వగలుగుతుందా!

దేశంలో దారుణంగా ఆకలిసూచీ పతనమవటం, ప్రపంచ పటంలో సామాజిక నేరాల గణాంకాలలో హీనమైన స్థానానికి దిగజారటం, దిక్కుతోచని నిరుద్యోగ యువత, పౌరహక్కుల విధ్వంసం, పత్రికాస్వేచ్ఛపై నిర్బంధాలు, నిషేధాలు, 80 శాతం కుటుంబాల ఆదాయపు విలువ అట్టడుగుకి దిగజారడం, అడ్డూ ఆపు లేని నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల భారత సమాజాన్ని అంతరాలమయం చేస్తున్నాయి. 2.4 శాతానికి పడిపోయిన దేశ పారిశ్రామిక అభివృద్ధి మనది. విదేశీ పెట్టుబడుల కోసం వెంపర్లాడుతున్న పాలకపక్షాలు ప్రజలకు వరగబెట్టేదేమీ లేదు. ఈ ఆర్థిక, సామాజిక సమస్యలను బాలరాముని విగ్రహం పరిష్కరిస్తుందా? సామాజిక న్యాయాన్ని అంబేద్కర్ విగ్రహం రక్షిస్తుందా? కులతత్త్వాన్నీ, మతతత్త్వాన్నీ వాడుకునే ఎన్నికల సంస్కృతి కోట్లాది పేదలు కోరుకునే వ్యవస్థ మార్పును 75 ఏళ్ళ తర్వాత ఈనాటికీ సాధించలేదు. ప్రజల్లో నిత్యం కుల, మత – ప్రాంతీయ పరమైన సున్నితమైన భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి ఎప్పటికప్పుడు ప్రజల చైతన్యాన్ని పక్కతోవ పట్టించే కొత్త కొత్త జిత్తులను పాలకవర్గాలు పన్నుతున్నారు.

ప్రజల పోరాటతత్త్వం సంఘటితత్త్వాన్ని కోరుకుంటోంది. మనువాదానికి, మతవాదానికి, కులవాదానికి – ప్రత్యామ్నాయంగా, శ్రామికవర్గ సాంస్కృతిక పోరాట భావజాలం ఎంత పటిష్టంగా బలం పుంజుకుంటే, ఈ విగ్రహాల వంచనాశిల్పం అంతగా భళ్ళున బద్దలవుతుంది. ✷

కథ

**ఇది లెనిన్ శత వర్ధంతి సంవత్సరం....**

# సృష్టికర్త

**(స్వతంత్ర రచన 1948)**

- పమిడిముక్కల లక్ష్మీకాంతమోహన్

**అతని** పేరు చెప్పాలంటే చాలా పొడుగు, అసలు రష్యావాళ్ల పేర్లే పొడుగు! అతని పేరు మాక్సింమాక్సి మోవిచ్ పెష్కోవ్! పేరుకు తగ్గట్టు అతనూ పొడుగే! కాని, చలికాలంలో తొడుక్కోటానికి పొడుగాటి గ్రేట్ కోటు మాత్రం సంపాయించలేకపోయేడు. ఐనా సంపాదించే దెలాగు? తానేమన్నా జారు చక్రవర్తా ? కాదు, పోనీ బంగారపు గుండీల దుస్తుల్ని ధరించి, మిలమిలలాడే సూర్యకాంతిలో ధగధగ మెరసిపోతూ, యే భోగందాన్నో వెంటేసుకుని గోటుమీర నీటుగా షికార్లు కొట్టే సేనాధిపతా? కాదు. అదీ కాదయ్యా – తానేమన్నా మిర్రుగా మెక్కి, బిర్రుగా దుస్తుల్ని తొడిగి, బొర్రల్ని కనబరుస్తూ 'కార్మికులు వుత్పత్తిని, పడగొట్టే స్తున్నారు' అంటూ బెకబెకలాడే ఫ్యాక్టరీ అధిపతా? కాదు. మరి, తానేమన్నా డబ్బుకు గడ్డితిని కష్టజీవుల మీద దుష్ట ప్రచారం చేస్తూ కాకమ్మ కథల్ని అల్లుతూ, గుడ్డిగుర్రానికి పళ్ళు తోమూతూ 'చూశారా నేనెలా ప్రజల్ని టోకరాకొట్టిస్తున్నానో!? మరినాకేదన్నా ముట్టజెప్పరూ?' అంటూ ధనికుల దగ్గర తన తోకని ఆడించే ప్రతి పత్రికా సంపాదకుడా? కానేకాదే! మరేమిటితాను? తానొక కా...ర్మి....కు....డు! కనీసం గ్రిషానికి మల్లే మేస్త్రీ అన్నా గాదు; ఒట్టి వుత్త కార్మికుడు తాను!! చినిగిన గుడ్డల్తోనూ, దుమ్ముకొట్టుకున్న ముఖంతోనూ వుండి దొంగలాగా, తాగుబోతు లాగా కనిపించే కా....ర్మి.....కు....డు తాను!!! ఇలాంటి కార్మికుడు బజారెమ్మటి పోతూంటే పెద్దషాపులవాళ్ళూ, విద్యాధికులూ, ధనికులూ, వాళ్ళ యొక్క ముట్టుకుంటే మాసిపోయే కూతుళ్ళూ జడుసుకుంటారు. చోరుడేమో ననుకొంటారు.

తాను దొంగగాదు కాని తాగుబోతు. యేం తాగితే? తాగుడులో వుండే మజా యింకోదాంట్లో వుందా? ఆహ్హాహ్హా! హో, హీ, హీ, హీ, హీ ! త్రా....గు....డు...మజా ! ఆహ్హాహ్హా, హో.....

అలా తాగి వీధిలో వస్తూంటే ధనికుల మేడలూ పూలతోటలూ, ట్రోయికాలూ – అవీ యివీ కనబడతాయి. అలాంటప్పుడు 'మన మెప్పుడైనా యిలాంటి సుఖాల్ని అనుభవించ గల్గుతామా?' అని పెష్కోవ్‌కి ఆలోచన కల్గుతుంది. 'ఎంత పిచ్చి ఆలోచన'! అని అతనికి యెవరో చెప్పినట్లవుతుంది. ఆపర్నే పెష్కోవ్ యెవర్నో కొట్టబోతున్నట్లు పిడికిళ్ళు బిగించి, తాను బజార్లో వున్నానన్న సిగ్గన్నా లేకుండా, "నోర్ముయ్, నాది పిచ్చి ఆలోచనా? యేం యీ ధనికులేమన్నా పెట్టిపుట్టారా?" అని అరుస్తాడు. ఈ మాటలు విన్న బజార్లోని వాళ్ళు, 'పిచ్చిముండా కొడుకు మస్తుగా తాగాడు' అని అనుకొంటారు. కాని అతను మాత్రం యిదేమీ పట్టించుకోకుండా ధనికుల్ని కుల, గోత్ర, బిరుద, నామముల్తో సహాయెత్తి వింత వింతల బూతుల్తో శాపనార్థాలు పెడుతూ తన దోవన తాను పోతాడు.

.... ..... ....

అదీ పెష్కోవ్ సంగతి.

ఒకనాడు తానూ, తన కూతురు వోల్గా పొద్దుపోయినాక బజారు వెంట వస్తున్నారు.

'నాన్న! అమ్మ చచ్చిపోయినాక నువ్వెందుకనో కృశించి తల్లడిల్లిపోతున్నావు. పైగా యీ తాగుడు నిన్ను క్రుంగదీస్తూంది. మనం బీదవాళ్ళం. తాగమాకు నాన్నా' అని వోల్గా తన తండ్రి చెయ్యిపట్టుకొని బతిమాలింది.

'తాగన్లే అమ్మాయి. నన్ను గురించి నువ్వూ చింతపడమాకు. నేను మిట్లాకిమల్లే మస్తుగా దోసువేసి బజార్లో దొర్లేరకాన్నా? గ్రిగరీకిమల్లే తప్పదాగి పెళ్ళాన్ని చావబాదే మనిషినా? చూశావా యెప్పుడన్నా వొక్క గుటక ఆ వెధవ వోడ్కా పడకపోతే యెంటోగా వుంటందమ్మాయి. తాగుడనేది యెంత కుతో నువ్వెప్పుడన్నా తాగితే నా బాధ అర్థమవుతుంది. చూడూ – సరే – యిక నుంచీ అసలు తాగనే తాగను.'

'వొట్టుపెట్టుకో'

'యేసుక్రీస్తు తోడు. అసలు తాగనే తాగనంతే'

కొంత దూరం పోయేసరికి వో సారా దుకాణం కనబడింది. దాన్లోని పచ్చని. యెర్రని లైట్లు పూలతోటలోని పువ్వుల్లాగా మనోహరంగా వున్నాయి. సంగీతం వినవస్తూంది. యెవరో డాన్సు చేస్తున్నారు.

పెష్కోవ్, అప్రమత్తంగా జేబులు తడిమేడు; రూపాయిన్నరదాకా వుంది. నేరస్తుడికి మల్లే దీనంగా వోల్గా వంక చూసేదు; ఆమె నిట్టూర్చింది

వోల్గా గడ్డం పట్టుకొని 'అమ్మాయ్, నా చిట్టితల్లీ! యీసారికి తాగనియ్యి. యిక తాగను అసలు తాగనంటే చూశావూ – బోగంది యెంతో సారా అలాంటిది. వెధవ సారా. ఛీ, దీన్ని తాగేవాడు కుక్క కన్నా కనాకష్టం. అమ్మాయ్! చూడు చిట్టితల్లీ! వొక్కసారి....' అని బతిమాల్తూ వోల్గా యిచ్చే జవాబుకు కూడా యెదురు చూడకుండా దుకాణంలో జొరపడ్డాడు; ఆమె కళ్ళు, నీళ్లతో నిండేయి.

ఆతను తాగి, జేబుల్లో విలాసంగా చేతులు దూర్చి కూనిరాగాలు తీస్తూ ఆ చోటికి వచ్చేడు.

అరే.....వోల్గాయేది?

'అమ్మాయ్, చిట్టితల్లీ!.... వోల్గా....' అతను గావుకేక పెట్టేడు.

.... ..... ....

టష్....యిదంతా కల! కలలో ఆవేశం వచ్చినా, లేచినాక గూడా యింకా అతని గుండె దడదడమంటూనే వుంది.

అతను నిద్రమంచంమీదినించి లేచేడు. పక్క యింట్లోని గోడ గడియారం నాలుగు కొట్టింది. తాను వొంటిగంటకి వొక రహస్య మీటింగు నించివచ్చి పడుకొన్నాడు. బాగా బద్ధకంగా వుంది.

తన కర్రల్ని చంకల కింద పెట్టి కుంటు కుంటూ (అతను కుంటివాడు) బైటికొచ్చాడు. మంచు దట్టంగా పట్టివుంది. చెట్ల మీదనించి టపటపమంటూ మంచు తుట్టెలు పడుతున్నాయి. చలికి ముక్కు చెవులులోనుకుపోతూ, వేళ్ళు కొంకర్లు తిరుగుతున్నాయి. తన చినుగుల దుప్పట్ని ముఖం మీదికి లాక్కున్నాడు. బజార్లో యేమిటో మనుష్యుల అలికిడి వినబడుతూంది.

ఇలాంటి పవిత్ర సమయంలో తాను కుంటివాడైయుండటం నిరుత్సాహాన్ని, కోపాన్నీ కల్గించింది.

కాని వెంటనే ఆనాడు కామ్రేడ్, లెనిన్‌ను కల్సుకొన్న నాటి దృశ్యమూ, ఆయన మాటలూ అతని మనోఫలకంలో కన్పించాయి.

.... ..... ....

అదొక బీడు. మాస్కోకి చాలా దూరంలో వుంది. అక్కడ తుమ్మలు చాలా వున్నాయి. కామ్రేడ్ లెనిన్ వస్తాడనీ, యేమిటో చెపుతాడనీ సన్నగా రివటలాగా వుండి యేపొద్దూ దగ్గుతుండే పార్టీ కార్యదర్శి – చెప్పేడు.

సరే!....

కామ్రేడ్ లెనిన్, యెలావుంటాడో తాను చూడలేదు. అసలు యెలా వుంటాడో! మాంచికోటూ' సిల్కు నెక్ టై, నిగనిగలాడే బూట్లూ ధరించి ఆజానుబాహుడై వుంటా డన్నమాట. వెధవ మేస్త్రీలాంటివాడు షోకిల్లాగా డౌలు మండిస్తుంటే, లెనిన్ అంతటి గొప్పవాడు ఆ మాత్రం దర్జాగానన్నా వుండడా?' లెనిన్ అలావుండడోయ్ పిచ్చి నాయనా' అని కీనిటా అంటాడు! వీడిమాట నమ్మేదెలాగు?

ఈ ఆలోచనల్తో పెష్కోవ్ ఆ సీట్లో కూచుని వున్నాడు. ఇంతలో పార్టీ సెక్రటరీ దగ్గేడు. యేదన్నా వుద్రేకం గానీ, తొందరపాటు గానీ వచ్చినప్పుడే హాపిరితిపిరై దగ్గుతాడు. వూరికినే దగ్గడు. ఇప్పుడు దగ్గాడు. అయితే కామ్రేడ్ లె..ని..న్ వస్తున్నాడన్నమాట. పెష్కోవ్ చేతివేళ్ళు వణకసాగేయి.

'ష్....కామ్రేడ్ లెనిన్ వస్తున్నాడు...ష్' సెక్రటరీ విపరీతంగా దగ్గేడు. అంతా నిశ్శబ్దంగా కూచున్నారు. కీచురాళ్ళు, గీగీలూ, వచ్చేవారి పాదాల ధ్వనీ, కూచున్నవారి ఉఛ్వాస నిశ్వాసాల ధ్వనీ తప్పితే యింకేమీ లేదు.

కామ్రేడ్ లెనిన్! హో!! కామ్రేడ్!!! ఆనందంతో పెష్కోవ్ గుండె దడదడమనింది. ఎవరో గుసగుసలాడుతూంటే, పరవశుడైయున్న పెష్కోవ్ వుగ్రుడై 'హేయ్ మిష్టర్! యిది చాపల బజారు గాదు. సైలెన్సు!' అని తనకు తెలీయ కుండానే అరిచేడు.

తర్వాత యెవరో అయిదారుగువచ్చి కూచున్నవారికి నిశ్శబ్దంగా శాల్యూట్ చేసేరు. పెష్కోవ్ ఒళ్ళుమరిచిపోయి సంతోషంతో రెండు మూడుసార్లు ప్రతివందనంజేసి దడబిడపడ్డాడు.

గుడ్డివెన్నెల వేస్తూంది. ఆకాశాన కమ్మిన మబ్బులు పడమటి దిక్కుగా పయనించుతున్నాయి. ఆ వెన్నెల్లో తుమ్మ చెట్లమీది మంచు తళతళ మంటూంది. పక్కవానిని మోచేత్తోతట్టి 'అందులో లెనిన్ యెవరూ?' అని పెష్కోవ్ అడిగేడు. అతనొక వ్యక్తిని చేత్తో చూపించాడు.

ఆ వ్యక్తి పొట్టివాడు పెద్ద బట్టతల. విశాలమైన నుదురు. బుల్లిగడ్డం, చిన్ని కళ్ళు, చిక్కిన ముఖం; దాని మీద పసిపాపలాంటి చిరునవ్వు చిందులాడుతూంది. చినిగిన కోటూ వేసుకొని కార్మికుడులాగా వున్నాడు. అతడే కామ్రేడ్ లెనిన్!

పెష్కోవ్‌కీ ఆశ్చర్యమూ, ఆనందమూ, కలిగేయి. లెనిన్ అచ్చం తనలాంటి కార్మికుడే! అబ్బ యెంత వినయం! అదుగో లెనిన్ నవ్వుతున్నాడు. యేమినవ్వు! తల్లివొడిలోని పసిపాప–ముద్దులపాప–నవ్వు! విరగబడి నవ్వుతున్నాడు. ఆ నవ్వుతో పెష్కోవ్ నరాల్లో యేదో విద్యుత్తు–విప్లవ విద్యుత్తు–ప్రవహించి నట్లనిపించింది. మిగతా వారికి గూడా అంతేనా? ఆవును అంతే. అందరూ ముగ్ధులైయున్నారు! హో....మన లెనిన్.

లెనిన్ యీ విద్రోహకర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవాన్ని తీసుకురావాల్సిన అవసరాన్ని గురించీ; అందులో కార్మికుల, రైతుల యితర పేదల పాత్రల్ని గురించీ విపులముగా మాట్లాడేడు.

ఎలా మాట్లాడేడనీ! పెద్దపెద్ద మాటలూ సమాసాలూ లేకుండా తేలికభాషలో సామెతల్ని, చెణుకుల్నీ వుపయోగిస్తు, నవ్విస్తూ, వుద్రేక పరుస్తూ శత్రువులంటేనే ద్వేషం పుట్టిస్తూ మాట్లాడేడు; కార్మికుడి భాషలో వుపన్యసించేడు. అబ్బ యెంత సామాన్యుడు, యెంత ప్రతిభావంతుడు మన లెనిన్!

లెనిన్ వుపన్యాసంతో పెష్కోవ్ వుత్సాహితు డయ్యేడు. కాని అతన్ని వొక ధర్మసందేహం పీడిస్తూంది. తను కుంటివాడు; యీ విప్లవంలో తానేమి చేయగల్గుతాడు?

తలవనితలంపుగా పెష్కోవ్ లేచి నిలబడి వణుకుతూన్న గొంతుకతో యిలా అడిగేడు; 'కామ్రేడ్ లెనిన్! నా భార్య చచ్చిపోయింది; నా కూతుర్ని యెత్తుకుపోయారో లేక ఆమే పోయిందో యింతమట్టుకూ తెలీదు. నాకు నేనే దిక్కు. పైగా కుంటివాడ్ని. ఈ విప్లవంలో నేను యేమన్నా చేయగల్గుతానా?'

ఇది విన లెనిన్ ముఖం చిరునవ్వుతో పుష్పంలాగా వికశించింది. అంతలో గంభీర ముద్ర దాల్చింది. తనకు సహజ లక్షణమైన రీతిలో కుడిచేతిని చంకలోనికి పోనిచ్చి, యెడం చెయ్యి కొంచెం బిగబట్టి ముందుకు సాచి, కొంచెం ముందుకు వంగి, కొంచెం తలెత్తి పెష్కోవు వైపు తిప్పి కామ్రేడ్ లెనిన్ యిలా అన్నాడు! 'కామ్రేడ్! నువ్వూ మంచి ప్రశ్నే అడిగావు నేనిలాంటి ముఖ్యమైన సంగతిని చెప్పకుండా వదిలివేసినందుకు నన్ను క్షమించమని కోరుతున్నా...'' "కామ్రేడ్ యెబ్బెబ్బే నేనేమిటి? మీయంతటి వారిని క్షమించట మేమిటి? యెబ్బెబ్బే....'' అని యింకా నిలబడే వున్న పెష్కోవు తడబడుతూ అడ్డుతగిలేడు.

"కాదు కామ్రేడ్! నిన్ను నువ్వు ఆలా కించపరుచుకోమాకు! మనలో యెక్కువ తక్కువలు లేవు. తెల్సిందా? సరే. యిదిగో విను. అన్ని రకాల ప్రజలూ – అంటే – ముసలీ ముతకా, ఆడా మగా, చిన్నా పెద్దా, మంచివారూ రోగులూ – అంతా గూడా – విప్లవానికి సహాయం చెయ్యగలరు. విప్లవాన్ని యెలా జయప్రదంగా

నడవాలో తెలుసా? సమయం వచ్చినప్పుడు ఆలస్యం పనికిరాదు, నిర్ణయాలు తీసుకోవటంలో వూగిసలాట కూడదు. లేకపోతే విప్లవం వోడిపోయిందన్నమటే. తెల్సిందా కామ్రేడ్?'

"ఆ, తెల్సింది. తెల్సింది." పెష్కోవ్ అన్నాడు తందరిబిందరతో "రైట్. విప్లవకారుని ప్రధాన బాధ్యతేమిటి? శారీరకంగా కుంటివాడు కాకుండా వుండటమూ గుడ్డివాడు కాకుండా వుండటమూగాదు. కాని, రాజకీయల్లో మాత్రం కుంటితనం గుడ్డితనం పనికిరావు. తెల్సిందా? సరే విప్లవం జయించాలంటే – దూరదృష్టితో అతి త్వరలో నిర్ణయాలు తీసుకోవటం, అందుకై యావచ్ఛక్తినీ వొడ్డటం, ప్రతి సంఘటననీ విప్లవానికి అనుకూలంగా వుపయోగించుకోవడం సమయం చిక్కినప్పుడు వెన్వెంటనే విప్లవాన్ని రగుల్కొల్పటం. దానిని సరైన మిక్కిలి సరైన కార్యాచరణకు తిప్పటం. అపజయాల్లో గుండె నిబ్బరం కల్గివుండటం, జయాల్లో తలపొంగి పోకుండా వుండటం చాలా అవుసరం. ఇవి విప్లవకారుని ప్రధాన బాధ్యతలు. తెల్సిందా? యిదిగో, నిరుత్సాహపడకు కామ్రేడ్, ధనిక వాదుల పరిపాలనలో బంగారమూ, మణులూ, రత్నాలూ మట్టిగా మారిపోతాయి. కాని మన పాలనలో కమ్యూనిస్టు పాలనలో–అలా కాదు. మనం మట్టి నుంచి బంగారాన్ని సృష్టిస్తాం. భూమి మీద స్వర్గం నిర్మిస్తాం. కనక తెల్సిందా కామ్రేడ్? నువ్వు కూడా విప్లవానికి తోడ్పడగలవు."

పెష్కోవు సంతృప్తి చెందేడు.

తర్వాత తాను వెళ్ళిపోయేప్పుడు లెనిన్ ప్రత్యేకంగా పెష్కోవు కరస్పర్శ చేసి అతన్ని అభినందించి మరీ వెళ్ళేడు!

.... ..... ....

ఆనాటి సంగతి యిప్పుడు బజారులో, చలిలో నిల్చొన్న పెష్కోవుకి తలుపుకొచ్చింది. తర్వాత అనేక సంఘటనలు జరిగాయి.

తాను ఐదింటికల్లా బస్సుస్టాండు చేరుకోవాలి, పెష్కోవు గబగబా తన కుంటి నడక సాగించేడు. బజార్లల్లో జనం కిటకిట లాడుతున్నారు. అతను గమ్యస్థానం చేరేడు. అక్కడ చాలా మంది వున్నారు. అందరూ పరిచిత కార్మికులే. ముఖాలన్నీ గంభీరంగా వున్నాయి; వుద్రేకంతో రకరకాలుగా చర్చించు కొంటున్నారు.

'కామ్రేడ్స్ అంతా లైనులు తీరి రాజ భవనానికి పదండి' దళనాయకుడుగా బోలు బొబ్బరించేడు.

వొక్కసారిగా అంతా లైనులుదీరి లెనిన్, స్టాలిన్లకు జేజేలు సాగించేరు.

'పదండి ముందుకు' దళవాయి ఆర్డరిచ్చేడు. దళం కదిలింది. పెష్కోవు కూడా అందులో వున్నాడు.

యింతలో నొక పోలీసు అటువచ్చేడు.

హీహీహీ అటు చూడవోయ్ అలెగ్జి గాడిద చక్రవర్తిగారి పరిపాలనలో పంది బావగారు తుపాకి పట్టుకొని డ్యూటీలోనికి అఘోరించు చున్నారు!! హేయ్ దెయ్యమల్లే చూస్తావెందుకూ? ఆ తుపాకి యిటుతే. హుం....దబ్బుని....' పెష్కోవు గర్జించేడు. నిలువు గుడ్లు పడిన పోలీసు తన తుపాకిని పెష్కోవుకిచ్చి దిష్టిబొమ్మలాగా నిలబడి పోయేడు' పెష్కోవు నీటుగా ఆ తుపాకిని వీపుకు తగిలించేడు.

ఇలాగే అనేక ప్రజాసైనిక దళాలు ఫ్యాక్టరీల్నీ, రైల్వేన్నీ, వోడ రేవుల్నీ, పట్టణాల్నీ, భవనాల్నీ ఆక్రమించుకోటానికి ఆనాడు – నవంబరు 7న బయలుదేరేయి, లక్షల కొద్దీ సైన్యం వచ్చి ప్రజల్తో కలిసిపోయింది.

మన కార్మికదళం రాజభవనం వద్దకి పోయింది. గేటుమూసి వుంది. దళం తటపటా యిస్తూంది. దళవాయి టోపీతీసి, బుర్ర గోక్కొవసాగేడు.

"విరగ్గొట్టండోయ్ వెధవ గేటునీ, ఇంకా ఆలోచిస్తారెందుకు?" పెష్కోవు స్వతంత్రంగా నాయకత్వం పుచ్చుకొని అరుపు అరిచాడు. కార్మికులకు సలహా నచ్చింది. చేతకందిందల్లా ఉపయోగించి గేటుని తునాతునకలు చేసేరు. లోపలి కాపలావాళ్ళు చేతుల్లోని తుపాకులనక్కడ పారేసి పారిపోయేరు.

గేటుదాటినాక వొక పెద్ద పూలవనం గుండా వొక నున్నటి రోడ్డు వొక సుందరమైన భవనం దాకా వుంది. కార్మికులు అడ్డగోలుగా చెదిరిపోయి పూల మొక్కల్ని కసితో నేలమట్టం చేయసాగేరు.

పెష్కోవు వుగ్రుడయ్యేడు. "ఓ దెయ్యాల్లారా యేమిటా కోతి పనులు? రండి. రేపు ఆ మొక్కలు ఆ పూలూ మన పిల్లలకి పనికొస్తాయి. రండీ."

కిక్కురుమనకుండా అంతా వచ్చేరు; రాజభవనం వద్దకి చేరుకొన్నారు. వొక పెద్ద ద్వారానికి తలుపువేసి వుంటే దాన్ని కూడా పగలగొట్టిలోని కెళ్ళారు. గేటువద్దా, తలుపువద్దా కొందర్ని వుంచి మిగతా వారితో పెష్కోవు యింకా లోనికి వెళ్లేడు. అక్కడొక భవనం వుంది. పాలరాతితో కట్టిన దాని గోడలు ధగధగ మెరసిపోతున్నాయి. వాటి మీద రకరకాల రంగుల్లో పూలవనాలూ, సరస్సులూ, నగ్న స్త్రీలూ, నెమళ్ళూ, బొమ్మలు చెక్కబడి వున్నాయి.

"వీటిని మన శ్రమజీవులు నిర్మించారు. యివాళనించీ యివి మనవే?" పెష్కోవు సగర్వంగా అన్నాడు.

"హూ, పిరికి వెధవలు యెవరూ లేకుండా పారిపోయారు' అతనన్నాడు. అంతఃపురంలోకి పోయేడు. ఎందువల్లనో తలుపులు తెరిచే వున్నాయి. పెష్కోవు గదిలోకి పోగానే వొక పెద్ద తెల్లటి పాన్పుమీద కూచున్న ముగ్గురు స్త్రీలు దడాలున నిలబడ్డారు. ఆ ముగ్గురి మెడలు చుట్టూ మూడు కలువ పూవుల్లాగా గొన్లు వికసించి వున్నాయి – వారి లే గులాబీ చెక్కిళ్లూ నిర్మలమైన కళ్లూ ప్రభుత్వ యంత్రాని కంటే గూడా పాలిపోయి నీరసంగా వున్నాయి. వీరిని చూసి ద్వేషంతో అతను పళ్ళు కొరికేడు.

కాసేపు నిశ్శబ్దం.

తటాలున ఆ ముగ్గురిలోనూ పెద్దది అతని వద్ద కొచ్చి మోకరిల్లి "యేసుప్రభువు మిమ్మల్ని రక్షించుగాక! మా ప్రాణాలు కాపాడండి" అని వేడుకొన్నది.

"హు! యేసు ప్రభువు!" వందల సంవత్సరాల్నుంచి నాలాంటి బీదల్నీ యీ చక్రవర్తులూ, దొరలూ, భూస్వాములూ, అధికార్లు రక్తం త్రాగుతూ, మీలాంటి స్త్రీల పక్కల్లో పడుకొని కులుకుతుంటే యే యేసు ప్రభువు రక్షించి యేడ్చాడు యిప్పుడు నిన్ను రక్షించటానికి?

"దేవుడి పేరు, దెయ్యం పేరు చెప్పి మమ్మల్ని భయపెట్టి, కాలికింద వుంచుకొని మీరు మీ మగాళ్ళూ తాగి తందనాలాడారు".

"మొఖానికి సిగ్గులేదూ? పైగా యేసు పేరు యెత్తుతావెందుకు ముండా".

"మీ మగాళ్ళు మా ఆడవాళ్ళని చేసినట్లు మేము మిమ్మల్ని చెయ్యం. మీకొచ్చిన భయంయేమీ లేదు తెల్సిందా!"

యింతలో పక్కగదిలోంచి యేదో మూల్గుడు వినవచ్చింది.

"యెవరా మూల్గేది?"

"వొక ఆడది"

"యెందుకని?"

"జనమంతా యెదురు తిరిగారని తెలిసి మా రహస్యాలు యేమన్నా చెపుతుందేమోనని బంధించాం,"

"ఓసి ముండల్లారా, యెంతపని! ఆ మనిషి మీ మనిషేనా?"

"కాదు. మా భటులు దొంగతనంగా యెత్తుకొచ్చిన ఆడవాళ్ళల్లో యిదీవొకటి"

"ఓసి ముండల్లారా. హూం. ఆ మనిషిని యిటు తీసుకురండి. జల్దీ" కిక్కురుమనకుండా వాళ్ళు పోయి ఆమెని తీసుకొచ్చేరు.

యెవరామె? యెవరు!?

"వోల్గా"

"నాన్నా" ఆమె పెష్కోవ్ కూతురు వోల్గా! తండ్రీ కూతుళ్ళు వొక్కసారిగా కౌగిలించుకొన్నారు.

"ఓసి ముండల్లారా. యెంత పనిచేశారే! సరే. అమ్మాయి! మనకి తొందర పనుంది పద. గ్రీషా హేయ్ గ్రిషా!" గ్రిషావచ్చాడు.

"యిదుగో యీ ముగ్గుర్నీ ఆ గదిలో పారెయ్. వాళ్ళని, యేమి చెయ్యమాకు నేను కబురంపే దాకా యిక్కడే వుండు."

కూతురుతో పెష్కోవ్ హాలులోకి వచ్చేడు. అక్కడెవర్నో వొక లావాటి భటుడ్ని లంకించుకొని వాడి మీద వుమ్ములూస్తూ యేడిపిస్తున్నారు కార్మికులు.

"కామ్రేడ్స్ ఆపండి. యిదిగో మీలో వొక వందమంది – ఆదుగో ఆ లోపలిగదికి కాపలా వుండండి. తక్కినవాళ్ళు నాతో రండి. రెడ్ స్క్వేర్‌లో మీటింగు వుంది. జల్దీ' పెష్కోవ్ బొబ్బరించేడు.

అంతా అతని అజ్ఞ పాటించేరు. రెడ్ స్క్వేర్ వైపుకి దళం సాగుతూంది. వీరక్కడికి చేరేసరికి కారులోవున్న మైక్రోఫోనులో ఎవరో యేమిటో చదివి వినిపించుతున్నారు.

"…..కామ్రేడ్స్! యీ భవనాల్నీ, ఫ్యాక్టరీల్నీ వొకటేమిటి, సర్వాన్నీ – మీరే–బీద ప్రజలైన మీరే నిర్మించారు. నేటి నుండీ యిక మీరే వాటికి అధిపతులు. మనం తీసుకొచ్చిన యీ మహా విప్లవాన్ని చూసి, బీదవారు, అధికారంలోకి రావటం చూసి బెదిరిపోయి ధనికవర్గం యొక్క తొత్తులూ, వారి బడితొత్తులైన పత్రికలు మనది "రక్తపాతమైన" విప్లవమనీ "నిరంకుశత్వ" మని యింకా యేమేమో వాగుతాయి; విలపిస్తాయి. ఇప్పుడేగాదు యెప్పుడైనా యీ బాతాఖానీ డొక్కు పత్రికల నీతే అది. కాని మనకేం ఫర్వాలేదు; వాటిని మొరగనియ్యండి. రష్యాలోని ధనికులు, కోట్ల కొలది ప్రజలరక్తం తాగుతుంటే నోరుమెదపని యీ నపుంసకపు పత్రికలు మన మీద దుష్ట ప్రచారం జేస్తాయి. కాని యిక యెంతో కాలం యీ బెకబెకలకు ప్రజలు మోసపోరు. భవిష్యత్తు ప్రజలదే. విజయం మనదే, ఇక మన దేశాన్ని పునర్నిర్మించటానికి నడుములు బిగించండి."

కిటకిటలాడుతూన్న జనసమూహం వొక్కసారి చప్పట్లుగొట్టేయి; మాస్కో నగరం ప్రతిధ్వనించింది.

"నాన్నా యెవరా సందేశం యిచ్చింది." వోల్గా అడిగింది.

"యింకెవరు? మన లెనిన్! మన కామ్రేడ్ లెనిన్! అజ్ఞాతవాసంలో వుండిగూడా మనకీ సందేశం వినిపించమని పంపించాడు!" పెష్కోవ్ సగర్వంగా అని కూతురు భుజం తట్టేడు. ✺

కవిత

# హక్కుల శాసనం

– టి.వి.రెడ్డి

నేడు ప్రపంచ మానవ మరియు
జంతు హక్కుల దినోత్సవం ,
జంతువులు మూగజీవులు ,
మానవులు మౌనజీవులు,

ఆధునీకరణ ముసుగులో ,
అడవులు ఎడారులుగా మారి ,
పల్లెలు, పట్టణాల రహదారుల్లో ,మృగాలు
సంచరిస్తూ విగత జీవులు అవుతున్నాయి.

జనారణ్యంలో
మనుషులు మాయమవుతున్న వేళ,
మానవ మృగాల స్వైరవిహారంలో ,
అబలలు ఆహుతి అవుతున్నారు ,

ముసుగు సేవకులు వారసత్వంగా ,
రాచరిక పాలన కొనసాగిస్తూ ,
చట్టాలు అయినోళ్లకు కంచంలోను ,
కానివారికి కన్నీళ్ళలోనూ వడ్డిస్తున్నారు.

హక్కుల గురించి ప్రశ్నించిన గొంతులకు,
జైలు వూసలే రక్షణ కవచాలైనాయి ,
పాలకుల్లో పారదర్శకత పారిపోగా ,
జవాబుదారీతనం జనానికి దూరమైంది.

ఇప్పుడు మనం అడవులు పెంచాలి ,
వన్యప్రాణులు ,మానవులు ,
సహజీవనం చేయాలి ,
సరికొత్త హక్కుల శాసనం రాయాలి.

(డిశంబరు 10 - ప్రపంచ మానవ, జంతు హక్కుల దినోత్సవం సందర్భంగా) ✺

వ్యాసం

# అంటరానితనం సమస్య

- సింగారవేల్ చెట్టియార్

*(సింగారవేల్ చెట్టియార్ ప్రముఖ తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతియార్‌కు మిత్రుడు. భారతియార్ ద్వారా మార్క్సిస్టు సాహిత్యాన్ని పొంది అధ్యయనం చేయటమేకాకుండా, స్వయంగా ఆయనే లండన్ న్యూయార్క్ తదితర నగరాల నుండి మార్క్సిస్టు సాహిత్యాన్ని తెప్పించుకొని, అధ్యయనం చేసారు. ప్రాథమిక మార్క్సిస్టు సూత్రాలను పలు తమిళ పత్రికలతోపాటు, ది హిందూ - ఆంగ్ల జాతీయ దినపత్రికలో వ్యాసాల ద్వారా ప్రచారం చేశారు. ఆయన **1907** నుండే కార్మిక ఉద్యమంలో పనిచేసి, పలు సంఘాలకు నాయకత్వం వహించారు. చరిత్ర ప్రసిద్ధమయిన **1928** దక్షిణ భారతదేశ రైల్వే సమ్మెకు నాయకత్వం వహించారు. సామాజికరంగంలో కూడా ఆయన పెరియార్ రామస్వామి నాయకర్ (ఇ.వి.)తో పాటు ఆత్మగౌరవ ఉద్యమం (బ్రాహ్మణేతర కులాల)లో పనిచేశారు. సమాజంపై కులం, మతం ఆధిపత్యం వుండరాదనీ, కుల నిర్మూలన జరగాలనే లక్ష్యంతో ఆయన కృషిచేశారు.*

*భారతదేశంలో మొట్టమొదటిసారిగా మేడేను సింగారవేల్ చెట్టియార్ మద్రాసు నగరంలో **1923**, మే ఒకటవ తేదీన నిర్వహించారు. జలియన్ వాలాబాగ్ దురంతాన్ని ఖండిస్తూ, ఆ మారణ హోమానికి నిరసనగా కార్మికులకు రాజకీయ సమ్మె జరపాల్సిందిగా పిలుపునిచ్చారు. అసాధారణమైన రీతిలో ఆ సార్వత్రిక సమ్మె విజయవంతమయింది. **1922**లో భారతదేశాన్ని సందర్శించిన వేల్స్ రాకుమారుడి పర్యటనను బాయ్‌కాట్ చేయటాన్ని మద్రాసులో ఆయన ఎంతో ప్రభావవంతంగా నిర్వహించారు.*

***1923** మేడే రోజున ఆయన ఇతరులతో కలసి లేబర్ కిసాన్ పార్టీని స్థాపించారు. ఆ పార్టీ ప్రణాళికలో **8** గంటల పనిదినపు డిమాండును (కార్మికులకు) లేవనెత్తారు. ఆ పార్టీ తరపున లేబర్ కిసాన్ గెజిట్ అన్న ఇంగ్లీషు పక్షపత్రికనూ, తొజిలాలన్ (కార్మికుడు) అనే తమిళ వారపత్రికనూ ప్రారంభించారు.*

*సింగారవేల్ చెట్టియార్, **1860** సంవత్సరంలో ఫిబ్రవరి **18**న మద్రాసులో జన్మించారు. **1946** సంవత్సరంలో ఫిబ్రవరి **11**న మరణించారు. ఆయనకు మద్రాసు నగరంలోని కమ్యూనిస్టుపార్టీ ఏ.ఐ.టి.యు.సిలు ఒక ఎర్రవీరుని (కమ్యూనిస్టు వీరునికి) జరిపే అంత్యక్రియలు నిర్వహించాయి. ఆ మహావీరుని గుర్తుచేసుకుంటూ ఈ వ్యాసాన్ని ప్రచురించిస్తున్నాం.*

***1924** జనవరిలో మహానాయకుడు లెనిన్ మరణించిన సందర్భంగా, లేబర్ కిసాన్ పార్టీ కార్యాలయంలో ఎర్రజెండాను సగంవరకూ అవనతం చేసి నివాళులర్పించారు. లేబర్ కిసాన్ గెజిట్‌లో లెనిన్‌కు నివాళులర్పిస్తూ వ్యాసాలు ప్రచురించారు.*

*సింగారవేల్ చెట్టియార్‌ను దక్షిణ భారతదేశంలోని మొట్టమొదటి కమ్యూనిస్టుగా పరిగణిస్తారు. **1925**లో కాన్పూర్‌లో జరిగిన దేశంలోని మొట్టమొదటి కమ్యూనిస్టుల మహాసభకు ఆయన అధ్యక్షత వహించారు. తన అధ్యక్షోపన్యాసంలో పలు విషయాలపై తన అభిప్రాయాలను విశదీకరించటంతోపాటు "అస్పృశ్యతా" సమస్య గురించి తన అభిప్రాయాలను వివరించారు. అంటరానితనం నిర్మూలన ఏవిధంగా సాధ్యమవుతుందో వెల్లడించారు. అది సాధ్యం చేయకపోతే రాబోయే ప్రమాదాన్ని యీవిధంగా హెచ్చరించారు : "చారిత్రిక కాలం నుండీ, మన రాజకీయ ఐక్యతను మతం, కులం అనే రాక్షసులు మింగివేస్తున్నారు. ఈరోజున మనదేశం యీ మత, కుల విభేదాల వలన చీలికలు, పీలికలుగా చిరిగిపోయింది. మతం, కులాల గురించి వర్ణిస్తూ, పొగడుతూ చూపించే నాయకులందరూ, మన దేశానికి, మన లక్ష్యానికీ కూడా ద్రోహులు. హిందూ సభలు, సంఘటనలు, శుద్ధి కార్యక్రమాలు కేవలం తీరికగా వున్న బూర్జువావర్గాలవారి ఎత్తుగడలే!. అందువలన మనం కులాన్నీ, మతాన్నీ, మతపర సంప్రదాయాలను విడనాడుదాం!..."*

*అదే ఉపన్యాసంలో "అంటరానితనం సమస్య" గురించి తన అభిప్రాయాలను యీవిధంగా వివరించారు. - సం॥)*

**ముందుగా** నేను అంటరానితనం సమస్యను తీసుకొని, ఆ సమస్యకూ మన పార్టీకి గల సంబంధాన్ని గురించి నా అభిప్రాయాన్ని తెలియజేస్తాను. కమ్యూనిజం యొక్క దృక్పథం ప్రకారం, అంటరానితనానికి సంబంధించిన ప్రశ్న పూర్తిగా ఒక ఆర్థిక సమస్యేనని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఈ తరగతికి చెందిన ప్రజలను గుళ్ళలోకి ప్రవేశించనిస్తున్నారా, లేదా చెరువులలోకి, వీధుల్లోకి ప్రవేశించనిస్తున్నారా లేదా అన్న ప్రశ్న స్వరాజ్యం కోసం మనం జరుపుతున్న పోరాటానికి సంబంధించినది కాదు.... కమ్యూనిస్టులకు కులంకానీ, మతంకానీ, మత సాంప్రదాయాలు కానీ లేవు. హిందువులుగా, మహ్మదీయులుగా లేదా క్రిష్టియన్లుగా వారికి వ్యక్తిగతంగా అభిప్రాయాలు వుండొచ్చును గాక! విశాల ప్రజాబాహుళ్యమైన ఈ భారతీయుల (దళితుల) యొక్క ఆర్థిక పరాధీనతే ప్రధానంగా, సారాంశంలో అంటరానితనంలో కూడి వుంది. ఈ ఆర్థిక పరాధీనత పరిష్కరింపబడిన వెంటనే, అంటరానితనం యొక్క సామాజిక కళంకం రూపుమానక తప్పదు. స్వంత భూమి

కలిగి వుండటంలోని యీ అసమానతే, అణగద్రొక్కబడిన విస్తృత ప్రజా బాహుళ్యంలో యీ దుర్మార్గపు అంటరానితన జాడ్యం మనుగడలో వుండటానికి ప్రధాన కారణంగా వుంది. కేవలం దేవాలయాల్లోకీ, చెరువుల్లోకి, వీధుల్లోకి ప్రవేశం కల్పించటం వలన యీ అభాగ్య సోదరుల యొక్క సామాజికస్థాయి, తమ సంపన్నమైన, ఐశ్వర్యవంతులైన సోదరులతో సమాన స్థాయికి పెరగదు. అంటరానితనపు సమస్య ప్రధానంగా వ్యవసాయరంగానికి చెందిన సమస్య. ఈ ఆర్థిక పరాధీనతను తొలగించకుండా, అంటరానితనపు నిర్మూలనను గురించి మాట్లాడట మన్నది పూర్తిగా చిత్తశుద్ధి లేనితనమే అవుతుంది. మన తోటి మానవులను అంటరానివారిగా పరిగణించటాన్ని గురించి ఎంత ఘోరమైన అన్యాయం, అమానవత్వం అని ఎంత పెద్దగా గొంతెత్తి అరిచినా, అటువంటి మహానుభావులు చాలా జాగ్రత్తగా ఆ అభాగ్యులు ఆకలితో అలమటించటం, కరువుతో బాధపడటం లాంటి సమస్యలను ప్రస్తావించకుండా తప్పించుకొంటున్నారన్నమాట! ఇది భారతీయ సంస్కరణవాది యొక్క బూర్జువా మనస్తత్వానికి ఒక చక్కని ఉదాహరణ. వీళ్ళు ఎంతో గట్టిగా సామాజిక తప్పిదాల గురించి ఉపన్యాసాలు దంచుతుంటారు. కానీ, మనదేశంలోని బూర్జువాలు పదుల లక్షలమంది వ్యవసాయరంగ కూలీలను ఏవిధంగా ఆర్థిక అథమస్థాయికి నెట్టివేశారు అన్న విషయంపట్ల మవునంగా వుంటారు. ఈ సమస్యకు ఏకైక హేతుబద్ధమైన పరిష్కారం ఏమిటంటే, సామాజిక అధోగతిలో మగ్గుతున్న యీ అభాగ్యులను, తమ అదృష్టవంతులైన సోదరుల స్థాయికి, ఆర్థిక సమానత్వం ద్వారా, సామాజిక అధోస్థితి నుండి పైకి లేపటమే! కేవలం అంటరానితనాన్ని నిర్మూలించటం అన్న విషయం గురించే మాట్లాడట మన్నది చిత్తశుద్ధి లేని తనమే కాక హాస్యాస్పదమైనది అవుతుంది. అందువలన, కమ్యూనిస్టులైన మనం, అణచబడ్డ వర్గాలవారి యొక్క ఆర్థిక హక్కుల సాధన కోసం పోరాడాలి. వారి జీవితాలు కనీసం భరించటానికి వీలైన విధంగా వారికి జీవన వేతనం చెల్లించాలి! అని మనం వాదించాలి!.. కమ్యూనిస్టులమైన మనం దేశం యొక్క ఆర్థిక జీవితాన్ని మెరుగు పరచటం కోసం, మన మహత్తర జీవిత లక్ష్యంపై ఏవిధంగానూ ప్రభావం చూపని కులాల ఐక్యతను సాధించటం కోసం చూడాలి!

పాట

# ప్రజాకళలకు జీవం పోద్దాం

– డాక్టర్ జి.వి. కృష్ణయ్య

పల్లవి : జనసాహితి జెండా వారసులం
జన జీవన సంస్కృతి వారధులం
చీకటి బ్రతుకుల జీవితాలకు
వెలుగు బావుటా చూపరులం
కలం గళం సాధనాలుగా
ప్రజాసాహితీ కళాకారులం. ॥ క ॥ జ ॥

చరణం1 : అజ్ఞానాంధపు విశ్వాసాలు
మూఢాచారపు దురాగతాలు
క్షీణ విలువలు క్షుద్ర సంస్కృతి
దావానలమై వ్యాపిస్తున్నవి !
స్త్రీని బానిస భోగ వస్తువుగ
తీర్చిదిద్దిన ధర్మ సూత్రములు
తరతరాల దాస్యానికి బందీ
ఇంకెన్నాళ్ళీ సంకెళ్లు. ॥ జన ॥

చరణం2 : నిచ్చిన మెట్ల కులవిద్వేషం
మౌఢ్యం పెంచే మత ఉన్మాదం
పెత్తందారుల అరాచకత్వం
దోపిడి మూకల మారణ హోమం!
భావదాస్యపు రంగుల కలలు
భ్రమలను పెంచే పాలకఘనులు
దురహంకారపు జాతీయవాదం
ప్రగతి నిరోధక దళారితత్త్వం. ॥ జన ॥

చరణం3 : వేషభాషలా వ్యామోహాలు
కృత్రిమ విలువల విన్యాసాలు!
భుజకీర్తులకై భజన కీర్తనలు
యాచక పాత్రల ఎదురుచూపులు
టీవీ సినిమా సెల్ఫోన్ మాయలో
సెక్సు హింసల అకృత్యాలు
వితండవాదం కుహనాతర్కం
భక్తి ముసుగులో ఘరాన మోసం! ॥ జన ॥

చరణం4 : స్వేచ్ఛ పేరిటా పలాయనాలు
సమష్టి కృషిపై పరాచికాలు
మనుషుల మధ్యన గోడలుకట్టే
ఆధునికోత్తర సిద్ధాంతాలు!
ప్రపంచీకరణ పెనుముప్పెనలో
సరళీకరణ సెగ పెడుతోంది
గ్లోబల్ ఖడ్గం ఝులిపిస్తోంది
గోముఖ వ్యాఘ్రం గర్జిస్తోంది ॥ జన ॥

చరణం5 : దోపిడీ పీడన పోయేదాకా
శ్రామిక విముక్తి కలిగేదాకా
జీవనాడిగా ప్రజాసాహితీ
ప్రజా కళలకు జీవంపోద్దాం!
సామ్రాజ్యవాదంతో సంఘర్షించే
కార్యాచరణే ఆశయ బలమై
ప్రజాస్వామిక భావధారకై
ప్రగతి పథాన పయనిద్దాం ॥ జన ॥

దేశ విభజన వస్తువుగా సాహిత్యం-16

# చమన్ నహాల్ నవల 'ఆజాదీ'

- కొత్తపల్లి రవిబాబు

**ఈ** మధ్య కొన్నేళ్ళుగా దేశవ్యాప్తంగా, జె.ఎన్.యు. విద్యార్థుల ఆందోళన ఫలితంగా 'ఆజాదీ' నినాదం ప్రతిధ్వనిస్తోంది. 'ఆజాదీ' అంటే 'స్వాతంత్ర్యం' అని అర్థం. 1947లో వచ్చిన 'ఆజాదీ', దేశ విభజన సందర్భంగా లక్షలాది హిందూ, ముస్లిం, సిక్కు ప్రజల ప్రాణాలను తీసింది. వారికి 'ఆజాదీ' అంటే తరతరాల నుంచి వుంటున్న వారివారి ఇళ్ళ నుండి, వూర్ల నుండి, పొలాల నుండి వేరే ప్రదేశానికి తట్టా, బుట్టా సర్దుకొని శరణార్థుల్లా తరలి వెళ్ళడమే! 'ఆజాదీ' సంబరాలు వారికి లేవు. ప్రస్తుతం పాలకుల నిరంకుశ విధానాల వల్ల మత విద్వేషాలను రెచ్చగొట్టే పద్ధతుల వల్ల, దేశాన్ని సామ్రాజ్యవాద కార్పొరేట్లకు అప్పచెబుతుండటం వల్ల దేశంలో క్రమక్రమంగా మృగ్యమౌతున్న నామమాత్ర స్వాతంత్ర్యం వల్ల మరల 'ఆజాదీ' నినాదాన్ని ప్రజలు పదేపదే ఉచ్చరించాల్సిన నినాదమయ్యింది. మొత్తం మీద 75 ఏళ్ళ 'స్వాతంత్ర్యం', దేశంలో అత్యధిక ప్రజలకు సంక్షేమాన్ని అందించలేకపోయింది. ఈసారి పరోక్షంగా సామ్రాజ్యవాద దేశాలకు అర్ధవలస, అర్ధబానిసగా మారింది.

1947 నాటి దేశ విభజన ఫలితంగా పంజాబ్‌లోని ప్రజలు పడిన బాధామయ గాథలను అత్యంత ప్రతిభావంతంగా తన నవల 'ఆజాదీ'లో చిత్రించిన చమన్ నహాల్ కుటుంబం కూడా శరణార్థుల కుటుంబమే! ఆయన సియాల్‌కోటలో 1927లో జన్మించి, 20-11-2013న న్యూఢిల్లీలో మరణించారు. 1948లో ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు సాహిత్యంలో ఎం.ఏ. చదివారు. 1959-61 మధ్య యూనివర్సిటీ ఆఫ్ నాటింగ్‌హామ్‌లో పిహెచ్.డి. చేశారు. 1949-62 మధ్యకాలంలో వివిధ యూనివర్సిటీలలో అధ్యాపకులుగా పనిచేశారు. 1962-63లో జైపూర్‌లోని రాజస్థాన్ విశ్వవిద్యాలయంలో రీడర్‌గా వున్నారు. 1963-80 మధ్య ఢిల్లీ యూనివర్సిటీలో రీడర్‌గానూ, 1980-82 మధ్య ప్రొఫెసర్‌గానూ పనిచేశారు.

అధ్యాపకునిగా పనిచేస్తూనే, చమన్ నహాల్ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికలో 1966 నుండి 73 వరకు కాలమిస్టుగా రచనలు చేశారు. ఆయన మొత్తం 8 నవలలు, ఒక కథానికా సంపుటి రచించారు. వీటిలో 'ఆజాదీ' (1975), 'ది క్రౌన్ అండ్ ది లయన్ క్లాత్' (1981); 'ది సాల్ట్ ఆఫ్ లైఫ్' (1990); 'ది ట్రయంఫ్ ఆఫ్ ట్రై కలర్' (1992) అనే నాలుగు నవలలు గాంధీ క్వార్టెట్‌గా ప్రసిద్ధి చెందాయి. మిగిలిన నాలుగు నవలలు : 1. 'మై ట్రూ ఫేసెస్' (1973); 2. 'ఇన్ టు అనదర్ డాన్' (1977); 3. ది ఇంగ్లీష్ క్వీన్ (1979); 4. 'సన్‌రైజ్ ఇన్ ఫిజి' (1988).

1977లో 'ఆజాదీ' నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. దేశ విభజన ఫలితంగా జరిగిన మారణహోమంలో మరణించిన తన చెల్లెలు కర్తార్ దేవికి ఈ నవలను చమన్ నహాల్ అంకితం ఇచ్చారు. ఈ నవలలో 'మధుబాల' పాత్ర ఆయన చెల్లెలిదే! రాజకీయంగా, చరిత్రపరంగా, సాహిత్యపరంగా 'ఆజాదీ' నవల ఒక కళాఖండం. ప్రసిద్ధ ఆంగ్ల సాహిత్య విమర్శకుడు, ఆచార్యుడు కె.ఆర్.శ్రీనివాస అయ్యంగార్ ఈ నవల గురించి చెబుతూ, "కొన్ని నెలలపాటు ఉపఖండంలో భయంకరమైన పీడకలగా మారిన పరిస్థితిని ఈ నవల చిత్రించింది. నమ్మరాని చేదు జ్ఞాపకాలను, వ్యధనీ పాఠకులకు అందించింది. ఇన్నేళ్ళ తర్వాత కూడా ఆనాడు కలిగిన గాయాలు ఇంకా మానలేదు" అన్నారు.

ముందుగా ఈ నవలలోని ముఖ్య పాత్రలను పరిచయం చేసుకుందాం. సియాల్‌కోట పట్టణంలో కథ జరుగుతుంది. అక్కడ హిందూ, ముస్లిం, సిక్కు మతాలవారందరూ ప్రశాంతంగా జీవిస్తుంటారు. ఆ వూరిలో ఒక పెద్ద భవంతి బీబీ అమీర్‌వతికి చెందినది. ఆమెకు అది వారసత్వంగా వచ్చింది. ఆమె భర్త గంగుమల్ వారి దత్తపుత్రుడు సూరజ్‌ప్రకాశ్. కోడలు సునంద బాల. బీబీ అమర్‌వతి ఇంట్లో మరో ఆరు కుటుంబాలు అద్దెకు వుంటాయి. లాలా కన్షీరాం ధాన్య వ్యాపారి. భార్య ప్రభారాణి. కూతురు మధుబాల. అల్లుడు అజిత్. కొడుకు అరుణ్‌కుమార్. వీరి కుటుంబగాధే ప్రధానంగా వుంటుంది ఈ నవలలో. సంబ్రియాన్ అనే గ్రామానికి చెందిన లాలా కన్షీరాం ఇక్కడ ధాన్యం వ్యాపారంలో ప్రవేశించి నిలదొక్కుకున్నాడు. మరో కుటుంబం సర్దార్ జోధాసింగ్‌ది. ఈయన డ్రైఫ్రూట్ వ్యాపారి. కొడుకు తేజాసింగ్, కూతురు ఇషేర్ కౌర్, అల్లుడు నిరంజన్‌సింగ్. మూడో కుటుంబం పద్మిని, ఆమె కూతురు చాందిని. పద్మిని పనిమనిషిగా బతుకుతుంటుంది. లాలా బిహారి లాల్ నాలుగో కుటుంబం కాగా ఫూల్‌చంద్, భగవాన్ దేవిల కుటుంబాలు ఐదో, ఆరో కుటుంబాలు.

వీరుగాక చౌదరి బర్కత్ ఆలీ కుటుంబం. బర్కత్ ఆలీ ఆట వస్తువుల వ్యాపారి. హాకీస్టిక్స్, ఫుట్‌బాల్స్, టెన్నిస్ రాకెట్స్ అమ్మేవాడు. స్వగ్రామంలో భూమి కౌలుకు ఇచ్చి, సియాల్‌కోట చేరాడు.

వీరిదీ సంబ్రియాల్ గ్రామమే భార్య బేగం బర్కత్ ఆలీ. కొడుకు మునీర్ అహ్మద్. కూతురు నురుల్ నిసారి. డా॥ చంద్రభాను, ఆర్.ఎమ్.పి డాక్టరు. అబ్దుల్ ఘని హుక్కా తయారీదారుడు. ప్రేమనాథ్ చద్దా డిప్యూటీ కమీషనరు. అస్ఘర్ అహమద్ సిద్దీఖీ - సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్; ఇనాయత్ ఉల్లాఖాన్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్; సార్జంట్ విలియం

డేవిడ్‌సన్ బ్రిటిష్ సైనిక అధికారి, కెప్టెన్ రహ్మత్ ఉల్లాఖాన్ పాకిస్తాన్ సైనిక అధికారి; మేజర్ జంగ్ బహదూర్‌సింగ్ ఇండియా సైనికాధికారి. వీరుకాక ఇంకా పాన్‌షాపు కరీం బక్ష్, మరో ధాన్య వ్యాపారి లాలా బన్సారీ దాస్, కాన్షీరాం షాపు యజమాని లాలా షంషేర్ బహదూర్. హిందూ దేవుళ్ళ బొమ్మలు అమ్మే లాలా రాధేశ్యామ్, తరచు నేరాలు చేసి జైలుకు వెళ్ళే ముకుంద. అతని తల్లి మొదలగువారు ఈ నవలలో ఇతర పాత్రలు.

కథాకాలం నాటికి లాలా కన్షీరాం వయసు ఏభై కాగా భార్య ప్రభారాణి వయసు నలభై ఎనిమిది ఏళ్ళు. వారి మొదటి ఏడేళ్ళ వైవాహిక జీవితం సాంబ్రియాన్ గ్రామంలో ఉమ్మడి కుటుంబంలో సాగింది. ప్రభారాణికి పుట్టిన ఏడుగురు పిల్లలు పసివారిగానే చనిపోడానికి కారణం, ఉమ్మడి కుటుంబంలో వున్న తోడికోడళ్ళ దిష్టి వలనే అని ప్రభారాణి నమ్మకం. అరుణ్ ఆమె ఎనిమిదో సంతానం.

మొత్తం నవల మూడు భాగాలు. మొదటిది 'ప్రశాంతత' (Lull); రెండోది 'తుపాను' (Storm); మూడోది 'తదనంతర పరిణామాలు' (Aftermath).

3 జూన్ 1947న వైస్రాయ్ లార్డ్ మౌంట్‌బాటన్ దేశ విభజనపై ప్రకటనతో ప్రారంభమై 30 జనవరి 1948న గాంధీ హత్యతో నవల ముగుస్తుంది.

నవలలో మౌంట్‌బాటన్, రాజాజీ, జిన్నా, గాంధీ, నెహ్రూ మొదలగువారి ప్రస్తావన వస్తుంది. గాని ఎవరూ పాత్రలుగా ప్రత్యక్షం కారు. ప్రజల ప్రతిస్పందనల్లో వారి ప్రస్తావన వుంటుంది. గాంధీ విభజనకు ససేమిరా ఒప్పుకోకుండా వుంటారని పంజాబీల విశ్వాసం. కాని జూన్ 3, 1947న బీబీ అమర్‌వతి ఇంట్లో రేడియో ముందు సమావేశమైనవారు విభజన వార్త వినగానే విభ్రాంతి చెందుతారు. పశ్చిమ పంజాబ్ పాకిస్తాన్‌కు పోతుందనే వార్త – దీనికి కాంగ్రెసు నాయకులు అంగీకరించడం పంజాబ్‌లోని హిందువులు, సిక్కులు జీర్ణించుకోలేకపోయారు.

లక్షలాది ప్రజలు తమతమ తరతరాల నెలవుల నుండి పెకలింపబడి, తమ తప్పేమీ లేకున్నా మరో మతం వారుచేసే అవమానాలకు, మానభంగాలకు, చిత్రవధలకు లోనుగావడాన్ని లాలా కన్షీరాం కుటుంబాన్ని ప్రతీకగా రచయిత చిత్రించారు. లాలా కన్షీరాం ఆర్య సామాజికుడు. గాంధీ భక్తుడు. ముస్లిములకు మిత్రుడు. ఈయన స్నేహితుడు చౌదరీ బర్కత్ ఆలీ కూడా గాంధీ అనుచరుడే. ముస్లిములు మెజారిటీగా వున్న సియాల్‌కోటలో కన్షీరాం హిందూ జాతీయవాది. తాతల నాటి నుండి అక్కడ స్థిరపడిన కుటుంబం ఆయనది. బ్రిటీషువారి నుంచి స్వాతంత్ర్యం సాధించాలనుకున్నవాడు. అవిభక్త ఇండియాను ఆశించాడు. పంజాబీ మాట్లాడేవాడు. రాతకోతలన్నీ ఉర్దూలో చేసేవాడు. ఉర్దూను ముస్లిముల భాషగా ఎప్పుడూ గుర్తించలేదు. విభజన జరిగినా సియాల్‌కోట విడిచి వెళ్ళాలనుకోలేదు. ఎందరో ముస్లిం మిత్రులున్నారు. తన ప్రియ మిత్రుడు బర్కత్ ఆలీ కుటుంబం వుంది. సియాల్‌కోట శాశ్వతంగా విడిచి వెళ్ళాలన్న వూహే ఆయన భరించలేకపోయాడు.

హుక్కా వ్యాపారి అబ్దుల్ ఘనీ ముస్లిం ఉన్మాది. విభజన ప్రకటన విని సంతోషిస్తాడు. కన్షీరాం కుటుంబం వూరు విడిచి వెళ్ళారా లేదా అని కూపీ లాగుతుంటాడు. కన్షీరాం వెళ్ళిపోతే అతడి షాపు ఆక్రమించాలని అతని కోరిక. లాహోర్‌లో పంజాబ్ అసెంబ్లీ విభజనను అంగీకరించి తీర్మానం చేసిన రోజు మర్నాడు నుంచీ, 24 జూన్‌న మొదటి మత కొట్లాటలు ప్రారంభమయ్యాయి. ఆరోజు సియాల్ కోట్‌లో హిందువులపై దాడులు జరిగాయి. పంజాబ్‌లోని లాహోర్, గుజ్రన్‌వాలా, గుజ్రత్, సర్గోదా, అమృతసర్, జలంధర్, రావల్పిండి, అంబాలా, లూధియానా, ముల్తాన్‌లలో మూకుమ్మడి హత్యలు జరిగాయి. సియాల్‌కోట్‌లో ఐదారుగురు హిందువులను అక్కడక్కడా గుర్తు తెలియని వ్యక్తులు చంపడం రోజువారీ కార్యక్రమమైంది. జనం లేనిచోట చూసి చంపడం, హతుడి ప్రేగులు బయటకు వచ్చేట్లు కత్తిని పొట్టలో తిప్పి చంపడం – షాపులు, ఇళ్ళు తగులబెట్టడం – నిత్యకృత్యమైంది. ఒకరోజు అమృతసర్ ట్రైన్‌లో తూర్పు పంజాబ్ నుండి వచ్చిన గాయపడిన ముస్లిములు ట్రంప్ బజార్లో 9 టాంగాలలో వెళ్ళడం ప్రజలు చూశారు. ఆరోజు నుండి సియాల్‌కోటలో పెద్దఎత్తున హింస చెలరేగింది. ధారోవాల్ మొహల్లా దహనం చేశారు. ఇంకోరోజు హిందువైన డిప్యూటీ కమీషనర్ ప్రేమనాథ్ చద్దాను ఆయన ముస్లిం బాడీగార్డు కాల్చి చంపేస్తాడు. ఈ పరిస్థితులు గమనించి లాలా కన్షీరాం ముస్లిం మిత్రుడు బర్కత్ ఆలీ వచ్చి కన్షీరాం కుటుంబాన్ని ఆరోజు రాత్రే వూరు విడచి వెళ్ళిపొమ్మనమని సలహా ఇస్తాడు. అప్పటికే లాయర్ శ్రీకాంత్ బహదూర్ కుటుంబం వెళ్ళిపోతుంది.

కన్షీరాం కొడుకు అరుణ్, బర్కత్ ఆలీ కూతురు నురుల్ నిసార్ ప్రేమించుకుంటారు. నూర్ అన్నయ్య మునీర్ కూడా వీరి ప్రేమను అంగీకరించి, అప్పుడప్పుడు వారు కలుసుకోడానికి సహకరిస్తుంటాడు. ఊరు విడచి వెళ్లిపోతున్న అరుణ్‌కు కన్నీటితో తడిసిన నూర్ ఉత్తరాన్ని మునీర్ ఇస్తాడు. దేశం విచ్ఛిన్నమైనట్లే వీరిద్దరి ప్రేమ దేశ విభజన వల్ల భగ్నమౌతుంది.

కన్షీరాంకు గతమంతా కళ్ళముందు మెదలుతుంది. దసరా పండుగకు ముస్లిములు రావణుడి బొమ్మలు చేసి అమ్మేవారు. టపాసులన్నీ ముస్లిములే సరఫరా చేసేవారు. బర్కత్ ఆలీ, కన్షీరాం గాంధీ ఉపన్యాసానికి వెళ్ళి, ఆ తర్వాత నుండి ఖద్దరు ధరిస్తుంటారు. గాంధీ సియాల్ కోటకు వస్తున్న రైలు మూడుగంటలు ఆలస్యమైనా ప్రజలు వేచి వున్నారు. బర్కత్ ఆలీ పూర్వీకులు 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు.

అరుణ్‌కు, మునీర్‌కు స్నేహితుడైన బ్రిటిష్ సైనిక అధికారి దేవిడ్సన్ సైన్యానికి సంబంధించిన ట్రక్కు తెస్తాడు. దానిలో శరణార్థుల శిబిరానికి క్షేమంగా తీసుకువెళ్తాడు. ఈ దేవిడ్సన్ ఒక గని కార్మికుడి కొడుకు. ఇంగ్లండ్‌లో లేబర్ పార్టీ సభ్యుడు. మార్క్స్, లెనిన్ గ్రంథాలను అధ్యయనం చేశాడు. మూడేళ్ళ నుండీ ఇండియాలో వుంటూ, ఇటీవలే సియాల్ కోటకు బదిలీపై వచ్చాడు. 29 ఏళ్ళ ఈ ఇంగ్లీషు సైనికాధికారి 19 ఏళ్ళ అరుణ్, మునీర్‌లతో సంభాషిస్తూ బ్రిటిష్‌వారిపై వారికున్న ఆగ్రహాన్ని తగ్గిస్తూ వుంటాడు.

ట్రక్కు ఎక్కేముందే, బ్యాంక్ నుండి తెచ్చిన మూడు వేల రూపాయలు, భార్య నగలు జాగ్రత్తగా తనతో తీసుకువెళ్తాడు కన్షీరాం.

అప్పటికే అతని షాపును లూటీ చేసి ధాన్యపు బస్తాలు మోసుకొని వెళ్ళారనే విషయం తెలుస్తుంది.

సియాల్ కోట్ నుండి అమృతసర్‌కు 82 మైళ్ల దూరం సియాల్ కోట్‌లోని హిందువులు ముందుగా తమ ఇళ్ళూ, ఆస్తులూ వదిలేసి ఆ వూరిలోనే ప్రభుత్వం కంటోన్మెంట్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన శరణార్థుల శిబిరం చేరాలి. అక్కడి నుండి వివిధ శిబిరాలలో వున్నవారంతా ఒకేసారి బయలుదేరి అమృతసర్ వైపు కాలినడకన వివిధ మజిలీలతో ప్రయాణించి అక్కడ పునరావాస శిబిరాలకు చేరాలి. వేలాదిగా వున్న వీరిని కొన్ని భాగాలుగా విభజించి, వీరి రక్షణకు పాకిస్తాన్ సైన్యమూ, ఇండియా నుంచి వచ్చిన అధికారులూ వెంట వుంటారు. అయినా రాత్రిపూటో, పగలో మతోన్మాద గుంపులు వీరిపై పడి చంపడమో, ఆడవారిని ఎత్తుకుపోవడమో, లైంగిక దాడులు జరపడమో చేస్తుంటారు. సరిగ్గా ఇదే పరిస్థితిని ఇండియా నుండి పాకిస్తాన్‌కు వలస వస్తున్న ముస్లిం ప్రజలు ఎదుర్కొంటున్నారు. రెండువైపులా మతోన్మాద గుంపుల అకృత్యాలు పెచ్చరిల్లుతుంటాయి.

కంటోన్మెంటు శిబిరంలో వున్న కన్షీరాం, ప్రభారాణి తమ కూతురుని, అల్లుడిని (మధుబాల, రాజీవ్), వజీరాబాద్ నుండి సియాల్ కోట్ వస్తుంటే రైలులో చంపేసారన్న వార్త వింటారు. రైల్వేస్టేషన్‌కు వెళ్ళి మధు, రాజీవ్‌ల శవాలను గుర్తుపట్టి తెద్దామని అరుణ్, సూరజ్ ప్రకాశ్‌లు విఫలయత్నం చేస్తారు. అరుణ్ తన అక్క మధు చిన్నప్పటి విషయాలన్నీ జ్ఞాపకం చేసుకుంటాడు.

ఈ శిబిరంలో వృద్ధుడైన జోధాసింగ్ మరణిస్తాడు. బీబీ అమర్‌వతి భర్త గంగుమల్‌కు తమ ఆస్తి ఐన రెండు భవనాలపై మమకారం ఎక్కువ. అవి అద్దె తెచ్చిపెడుతున్నాయి కనుక. ఆయన గులాం మహమ్మద్ అనే ముస్లింగా మతాన్ని మార్చుకొని ఆ భవనాలపై యాజమాన్యం నిలుపుకుంటాడు.

తేజాసింగ్ కూతురు ఇషర్ కౌర్ గర్భిణీ. భర్త నిరంజన్‌సింగ్‌ను సిక్కుల ఆచారమైన గడ్డం, జుట్టు కత్తిరించుకుంటే ముస్లిముల దాడి నుండి తప్పించుకోవచ్చని అందరూ వత్తిడి చేస్తారు. ఆయన చివరకు సరేనని ఒప్పుకొని ఆ మర్నాడు ఉదయం ఆత్మాహుతి చేసుకున్నాడు. 'వాహే గురు' అంటూ అరుస్తూ అగ్నికి ఆహుతైపోతాడు.

జైలులో వున్న హిందూ ఖైదీలనందరినీ చంపేసినట్లు వార్త వచ్చింది. వారిలో ముకుంద ఒకడు. ముకుంద కోసం సియాల్‌కోటలోనే వున్న అతని తల్లిని హత్య చేసారు.

సియాల్ కోట నుండి ఇండియా సరిహద్దు ప్రాంతమైన డేరా బాబానాయక్‌కు దూరం 47 మైళ్ళు. రోజుకు ఆరు మైళ్ళ నడకతో, మధ్యలో కొన్ని రోజులు విశ్రాంతితో 15 రోజుల్లో ఇండియాకు చేరాలి ఈ శరణార్థుల బిడారు. కన్షీరాంను ఒక యూనిట్‌కు నాయకునిగా నియమించారు. యూనిట్‌కి 2000 మంది వుంటారు. రాత్రిపూట నిద్రించటానికి గుడారాలు లేవు. ఆరుబయట పొలాలలో నిద్రపోవాల్సిందే. వీరు మొత్తం 20 వేలమంది. 10 మైళ్ళ పొడవున వున్నారు. రావల్పిండి నుండి బయలుదేరిన కాన్వాయ్ 75 మైళ్ళ పొడవున వుంది. ఇండియా నుండి గూర్ఖా ట్రూప్ పాకిస్తాన్ నుండి వస్తున్నవారికి రక్షణగా వచ్చింది. జీపులు, ట్రక్కులతో ముసలివారిని, రోగులను ట్రక్కులలో తీసుకువెళ్తారు. భారత సైన్యంలో 20 ఏళ్ళ సర్వీసు వున్న గూర్ఖా మేజర్ రాణా జంగ్ బహదూర్ సింగ్ గూర్ఖా ట్రూప్ నాయకుడు. ఈ కాన్వాయ్‌లలో సగంమందే గమ్యస్థానం చేరేవారు. ఆకలితో, రోగాలతో, చలిగాలులకు తోవలో జరిగే హింసకు బలైపోయేవారు. కొందరు తమ తమ ఎడ్లబండ్లూ, దున్నపోతూ బండ్లూ, సైకిళ్ళపై ప్రయాణం చేసారు.

సియాల్‌కోటకు 35 మైళ్ళ దూరాన వున్న నరోవాల్ పట్టణం శివార్లలో శరణార్థులు మజిలీ వేసారు. ఆరోజు నరోవాల్ మార్కెట్‌లో హిందూ, సిక్కు స్త్రీలను నగ్నంగా వూరేగిస్తున్నట్లు తెలిసి, అక్కడకు అరుణ్, సూరజ్ ప్రకాశ్ తగు జాగ్రత్తలు తీసుకొని వెళ్తారు. అటువంటి ప్రదర్శన చూడటానికి వీరిద్దరూ వెళ్లినట్లు ఎందుకు రచయిత చిత్రించారో అర్థంకాదు.

నరోవాల్ మార్కెట్ ప్రాంతంలో జరిగిన బీభత్సమైన హిందూ, సిక్కు స్త్రీల నగ్న ప్రదర్శనలో 40 మంది వున్నారు. అందరూ 16 నుండి 30 ఏళ్ళ మధ్య వయసువారే. 60 దాటినవారు ఇద్దరే వున్నారు. వారు ఏడుస్తున్నారు కాని కన్నీరు ఇంకిపోయి కన్నీరు రావడంలేదు. శరీరాలపై ఎన్నో గాయాలు. కొరడాలతో తోలు వలచిన గాయాలు అవి. బండబూతుల ప్రవాహం అక్కడ రాజ్యమేలింది. అసహ్యకరమైన సంజ్ఞలు చేస్తున్నారు. వారిపై ఉమ్ముతున్నారు. రేప్ చేయండిరా అని అరుపులు. ముందువరుసలో నుంచున్న మగవారు తమ లుంగీలు పైకెత్తి తమ మర్మాంగాలు చూపించడం.... ఇలా అసహ్యకరమైన, అశ్లీలకరమైన చేష్టల ద్వారా ఆ మహిళలను అవమానించారు.

నరోవాల్ శిబిరంలోనే అరుణ్, పనిమనిషిగా వున్న పద్మిని కూతురు చాందినిని ప్రేమించడం ప్రారంభిస్తాడు. తల్లితో కూడా ఈ విషయం చెబుతాడు. అయితే ఆ క్యాంప్ నుండే దుండగులు చాందినిని ఎత్తుకుపోతారు. రెండుసార్లు అరుణ్ భగ్న ప్రేమికుడౌతాడు. అతని జీవితం మసకబారుతుంది.

పాకిస్తాన్ సైనిక అధికారి కెప్టెన్ రహ్మతుల్లాఖాన్ సియాల్ కోట్‌లో అరుణ్‌తోపాటు చదివాడు. ఈ హిందూ శరణార్థులను సురక్షితంగా ఇండియా చేరాల్సిన బాధ్యత అతనిది. కనుక వీరితోపాటు అతనూ వస్తున్నాడు. అతడు సూరజ్ ప్రకాశ్ భార్య సునందబాలపై కన్నువేశాడు. సునందబాల కాశ్మీరీ యువతి. అరుణ్‌తో సునందను తనకి అప్పచెప్తే, అతని కుటుంబాన్ని జాగ్రత్తగా ఇండియాకు చేరుస్తానంటాడు. అరుణ్ వినకపోయేసరికి నరోవాల్ శిబిరం నుంచి సునందను ఎత్తుకుపోయి ఒక శిథిల గృహంలో బలాత్కారం చేయడానికి ప్రయత్నిస్తాడు. అరుణ్ అతను వున్న చోటు కనుక్కొని అతన్ని చంపేసి, సునందను రక్షిస్తాడు.

వీరి కాన్వాయ్‌పై మొత్తం మూడుసార్లు ముస్లిం దుండగులు దాడిచేస్తారు. ఒక దాడిలో సూరజ్ ప్రకాశ్‌ను చంపేస్తారు.

ఈ కాన్వాయ్ ప్రారంభమైన మొదటిరోజు 6 మైళ్ళ మజిలీ వరకు బర్కత్ అలీ, మునీర్‌లు తమ సైకిళ్ళపై వచ్చి అక్కడ తన మిత్రుడు కన్షీరాం కుటుంబానికి వీడ్కోలు చెబుతాడు. ఐదవరోజు ఒక చిన్న గ్రామం చేరతారు. అక్కడ వున్న మొత్తం 20 ఇళ్ళూ ధ్వంసమై వున్నాయి. అది హిందువుల, సిక్కుల గ్రామం కావచ్చు. అక్కడ ముస్లిం గూండాలు కాన్వాయ్‌పై దాడి చేశారు. ఆ సమయంలో ఎక్కడివారినక్కడ కూర్చోవడమో, పడుకోవడమో చేయమని రక్షణగా వస్తున్న సైన్యం

ఆదేశించింది. గుర్రాలపై వచ్చిన దుండగులు కొందరు శరణార్థులను హతమార్చారు. యువతులను ఎత్తుకుపోయారు. రోడ్డు ప్రక్కనున్న మామిడితోటల చాటున దాగి ఒక్కసారిగా ఈ దాడి చేసారు. డా॥ చంద్రభాను ఈ దాడిలో చనిపోయాడు. అతని ఇద్దరు కూతుర్లూ, 19, 17 వయసువారిని ఎత్తుకుపోయారు.

ఆరవరోజు కూడా కాన్వాయ్‌కు వెనుక భాగంలో దాడిచేసి 200 మంది హిందువులు, సిక్కులను చంపేసారు. వందలాదిమంది గాయపడ్డారు. తొమ్మిదోరోజుకి 1500 మందిని పోగొట్టుకున్నారు. అక్కడ ఒక వారం మజిలీ. సరిహద్దు వద్దకు చేరేసరికి వీరి కాన్వాయ్‌లో 2000 మంది చనిపోయారు. 3000 మంది అదృశ్యమయ్యారు. వీరిలో మహిళలు అత్యధికం.

రావీనది మీద వంతెన దాటగానే కన్షీరాం 'వందేమాతరం' అంటాడు. అమృతసర్ చేరిన కన్షీరాం బంధువుల ఇళ్ళకు వెళ్ళినా ఆశ్రయం దొరకలేదు. కొందరి ఇళ్ళల్లో ఇప్పటికే ఆశ్రయం పొందిన వారున్నారు. వారు పశ్చిమ పంజాబ్ నుంచి వచ్చినవారు. ప్రభారాణి తన అన్న వున్న కాన్పూర్‌కు పోదామన్నా, అది చాల దూరం కనుక కన్షీరాం ఒప్పుకోలేదు. జలంధర్, లూధియానా, అంబాలాలకు వెళ్ళడానికి కూడా అంగీకరించలేదు.

వీరు అమృతసర్‌లో కొన్ని వారాలపాటు శరణార్థుల శిబిరంలో వున్నారు. శరణార్థులను ప్రైవేటు ఛారిటబుల్ ట్రస్టులు ఆదుకున్నాయి. ప్రభుత్వం మాత్రం సహాయక చర్యలకు తయారుగా లేదు! అమృతసర్‌లో ముస్లిముల ఇళ్ళు తగులబెట్టారు. పద్మిని అమృతసర్‌లో వుంటానంటుంది చాందిని తిరిగి వస్తుందనే ఆశతో. అక్కడ రైల్వేస్టేషన్‌లో ముస్లిం స్త్రీలను అవమానిస్తూ కవాతు చేయించారు. అమృతసర్ రైల్వేసిగ్నల్స్ వద్ద ఆగిన రైలులో వున్న ముస్లిం శరణార్థులపై దాడిచేసి చంపేసారు.

అమృతసర్‌లో సహాయక కేంద్రంలో తాము ఢిల్లీకి వెళ్ళాలనుకుంటున్నామని చెప్పి కన్షీరాం కుటుంబం ఢిల్లీకి చేరుతుంది. చేరగానే ఒక గుడిసెలో వుంటారు. ఆలీపూర్ రోడ్‌లోని కింగ్స్‌వే క్యాంపులో చేరి చిన్న వ్యాపారం ప్రారంభిస్తాడు. పునరావాస సంబంధిత అధికారుల అవినీతిని, వారి లంచగొండితనాన్ని, శరణార్థుల నుండి కూడా ఏదో ఆశించేవారి అల్పత్వాన్నీ ఈ నవల మూడో భాగంలో రచయిత చిత్రించారు. పునరావాస శాఖ ఢిల్లీలోని 'పి' బ్లాక్‌లో వుంది. ఈ కార్యాలయానికి కన్షీరాం 20, 30 సార్లు తిరిగాడు. అక్కడ పనిచేసే ఉద్యోగులు కూడా అంతకు ముందే శరణార్థులుగా వచ్చిన సీనియర్లు. కాని వారి తర్వాత వచ్చే శరణార్థుల పట్ల వారి ప్రవర్తన అభ్యంతరకరంగా వుంటుంది. ఆ తర్వాత కింగ్స్‌వే కాంప్‌లో నివాసం. అరుణ్ అక్కడ తేజ్‌సింగ్ కోడలు ఇషార్ కౌర్‌ను ఢిల్లీలోని సహద్రాలో వున్న వారి బంధువుల ఇంటికి చేరుస్తారు. బీబీ అమర్‌వతి, సునందబాల కూడా కన్షీరాం కుటుంబంతో కలిసి వుంటారు.

చివర్లో 30 జనవరి 1948న గాంధీ హత్య గురించి వార్త విని, దేశ విభజనపై ఆయన తీసుకున్న నిర్ణయం గురించి మాట్లాడుకోవడంతో నవల ముగుస్తుంది.

ఈ నవలా రచనలో చమన్ నహాల్ అపురూపమైన శిల్పాన్ని ప్రదర్శించారు. సినిమాలో ఫ్లాష్‌బాక్ పద్ధతిలో కొన్ని అధ్యాయాల్లో కథ నడుపుతారు. ఉదాహరణకు అక్కా, తమ్ముళ్ళు, మధుబాల, అరుణ్‌ల బాల్యం, కౌమారం దశలోని సంఘటనలను మధుబాల, ఆమె భర్త మరణించారని తెలిసిన తర్వాత అరుణ్ జ్ఞాపకం చేసుకుంటాడు.

మత కొట్లాటలను పరోక్షంగా ప్రస్తావించటం కాకుండా, పాఠకుడికి గగుర్పాటు కలిగించేటట్లు ప్రత్యక్షంగా కళ్ళముందు కనబడేట్లు చిత్రించారు. పురుషులకు స్త్రీల పట్ల వుండే కామదృష్టి వివిధ పాత్రల మనస్తత్వ చిత్రణలో కనబడుతుంది.

రచయిత ఇంగ్లీషుభాష సాధారణ పాఠకుడికి కూడా తేలిగ్గా అర్థమౌతుంది. డిక్షనరీ జోలికి పోవాల్సిన పదాలేవీ చమన్ నహాల్ వాడలేదు.

అన్నిటికంటే చెప్పుకోదగినది ఆయన శైలి. చదవడం మొదలుపెడితే ఎక్కడా ఆగాలనిపించదు. ఆయన రాసిన మిగిలిన నవలలు కూడా తప్పక చదవాలనిపిస్తుంది.

వచ్చే సంచికలో : **సలీంఖాన్ గిమ్మీ నవల 'సాంఘ్'** ✵

పాట

## సమ్మెకు సై అన్నరో అంగన్వాడి అక్కలు

– ఉప్పెన

సమ్మెకు సై అన్నరో అంగన్వాడి అక్కలు
సైరన్ మ్రోగించిరో అంగన్వాడి చెల్లెళ్ళు ॥ సమ్మెకు ॥

జీతాల పెంపు కొరకు జీవితాల మార్పు కొరకు
ప్రభుత్వం ఇచ్చినట్టి హామీల అమలు కొరకు
ఉద్యోగ భద్రతకు అంగన్వాడి అక్కలు
ఉద్యమించి లేచిరోఅంగన్వాడి చెల్లెళ్ళు ॥ సమ్మెకు ॥

చర్చలకు పిలిచినారు తియ్యగ మాట్లాడినారు
కొసలను ఒప్పుకోని అసలువి కుదరవంటె
చెల్లవు చర్చలన్నరో అంగన్వాడి అక్కలు
సాగవు కుట్రలన్నరో అంగన్వాడి చెల్లెళ్ళు ॥ సమ్మెకు ॥

అంగన్వాడి అక్కలంత ఒక్కటయ్యి కదిలినారు
తాడో పేడో తేల్చుకోను పట్టు పట్టి నిలిచినారు
మూకుమ్మడి పోరుతోని అంగన్వాడి అక్కలు
సాగుతుండ్రు ముందుకు అంగన్వాడి చెల్లెళ్ళు ॥ సమ్మెకు ॥

న్యాయమైన డిమాండ్లకై నడుస్తోంది పోరాటం
ఇక అన్యాయం చేసెరంటె నిల్వనీరు ప్రభుత్వం
నెగ్గెదాక తగ్గమని అంగన్వాడి అక్కలు
తెగేసి చెప్పుతున్నరో అంగన్వాడి చెల్లెళ్ళు
ఏలికలను పాలకులను అంగన్వాడి అక్కలు
తేల్చుకోమంటున్నరొ అంగన్వాడి చెల్లెళ్ళు ॥ సమ్మెకు ॥

వ్యాసం

ఫిబ్రవరి 28, జాతీయ సైన్సుదినం సందర్భంగా

# నూతన అంధయుగాలలోకి....

– ఓ.పి.వి.యస్

**జీవశాస్త్ర** విజ్ఞానాన్ని, మానవ ఆలోచనా విధానాన్ని సమూలంగా మార్చివేసినది జీవపరిణామవాద భావన. దానిని ప్రతిపాదించి శాస్త్రీయంగా ఋజువు పరచిన మహనీయుడు చార్లెస్ డార్విన్. ఆయన జయంతి ఫిబ్రవరి 12. శిలాజాల అధ్యయనం నుండి, పిండోత్పత్తి శాస్త్రము, పురాజీవ శాస్త్రము.... ఇటీవలి జన్యు యింజనీరింగు ఆవిష్కరణల వరకు డార్విన్ జీవ పరిణామవాదం యొక్క శాస్త్రీయతకు అండగా నిలిచి ఋజువులను నిర్ధారిస్తున్నాయి. పరిపుష్టి చేస్తున్నాయి. 7 లక్షల నుంచి 5 లక్షల ఏళ్ళ మధ్య చింపాంజీల పూర్వీకుల నుండి మానవజాతులు వేరుపడ్డాయని, తదుపరి నియాండర్తల్స్, ఆధునిక మానవులు (సేపియన్లు) కాలవాహినిలో వేరుపడ్డారని పేర్కొంటూ ప్రాచీన డిఎన్ఏ ఆధారిత జన్యు విప్లవం మానవ పరిణామపు విశ్వరూపాన్ని మనకు చూపుతున్నది. మానవాళి పురోగమనానికి దారులు వేసే శాస్త్రీయ సిద్ధాంతాలేవైనా, అవి ఆవిష్కరించబడిన నాటినుండి పాలకవర్గాల చేత ఎదురుదెబ్బలు తింటూనే ఉంటాయి. లేదా పాలక వర్గాల ప్రయోజనాలు పరిరక్షించబడిన మేరకు అనుమతించబడతాయి. డార్విన్ జీవపరిణామవాదమూ అంతే.

చార్లెస్ డార్విన్ 1859లో వెలువరించిన 'జీవజాతుల పుట్టుక, 1871లో వెలువరించిన 'మానవ అవతరణ' అనే గ్రంథాలు జీవ పరిణామ సిద్ధాంతపు మైలురాళ్ళుగా నిలిచాయి. హోలీ బైబిల్‌లో విశ్వసృష్టి గురించిన కట్టుకథలకు, అంధమత విశ్వాసాలకు బద్ధవిరుద్ధంగా ఉన్నందున డార్విన్ సిద్ధాంతంపై ఆనాడు (ఈనాటికీ..) చర్చి కత్తిగట్టింది. చెట్టపట్టాలు వేసుకున్న మత మౌఢ్య శక్తులూ, పీడక ప్రభుత్వాలూ కలిసి విద్యాసంస్థలలో దానిని బోధించనీయకుండా చేశాయి. అపహాస్యం చేయడమూ, కోర్టులకు లాగడం వంటి హింసలెన్నో పెట్టాయి. ఈ అడ్డంకులను దాటుకొని విద్యాలయాలలో బోధనాంశంగా చోటు దక్కించుకోగలిగినా,.... బోధించేవారు పరిణామ సిద్ధాంతంలోని గతితార్కికతను తొలిచివేసి యాంత్రికమైన సిద్ధాంతంగా మార్చివేస్తున్నారు. ఐనా ఈ అడ్డంకులను అధిగమిస్తూ ప్రజల మేథస్సుల్లోకి చేరాల్సిన సిద్ధాంతంగా అది తన ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఉన్నది. డార్విన్ పరిణామవాదపు సిద్ధాంతం విషయంలో మన దేశపు పరిణామాలు కూడా ఇందుకు అతీతంగా ఏమీలేవు.

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక, గత పాలకులు ధరించిన అన్ని ముసుగులనూ చింపివేసి, తన అశాస్త్రీయ వైఖరులను నిస్సిగ్గుగా బయటపెడుతున్నది. రాజ్యాంగంలో పొందుపర్చుకున్న ఆర్టికల్ 51ఎ(4) ప్రకారం శాస్త్రీయ వివేచనను కలిగించాల్సిన కనీస బాధ్యతకు సైతం కట్టుబడకుండా శాస్త్రీయ చింతనపై దాడులు ముమ్మరం చేస్తున్నది. ఈనాడున్న అన్ని శాస్త్ర సాంకేతికాంశాలకు మన దేశమే వేల ఏళ్ళముందే పుట్టినిల్లని, ఆ జ్ఞానాన్ని తస్కరించిన విదేశీయులు, ఆ జ్ఞానమంతా వాళ్ళే ఆవిష్కరించినట్లు చెప్పేదంతా అబద్ధమని వాదిస్తున్నది. ముస్లిం, క్రైస్తవ దండయాత్రలకు తలవొగ్గిన ఫలితంగా – ధర్మం నశించి, మన ప్రజలు ఈ అబద్ధాలను తెలుసుకోలేని మూర్ఖులుగా ఉన్నారని వీరి వాదన. వీరి ఈ ఆలోచనా తీరు ఎంతవరకు సంకుచితమై పోయిందంటే, వందేళ్ళు శ్రమజీవుల పోరాటాల, త్యాగాల నుండి స్ఫూర్తిని పొందే 'మేడే' మనది కాదు అని, అది విదేశీయులదని, మనం మన పురాణ పురుషుడైన విశ్వకర్మ జయంతినే శ్రమజీవుల దినోత్సవంగా జరుపుకోవాలంటూ వాదిస్తున్నారు. ఈ క్రమంలో ఈ సైన్సు మనది కాదంటూ సైన్సుడే (ఫిబ్రవరి 28)ని నిరాకరిస్తారో లేక సి.వి. రామన్ మనవాడేనంటూ అంగీకరిస్తారో చూడాలి. శాస్త్రీయతను తూట్లు పొడిచేందుకు, శాస్త్ర పరిజ్ఞానంతో విడదీయలేని సాంకేతికాభివృద్ధినే వీరు వాడుతున్నారు. అబద్ధాలను యధేచ్ఛగా వ్యాపింపజేస్తూ, విద్వేషాలను రెచ్చగొట్టే దుర్మార్గ విధానంలో వీరూ, వీరి వంధిమాగధ సంస్థలవారూ ఆరితేరిపోయారు. గోదీ మీడియా, అలియాస్ అబద్ధాల ఫ్యాక్టరీ.. వగైరా పర్యాయపదాల సోషల్, డిజిటల్ మీడియాలు వేదికలుగా వీరు చేసే దుష్ప్రచారాల సంగతి, విద్వేషాలు వ్యాపింపజేసే పద్ధతి జగమెరిగిన రహస్యమే.

పురాణేతిహాసాలలో ఉండే విషయాలను చారిత్రక సత్యాలంటూ వీరు చేస్తున్న వంచనాత్మక ఆర్భాటాల హడావుడి శాస్త్ర ప్రపంచంలో భారతీయులకు తలంపులు తెచ్చిపెడుతున్నది. 2014 అక్టోబర్‌లో బొంబాయిలోని హరికిషన్‌దాస్ నరోత్తమ్‌దాస్ (హెచ్.ఎన్) రిలయెన్స్ ఆసుపత్రిని ప్రారంభిస్తూ సాక్షాత్తూ ప్రధాని మోడీగారు, ప్లాస్టిక్ సర్జరీ, జెనెటిక్ సైన్సు వంటివి ప్రాచీన కాలం నుండీ మనదేశంలో ఆచరణలో వున్న విషయాలే అన్నారు. వీరి సహచరులైతే రైట్ సోదరులు విమానాలను కనుగొన్న 19వ శతాబ్దం కంటే ఎన్నో వేల ఏళ్ళు ముందుగానే రామాయణ కాలంలోనే మనదేశంలో విమానాలున్నాయని, పుష్పక విమానమే ఇందుకు సాక్ష్యమన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టరీ రీసెర్చి నామినేటెడ్ సభ్యునిగానూ, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా కూడా అయిన దినేశ్ శర్మ అయితే మనదేశంలో అణ్వాయుధాలు ఎప్పటినుండో ఉన్నవేనని, మహాభారత కాలంలోనే వాటిని వాడేవారన్నారు. ఇక గోవు పేడ, గోవు మూత్రాల పవిత్రతే కాక ఔషధగుణం తదితర విషయాలలో వీరి వాదనలకు శాస్త్ర ప్రపంచం కకావికలు కావాల్సిందే.

రేడియోధార్మిక ఉద్గారాల విష ఫలితాలను సైతం తుదముట్టించే భయంకర శక్తి ఆవుపేడ, మూత్రాల సమ్మేళనానికి ఉందని వీరు ఏమాత్రం సంకోచం లేకుండా ప్రవచిస్తారు. కరోనా సమయంలో గో మల మూత్ర వికారాల తేజస్సు, వీరి కారణాన వాట్సాపు యూనివర్శిటీలో దిగంతాలకు వ్యాపించిన సంగతి సోషల్ మీడియా ప్రేక్షకులందరికీ తెలిసినదే. వీరి వందిమాగధుల జాబితాలో మరో ప్రముఖుడైన విద్యావేత్త (?!..) ఆంధ్రా యూనివర్శిటీ గత వైస్‌ఛాన్సలర్ జి. నాగేశ్వరరావు 2019 జనవరిలో జలంధర్‌లో జరిగిన 'సైన్స్ ఇన్ ఇండియన్ వే ఆఫ్ లైఫ్' అనే అంశంపై జరిగిన శాస్త్రవేత్తల సభలో ప్రసంగిస్తూ మన మహాభారతంలో గాంధారీదేవికి పుట్టిన 101 మంది కౌరవ సంతానమూ టెస్ట్‌ట్యూబ్ బేబీలేనని అవాక్కైపోయిన ప్రేక్షకుల ముందు సాధికారంగా ప్రవచించారు.

ఈ క్రమంలోనే 2018 జనవరి 19న అప్పటి మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఫర్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ సత్యపాల్‌సింగ్ చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన పరిణామవాదం తప్పు అని, మానవులు భూమి మీద ఎప్పుడూ మానవులుగానే ఉన్నారని, వానరుల నుండి నరులు పరిణామం చెందడాన్ని చూసినవారెవరూ లేరని అన్నారు. అక్కడితో ఆగకుండా, ఈ పరిణామవాదాన్ని పిల్లల పాఠ్యపుస్తకాల సిలబస్ నుండి తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. తదుపరి వీరి ఆలోచనలకు కరోనా కష్ట సమయం ఇతోధికంగా సహకరించినట్లయ్యింది. 2020 మార్చి నెల 25 నుండి జూన్ 30 వరకు 5 దశల్లో 108 రోజులపాటు విధించబడిన లాక్‌డౌన్ కారణంగా అనేక వ్యవస్థల మాదిరే విద్యావ్యవస్థ కూడా అతలాకుతలమైపోయింది. అత్యంత లోపభూయిష్టమైన ఆన్‌లైన్ పద్ధతుల్లోకి విద్యాబోధన పద్ధతులు నెట్టివేయబడ్డాయి. మరోవైపు సిలబస్ భారమైపోయిందన్న వాదన కూడా బయలుదేరింది. దీనిని అవకాశంగా తీసుకున్న కేంద్ర పెద్దలు సిబిఎస్‌ఈ 10వ తరగతి పాఠ్యప్రణాళిక నుండి డార్విన్ పరిణామ సిద్ధాంతపు పాఠాలను తొలగించివేశారు. దీనితోపాటు ఇంకా మూలకాల ఆవర్తన పట్టిక – వర్గీకరణ, పైథాగరస్ సిద్ధాంతము, జాతీయ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయరంగం పాత్ర మొదలైనవి తొలగించబడిన సిలబస్‌లో ఉన్నాయి.

సిలబస్ హేతుబద్ధీకరణ పేరుతో, కరోనా నెపం చూపుతూ, తాత్కాలికమంటూ చేస్తున్న ఈ తొలగింపులను కరోనా అనంతరం పూర్తిస్థాయిలో తొలగించడానికి సిద్ధమైపోయారు. ఐదేళ్ళముందు సత్యపాల్‌సింగ్ డార్విన్ పరిణామవాదం పైన దాడి చేస్తూ చేసిన వ్యాఖ్యల్లో భాగంగా పిల్లలు నేర్చుకునే పాఠాల నుండి దీనిని తొలగించాలనడం ఇప్పుడు వాస్తవ రూపం దాల్చిందన్నమాట. వ్యాఖ్యలు చేసినప్పుడు, ఇప్పుడు సిలబస్ నుండి శాస్త్రీయాంశాలను తొలగించబూనుకుంటున్నప్పుడు కూడా శాస్త్రవేత్తలు, మేధావులూ నిరసనలు తెలియజేసారు. సంతకాలతో కూడిన పిటిషన్లు పెట్టారు. ఎన్నిచేసినా వీరి ధోరణి దున్నపోతు మీద కాదు కాదు ఖడ్గమృగం మీద వాన కురిసిన చందమే.

డార్విన్ పరిణామవాదాన్ని కాదంటున్న వీళ్ళంతా మరి దేనిని శాస్త్రీయమంటున్నారు? పురాణేతిహాసాలలో చెప్పబడేవే ప్రామాణికాలా?!.. అందులో పాత్రల జననాలే పరిణామ పాఠాలా?!.. ఘృతాచి అను దేవవేశ్యను చూసిన భరద్వాజ మహర్షికి తక్షణమే ఇంద్రియం స్ఖలించగా, దానిని ద్రోణము (దొప్పు)లో వేయగా అందులోంచి ద్రోణుడు జన్మించాడు (మహాభారతం – ఆదిపర్వం – పంచమాశ్వాసం). విభాండక మహర్షి ఆచమనం చేయుచుండగా ఊర్వశి కనిపించెను. అపుడామహర్షికి వీర్యము స్ఖలించి నీటిలో పడెను. ఆ నీటిని రుష్యమను లేడి తాగగా దానికి జన్మించినవాడే రుష్యశృంగుడు (మహాభారతం – ఆదిపర్వం – పంచమాశ్వాసం).... ఇటువంటి వృత్తాంతాలను పురాణేతిహాసాల నుండి, ఉపనిషత్తుల నుండి విద్యార్థులకు శాస్త్రీయత అంటూ బోధిస్తారా?!..

ఎల్లకాలమూ తన దోపిడీని నిరాటంకంగా కొనసాగించేందుకు ప్రజారాశుల ఆలోచనల, తాత్విక వికాసాన్ని అడ్డుకోవడం, అణచి ఉంచడం సామ్రాజ్యవాద శక్తులకు అవసరం. తన అవసరానికి అనుగుణంగా భారతదేశం వంటి దేశాలలో అది నిరంకుశ ఫ్యూడల్ శక్తులతో అంటకాగుతూ, అండదండలందిస్తూ ఉంటుంది. ప్రస్తుతం పైచేయిగా ఉన్న మతవాదశక్తులు ఈ అవకాశాన్ని రెండుచేతులా అంది పుచ్చుకుంటూ తమ కోరలు సాచి చూపుతూ భయపెడుతున్నాయి. శ్రమజీవులందరినీ ఐక్యంచేసి, శ్రామికవర్గ సిద్ధాంతాలను వారికి చేరువ చేయడానికి కృషి చేయడమే ప్రజాతంత్ర మేధావుల తక్షణ కర్తవ్యం. ✺

## ఆర్.ఎస్.ఎస్ నాయకుడి శతజయంతి నిర్వహించమని మహారాష్ట్రలోని కళాశాలలకు ఆదేశాలు పంపిన యు.జి.సి!

**యూనివర్శిటీ** గ్రాంట్స్ కమీషన్ (విశ్వవిద్యాలయాల విరాళాల సంఘం) – 2023 నవంబరు 21న మహారాష్ట్రలోని కళాశాలలకు ఒక ఉత్తరం పంపి, దత్తాజీ దిదోల్కర్ శతజయంతిని 7 ఆగస్టు 2023 నుండి 7 ఆగస్టు 2024 వరకు జరపమని ఆదేశించింది. ఈ ఉత్సవాలలో విద్యార్థులు విరివిగా పాల్గొనే కార్యక్రమాలను రూపొందించమని చెప్పింది.

ఎవరీ దత్తాజీ దిదోల్కర్? ఆయన అఖిల భారత విద్యార్థి పరిషత్తు (ఎ.బి.వి.పి) సంస్థాపక సభ్యులలో ఒకరు. ఆర్.యస్.యస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం) నాయకుడు. దత్తాజీని వేలాది విద్యార్థులకు, యువకులకు ఉత్తేజాన్నిచ్చిన నాయకుడనీ, ఎన్నో సామాజిక సేవాసంస్థల స్థాపకుడనీ యు.జి.సి. తన ఉత్తరంలో ప్రశంసించింది.

దీనికి శివసేన యువజన విభాగం అభ్యంతరం తెలియజేసి ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరింది. ముంబాయి విశ్వవిద్యాలయ పూర్వ సెనేట్ సభ్యుడు, యువసేన కార్యకర్త ప్రదీప్ సావంత్ తన అభ్యంతరం తెలియచేస్తూ "శత జయంతిని ఆర్.ఎస్.ఎస్., ఎ.బి.వి.పి, రాజకీయ పార్టీలు వారివారి నిధులతో జరుపుకోవచ్చు కాని ఈ కార్యక్రమాన్ని కళాశాలలపై, విశ్వవిద్యాలయాలపై రుద్దటాన్ని వ్యతిరేకిస్తున్నా'మని ప్రకటించారు. ✺

గల్పిక

# పేదరికం పోయిందటహో!!

- శంకరం

**గోపాలకృష్ణయ్య** రోజూ ఏవో పేపర్ కటింగులు తీసి ఇంట్లోని గోడకు అంటించడం వాటన్నిటినీ చదువుతూ బాధ, కోపం ప్రదర్శించడం చూసిన మనవరాలు భారతి ఒకరోజు తాతయ్యను అడిగింది.

"తాతయ్యా! నేను రోజూ చూస్తున్నాను, ఏవో పేపర్ కటింగులు అంటిస్తున్నావు. వాటిని చదివి బాధగా, కోపంగా మొహం పెడుతున్నావు. ఏమిటవి?"

"నువ్వెప్పుడైనా చదివావా అమ్మా వాటిని?" అడిగాడు తాత గోపాలకృష్ణయ్య.

"లేదు తాతయ్యా, ఇప్పుడు చదువుతాను. సరేనా?"

"సరే, చదువమ్మా".

"444 మండలాల్లో తీవ్ర దుర్భిక్షం".

"దుర్భిక్షం అంటే ఏమిటి తాతయ్యా?"

"దుర్భిక్షం అంటే వర్షాలు పడకపోయి, పంటలు ఏవీ పండక, తిండికి కొరత వచ్చిన పరిస్థితి".

"ఓహో! అంటే కరువు అన్నమాట. 444 మండలాలు అంటే చాలా ఎక్కువ".

"ఇంకా చదువు" అన్నాడు తాతయ్య.

"కరువు తరుముతోంది - ఊరు తరలుతోంది".

"అర్థమయ్యిందా?"

"ఔను తాతయ్యా! పని, తిండి లేకపోవడం వలన ఊర్లు వదిలి వలసపోతున్నారు. మాకు మైగ్రేషన్ లెసన్‌లో వచ్చింది. మా క్లాసులో కూడా కొంతమంది మా ఫ్రెండ్స్ పేరెంట్స్ చెన్నై, కాశ్మీర్‌కి వలసలు పోయారు".

"సరే, తర్వాతది చదువు".

"వరి రైతుకు ఎన్ని కష్టాలో - పట్టించుకోని ప్రభుత్వం".

"రెల్లుగా వరి - రైతుకు ఉరి".

"పశుగ్రాసానికీ పనికిరానంతగా ఎండిన వరి".

"మద్దతు ధర సరే - ధాన్యం కొనుగోలు కేంద్రాలేవి?"

"సర్కారు నిర్లక్ష్యం - సాగునీరు సముద్రం పాలు"

"అంటే అర్థం కాలేదు తాతయ్యా".

"నదుల మీద అవసరమైన చోట ఆనకట్టలు, ఎత్తిపోతల పథకాల వంటివి కట్టకపోవడం వలన పంట పొలాలకు అందాల్సిన నీరు నేరుగా సముద్రంలోకి పోతుందన్నమాట".

"నిప్పుల్లా నిత్యావసరాలు". "నిజమే తాతయ్యా అమ్మ ఎప్పుడు చూసినా కూరగాయల ధరలు మండిపోతున్నాయమ్మా అంటుంది".

"పచ్చని పల్లెల్లో మద్యం ఏరులు".

గవర్నమెంటుకి ఆదాయం వస్తుంది కదా!"

"నిజమేనమ్మా! కానీ ఎన్ని లక్షల కుటుంబాలు సర్వనాశనమవు తున్నాయో తెలుసా?"

"ఔను తాతయ్యా!"

"ప్రజలపై మరో రూ. 1723 కోట్ల విద్యుత్ ఛార్జీల అదనపు భారం".

"అంటే కరెంటు ఛార్జీలు మళ్ళీ పెరుగుతాయన్నమాట".

"149 నెలల డిఏ బకాయిలు, పిఆర్‌సి బకాయిలు చెల్లించాలనీ, ఖాళీగా ఉన్న వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఉపాధ్యాయ సంఘాల ధర్నా". "డిఏ అంటే ఏమిటి తాతయ్యా?"

"నిప్పుల్లా నిత్యావసరాలు - అని చదివావు కదా! పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఉద్యోగులకు కొంత జీతం పెంచుతుంది. కరువు భత్యం అంటారు తెలుగులో".

"149 నెలలంటే 12 సం॥ల నుండి ఇవ్వడంలేదా?" అడిగింది భారతి.

"అలా కాదమ్మా, ఇప్పుడున్న ప్రభుత్వం వచ్చినప్పటినుండీ ప్రతి ఆరు నెలలకు ఇవ్వాల్సిన డిఏలు ఏవీ ఇవ్వలేదు".

"అంటే గత నాలుగు సం॥లుగా ఉద్యోగస్థులందరూ తక్కువ ఆదాయంతోనే గడుపుతున్నారన్నమాట" అంది భారతి.

"కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలనీ, పని ఒత్తిడి తగ్గించాలని డిమాండు చేస్తూ అంగన్వాడీ కార్యకర్తల సమ్మె".

"అంగన్వాడీ టీచర్లకు జీతం ఎంతిస్తారు తాతయ్యా?"

"పదివేలిస్తారమ్మా, చాలా కాలంగా జీతం పెంచమని వాళ్ళు అడుగుతూనే వున్నారు. ధరలు ఎంత పెరిగినా, ఎన్నిసార్లు ధర్నాలు చేసి, లాఠీ దెబ్బలు తిన్నా వాళ్ళకి జీతాలు పెంచలేదు. చాలీచాలని బతుకులే!"

"ఆర్టీసీ ఉద్యోగులను సీపీఎస్‌లో చేరేందుకు ఆప్షన్ కోరిన యాజమాన్యం".

"ఇది అస్సలు అర్థం కాలేదు తాతయ్యా".

"2019లో ఇప్పటి ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వ సంస్థగా ప్రకటించింది. ఉద్యోగస్థులు పొంగిపోయారు. రిటైరైన తర్వాత తమకు మంచి పెన్షన్ వస్తుందని ఆశ పడ్డారు. కానీ ఇప్పుడు పూర్తి పెన్షన్ ఇవ్వలేం అంటోంది ప్రభుత్వం. వాళ్ళకే కాదమ్మా, 2004 తర్వాత ఉద్యోగాలు పొందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎవరికీ పూర్తి పెన్షన్లు రావు. ఎంత వస్తాయో కూడా తెలీదు".

"అంటే తాతయ్యా, రిటైరైన తర్వాత ఇంకొక ఉద్యోగం వెతుక్కోవాలా?"

"అదే కదా ఇప్పుడు సమస్య!"

"వైద్య సేవలకు ఆర్థిక సంఘం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించిన రాష్ట్ర ప్రభుత్వం"

"పంచాయితీలకు ఆర్థిక సంఘం ఇచ్చిన నిధులను దారి మళ్ళించిన ప్రభుత్వం - పంచాయితీల్లో పనులేమీ చేయలేక రాజీనామాలకు సిద్ధపడుతున్న సర్పంచులు".

"అప్పులు చేసి మరీ ప్రభుత్వ పనులు చేయించిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించని కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్న కాంట్రాక్టర్లు".

"140 కోట్ల భారత జనాభాలో 53 శాతం మందికి పైగా మరుగుదొడ్లు లేవు".

"ప్రతి సం॥ము ఆరోగ్య సంరక్షణ ఖర్చుల కారణంగా ప్రతి సెకనుకు ఇద్దరు వ్యక్తులు పేదరికంలోకి నెట్టబడుతున్నారు - ఆక్స్‌ఫామ్".

"భారతదేశంలోని మొత్తం సంపదలో 40 శాతం కేవలం ఒక శాతం ధనవంతుల వద్ద పేరుకుపోయిందని ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించింది".

"ఆక్స్‌ఫామ్" అంటే ఏమిటి తాతయ్యా?"

"అదొక స్వచ్ఛంద సంస్థ. మన దేశంతోసహా ప్రపంచంలోని పేదరికం, ఆర్థిక అసమానతల గురించి ప్రతి సంవత్సరము నివేదికనిస్తుంది".

"ప్రపంచ ఆకలి సూచీలో 121 దేశాలలో భారత్ 107వ స్థానానికి దిగజారిపోయింది" -

"22.4 కోట్ల మంది భారతీయులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. వీరి సంఖ్య ప్రపంచంలో 1/4వ వంతు".

"మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గత సంవత్సరము కేటాయింపులతో పోలిస్తే ఈ సంవత్సరము 18 శాతం నిధుల కోత".

"అమెజాన్ అలెక్సాలో ఉద్యోగులపై వేటు".

"పలు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు వేల సంఖ్యలో ఉద్యోగులను ఆర్థిక మాంద్యం భయంతో తొలగిస్తున్నాయి".

"కేంద్రంలో 60 లక్షల పోస్టులు, రాష్ట్రంలో రెండున్నర లక్షల పోస్టులు ఖాళీ".

"అయ్యబాబోయ్! ఇవన్నీ చదువుతుంటే మన దేశంలో బాగా డబ్బున్న చాలా కొద్దిమంది తప్ప అన్నిరకాలవాళ్ళూ బాధలు పడుతున్నట్టే ఉంది కదా తాతయ్యా?"

"ఔను తల్లీ! అదే నన్ను బాధకు, ఆవేదనకు గురిచేస్తుంది. కానీ కొంతమంది ఘరానా వ్యక్తులు" ఈ దేశంలో ఇంకా ఎక్కడ వుంది పేదరికం?" అంటూ తప్పుడు వ్యాఖ్యానాలు చేస్తున్నారమ్మా!"

"ఎవరు తాతా మన దేశంలో పేదరికం లేదని చెప్పింది?!" ✺

# ముప్పై ఏళ్ళక్రితం ప్రజాసాహితి

## సంపుటి : 17 సంచిక : 7 ఫిబ్రవరి 1994

**కరీంనగర్** రైతాంగ ప్రతిఘటన పోరాట సంచికగా ఆర్టిస్ట్ మోహన్ వేసిన ముఖచిత్రం పోరాటాల జాతరతో ఈ ప్రత్యేక సంచిక వెలువడింది. రెండవ కవర్‌పేజీలో "జమకూడి పోదాం" పాటనూ - హెచ్చార్కే, నాల్గవ కవర్‌పేజీ పోరాటాల జాతర పాటను మిత్ర రాసారు. మొదటి కవర్‌పేజీలో కరీంనగర్ పోరాటాన్ని సమగ్రంగా వెలువరించడానికి చేసిన కృషిని, ఉన్న పరిమితులను అర్థం చేసుకోవాలని "ఒక మాట"నూ, "ప్రజా ఉద్యమాలదే తుది విజయం" అనే సంపాదకీయాన్నీ, సాహు రాసిన "పల్లె పల్లె గుడిసె నడుమ" పాటను, కోరన్న రాసిన "కరీంనగర్ పోరాటం - సామాజిక నేపథ్యం", గూడ అంజయ్య రాసిన "ఇగ ఎగబడుదామురో" అనే పాటలనూ, "కరీంనగర్ రైతాంగ పోరాటం - ఆరంభం" బాలగోపాల్, కోదండరామిరెడ్డిల వ్యాసాలను ప్రచురించారు. శివసాగర్ రాసిన "గంగదాటెళ్ళకే చెల్లమ్మా" పాటనూ, వి. చంద్ర రాసిన "కరీంనగర్ రైతాంగ ప్రతిఘటనా పోరాటం - మహిళల పాత్ర" వ్యాసాన్నీ, అజ్ఞాత్ రాసిన "పోరాడ రావమ్మా" పాటను ప్రచురించారు. "కామ్రేడ్ కొదురుపాక రాజవ్వ జీవితం - పోరాటం" పి.ఓ.డబ్ల్యు (స్త్రీ విముక్తి) 'పోరాట పథం' సౌజన్యంతో ప్రచురించారు. అల్లం రాజయ్య కథ "సత్యం", నూతన్ రాసిన "నక్సల్‌బరి వెలుగులో" పాటను ప్రచురించారు. "సాంఘిక అణచివేత-కరీంనగర్ పోరాటం" లక్ష్మయ్య వ్యాసం, "ఎర్రజెండానెతుక్కుంటూ" - సూరా రచన, నిర్బంధాన్ని ధిక్కరిస్తూ శశి రాసిన పాట. "కరీంనగర్ ప్రతిఘటన పోరాటంలో పాట ఒక పరిశీలన" - రచన దేవేందర్, మురిసిన ఎర్రమబ్బుల్లో - సుత్తికొడవళ్ళు దేవేందర్ రాసిన పాట, "కరీంనగర్ రైతాంగ పోరాటం - బాలలు సీను రాసిన వ్యాసం". "రండీ రండీ రండీ బిరా బిరా రండీ (పాట)" - తులసీ సంపత్, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా" - భానుమూర్తి వ్యాసం, ఎన్నెలెలుగూ రేపైనా రాకపోదు. మిత్ర రాసిన పాట; "ప్రభాత విహంగాలు" సహదేవ్ రాసిన పాట. "కరీంనగర్ పోరాట సాహిత్యం ఒక జీవధార" పరజ రాసిన వ్యాసం; "నెల్లిమర్ల జూట్ కార్మికుల హత్యాకాండని ఖండించండి" జనసాహితి, 'ప్రజాసాహితి', అరుణోదయలు సంయుక్తంగా ఇచ్చిన ప్రకటనను ప్రచురించారు. వెంకన్న రాసిన "రాజ్యహింస" పాట, జూలియస్ ఫ్యూజిక్ రచన "పోరాటంలో పాల్గొన్నవారిని గురించి", సుధాకిరణ్ రాసిన "కొండాపూర్ అమరుల కోసం", ప్రతిన్ రాసిన "కామ్రేడ్ ముదాం రాములన్న" స్మృతిలో.... పాటలను ప్రచురించారు. "కరీంనగర్ జిల్లా అమరులు" పేరుతో పోరాటంలో అమరులైన వివరాలను పరిచయం చేశారు.

1/8 డెమ్మీ పుటలు : 189. వెల : రూ. 6/- ✺

సమీక్ష

**ఇది లెనిన్ శత వర్ధంతి సంవత్సరం....**

# లెనిన్ కావ్యం

## మయకోవ్‌స్కీ రాసిన కావ్య పరిచయం

- దాదాహయాత్

**శ్రీశ్రీకి** కవిత్వమనే ఆల్కెమీ రహస్యం ఒక్క స్వతంత్ర కవిత్వానికే కాదు తెలిసింది, అనువాద కవిత్వాన్ని కూడా అల్కెమీగా మార్చి ఆ రహస్యం కూడా గ్రహించినవాడు శ్రీశ్రీ. తాను రాసిన ఎన్నో అనువాద కవితలు స్వతంత్ర కవితలుగా భాసిస్తూ వుండడమే శ్రీశ్రీవి ఫక్తు అనువాదాలని అనుకోవడానికి వీల్లేదని చెబుతున్నాయి. ఇవాళ ఎన్నో సుప్రసిద్ధమైన కవితలు - ప్రజల నోళ్ళలో నానుతున్నవి - శ్రీశ్రీ అనువాదాలని చెప్పినప్పుడు ఎందరో ఆశ్చర్యపోతుంటారు. శ్రీశ్రీ ఆ కవితల్ని తెలుగులో అనువాదం చేయలేదు, పునర్నిర్మించాడనడం సబబు.

లెనిన్ కావ్యం అసలు పేరు 'వ్లదీమీర్ ఇల్యీచ్ లెనిన్'. రష్యన్ భాషలో వ్లదిమీర్ మయకోవ్‌స్కీ రాసిన కావ్యం. రష్యన్ మూలానికి అంతర్జాల ఆంగ్లానువాదాన్ని మనం నమ్మేట్లయితే మయకోవ్‌స్కీ తన కావ్యాన్ని ఇలా ప్రారంభించాడు -

I dedicate my time
    to the Russian Communist Party
I'm starting
    a story about Lenin
But not because
    there is no more
        grief,
time
    because the sharp melancholy
has become a clear,
    conscious pain.
Time to
    once again
spread
    like a pudle of tears Lenin
is still
more alive than all the living.

ఇందులో I dedicate my time to the Russian Communist Party అనే మయకోవ్‌స్కీ ప్రారంభ వాక్యంలో 'టైం' అనే పదం చాలా ముఖ్యం. మయకోవ్‌స్కీ తన టైం యావత్తు రష్యన్ కమ్యూనిస్టు పార్టీకి అంకితమిచ్చాడు గనక లెనిన్ కావ్యాన్ని రాయడంలో టైం వృథా చేయడంలేదు అని తెలియజేస్తూ లెనిన్ కావ్యాన్ని తను ఎందుకు రాస్తున్నాడో కూడా చెప్పుకున్నాడు.

ఆ వాక్యాల్ని, 'రష్యన్ కమ్యూనిస్టు పార్టీకి అంకితం నా సమయం - రాయబోతున్నాను లెనిన్ కథను - దుఃఖం నాలో మిగలక కాదు - లేదని కాదిక సమయం....' అనో, మరోలాగానో అనువదించి వుంటే అది ముక్కస్యముక్కానువాదం అయికూర్చునేది. మొదటి వాక్యాలతో తెలుగు పాఠకులకు సంబంధం లేదుగనక ఇలా మార్చాడు శ్రీశ్రీ -

"ఈ కావ్యాన్ని రష్యన్ కమ్యూనిస్టు పార్టీకి అంకితమిస్తున్నాను".

మయకోవ్‌స్కీ చెప్పకున్నా ఆ మొదటి వాక్యానికి అర్థమదే. ఆదిలోనే హంసపాదు ప్రమాదం తప్పించాక ఇక ఎత్తుకున్నాడు శ్రీశ్రీ -

ఇదే అదను లెనిన్ కథను
రచించెదను నేను,
లెనిన్ బ్రతుకు జనం కొరకు
ధ్వనించెదను నేను

మనోవేదన నాలోన
నశించెనని కాదు,
విశాలమగు విషాదగుహ
వసించితిని నేడు.

లెనిన్ కథాక్రమం సదా
జపించితిని నేను
విషాదాశ్రు తుషారాల
నిషా నాకు లేదు

లెనిన్ నేడు లేడూ? చూడు
జనంలో వున్నాడు.

శ్రీశ్రీ మయకోవ్‌స్కీని ఇంప్రూవ్ చేశాడని చెప్పడం నా వుద్దేశం కాదు. శ్రీశ్రీ కవి హృదయాన్ని పట్టుకున్నాడని చెప్పడం పేలవంగా వుంటుంది. మూలకవితో సమాన ప్రతిభ కలవాడే కావ్యానువాదానికి అర్హుడనేది ఎన్నోమార్లు రుజువైన సత్యం. శ్రీశ్రీ ఒక మయకోవ్‌స్కీకే కాదు, ప్రపంచ మహాకవులు చాలామందితో సమాన స్థాయిలో నిలబడగల హిమాలయం. అందుకే లెనిన్ కావ్యాన్ని శ్రీశ్రీ అనువదించలేదు, పునర్నిర్మించాడు.

మయకోవ్‌స్కీ లెనిన్‌ని ప్రేమించాడు. ఎంతగా ప్రేమించాడంటే ఆనాటి ప్రపంచ కార్మికులంతా కలిసి లెనిన్‌ని ఎంతగా ప్రేమించారో అంతగా తానొక్కడే అయి ప్రేమించాడు. లెనిన్ భౌతికంగా మరణించాక ఆరేళ్ళకు మయకోవ్‌స్కీ రివాల్వర్‌తో కాల్చుకుని చనిపోయాడు. ఎందుకలా చేశాడో ఎవరికీ తెలీదు. లెనిన్ కావ్యం చదివాక రొమాంటిక్‌గా నాకే మనిపిస్తుందంటే లెనిన్ లేని ప్రపంచంలో తానెందుకుండాలనే వేదనతో కాల్చుకున్నాడేమోనని. మయకోవ్‌స్కీ ఇలా రాసుకున్నాడు –

....ఎప్పుడూ
అతని దగ్గర్లోకి వెళ్ళని నేను
అతని ఒక చిన్న నిశ్వాసానికి
నా ప్రాణాన్నే ఇచ్చేస్తాను.

కానీ ఈ వాక్యాల్ని లిటరల్‌గా తీసుకోరాదు. మయకోవ్‌స్కీ లెనిన్‌ని ప్రేరమించాడేగాని, లెనిన్ భౌతిక కాయాన్ని కాదు. ఆ విషయమే స్పష్టం చేస్తూ ఇలా రాశాడు –

ఉల్యానోవ్ అనే వ్యక్తికి జీవితం
హ్రస్వజీవితం
అందరి బ్రతుకుల్లాగే అది
మన కళ్ళ ముందు గతించిపోవడం చూశాం.

కాని కామ్రేడ్ లెనిన్ జీవితం
సుదీర్ఘ జీవితం
ఆ జీవిత చరిత్రను అనేక పర్యాయాలు
రాయవలసిందే వర్ణించవలసిందే.

వ్లదీమీర్ ఇల్యిచ్ ఉల్యానోవ్‌కీ, కామ్రేడ్ లెనిన్‌కీ అభేదం పాటించడం లేదు మయకోవ్‌స్కీ. ఉల్యానోవ్ ఒక భౌతిక అస్తిత్వం. కామ్రేడ్ లెనిన్ శాశ్వతం. మయకోవ్‌స్కీ తన కావ్యానికి 'వ్లదీమీర్ ఇల్యిచ్ లెనిన్' అని పేరు పెట్టడంలో రహస్యమది. అందుకే తను రాస్తున్నది లెనిన్ జీవిత చరిత్ర అని చెప్పినా లెనిన్ భౌతిక జీవిత యాత్ర కాదది. ఈ కావ్యంలో లెనిన్ జీవిత విశేషాలేవీ లేవు. 'కామ్రేడ్ లెనిన్' అని కవి పిలుస్తున్నది సామ్యవాదాన్ని. సామ్యవాదం కామ్రేడ్ లెనిన్‌లో సంపూర్ణంగా మూర్తీభవించడాన్ని, లెనిన్ సామ్యవాదంలో సంపూర్ణంగా లీనం కావడాన్ని ఇందులో గానం చేస్తున్నాడు కవి.

లెనిన్ నా కనుపాప!
క్షుద్ర కావ్యంతో అవమానిస్తానా?
హృద్రక్తం ఉప్పొంగి రాస్తున్నాను.
అంతరాత్మ శాసనాన్ని అంగీకరిస్తున్నాను.
ఇది నా విధి.
ఈ నా ధర్మం నిర్వహిస్తున్నాను.

– అలా సంకల్పించుకుని ఇంకా ఇలా అంటాడు మయకోవ్‌స్కీ –

చాలా చాలా కాలం క్రిందట
సుమారు రెండువందల సంవత్సరాల క్రితం
చరిత్ర మొట్ట మొదటిసారిగా
లెనిన్ గురించిన వార్త వినబడింది

ఇప్పుడైతే అది మూడు వందల సంవత్సరాల క్రితం అనాలి. అప్పటికి యాభై ఏళ్ళ క్రితం మాత్రమే జన్మించిన లెనిన్ గురించిన వార్త రెండు వందల సంవత్సరాల క్రితమే ఎలా వినబడింది?

నీలాంటి
నాలాంటివాడే అతను....
మనలాగే అతడూ
అపయాలూ నిరాశలూ ఎదుర్కొన్నాడు
అనారోగ్యంతో పోరాడాడు.

ఇలా సామాన్యీకరించి వాస్తవిక దృష్టితో కావ్యం రాస్తున్న కవి లెనిన్ పుట్టడానికి నూట యాభై సంవత్సరాల క్రితమే అతని గురించి వార్త వెలువడిందనడం లాంటి కవిసమయాలు ఎలా సృష్టిస్తాడు? నిజానికి ఆ వార్త ఇప్పటికీ మనకు వినబడుతూనే వుంది.

వినబడుతోందా గుఫ్ జఫ్ జఫ్
కాలం సీలల్ని చీల్చుకు వస్తున్న
స్టీవెన్‌సన్ తాత స్టీం యంత్రం గొంతుక?

ఆ మొదటి ఆవిరి ఇంజన్ పాడిన పాటే బావిలో లెనిన్ ఆగమనాన్ని తెలియజేసిందని చెప్పడంతో పెట్టుబడిదారీ వ్యవస్థ యంత్రంతో ముడిపడి వుందనే వాస్తవం మయకోవ్‌స్కీ తెలియజేస్తున్నాడు. కాబట్టి చారిత్రక పరిణామ క్రమంలో లెనిన్ పుట్టుక అప్పుడే నిశ్చయమై పోయింది. అది ఉల్యానోవ్ భౌతిక జననం కాదు. మానవజాతి చరిత్రలో సామ్యవాదాన్ని సమర్ధవంతంగా ప్రయోగించగల లెనిన్ అనే చోదకశక్తి ఉద్భవం. అది కవి సమయం ఎంతమాత్రం కాదు. అలా అద్భుతాన్ని ప్రతిపాదించి అంతలోకే నేలకు దించడం మయకోవ్‌స్కీని గొప్ప కవితా రూపశిల్పిగా నిలబెడుతోంది. ఒక చారిత్రక పురుషుడి జీవిత చరిత్రను ప్రతిపాదించి అతని తాత్వికతకు, క్రియాశీలతకు అభేదం పాటించి చూపగలగడం, అదే అతడి జీవితచరిత్రగా చెప్పగలగడం గొప్ప శిల్పం.

మయకోవ్‌స్కీ తన కవిత్వాన్నిలా విశ్లేషించుకుంటాడు – తన గీతాల్ని సమర నినాదాల్లాగా ప్రతిధ్వనించనియ్యమంటాడు. ప్రణయ గీతాలు రాయడానికిది సమయం కాదంటాడు.

ఓహో యుద్ధ సన్నద్ధమైన
కార్మికవర్గమా
నిప్పులు కక్కే నా కవిత్వం
నీ కోసం సంసిద్ధం.

ఆ సమయంలో కార్మికవర్గం యుద్ధ సన్నద్ధం ఎలాగయ్యింది? ఆర్థిక సామాజిక పరిస్థితి ఎలాగుంది?

దేఖో ఈ లోకం
పెట్టుబడిదారుకి ఇరుకయింది
దాహం తీరని లాభాల
స్వప్నాలతో
కోట్లకి విలువైన వజ్రపుటుంగరాల చేతులు
ఇతర ప్రాంతాలను నొల్లుకోవడానికి
సాగుతాయి

కిరాయి సైన్యాలు
కవాతు చేస్తూ కదుల్తాయి
'చంపు! నరుకు!' అని అరుస్తూ.

ఒక విధంగా అప్పటి పరిస్థితులు కూడా ఇప్పటిలాగే వున్నాయి. ఎప్పటిలాగే లోకం అప్పుడు కూడా ఇప్పటిలాగే వుంది. కానీ అప్పుడు కార్మికలోకం ఏమంటోంది?

ఆకాశాలని ఆక్రమించడానికి
వస్తున్నాం మేము
మురికిపేటల దరిద్రాలను
చీల్చుకుంటూ వస్తున్నాం

రాబోతున్నాడు చూడు
కార్మికుల కన్నకొడుకు
ఇంకా పుట్టబోని నాయకుడు
ఏకం చేస్తాడు మమ్మల్ని

కార్మికులెందుకు ఏకం కావాలంటే, వారిలా తర్కించుకుంటున్నారు –

చెదురుమదురుగా
ప్రతిభావంతులు వేసిన కాలిబాటలు
కాగలవా కోటానుకోట్ల
పీడిత ప్రజల రాచబాటలు?

ఇప్పుడు పెట్టుబడికి కూడా
యుద్ధాన్ని అదుపులో పెట్టడం
అసాధ్యమయింది
కాబట్టి ఈ పొరపాట్లు, చేసే
దొంగాడి యంత్రం
మరింత జోరుగా తిరుగుతుంది
సమ్మెలతో సంఘర్షణలతో
కిందామీదా పడుతూ!

ఏమిటి అర్థం
ఈ బంగారపు తిండి తింటున్న
సర్కస్‌కి?
ఎవరిలో వుంది దోషం?
మేం వహించడం ఎవరి పక్షం?

శతసహస్ర లక్షల తలల
చేతుల కార్మిక వర్గం
బుర్ర గోక్కుంటోంది
గ్రహించుకోలేక కర్తవ్యం!

అప్పుడిలా అంటాడు కవి –
విద్యుత్కిరణాలు
ఉక్కును తినేసినట్లు
పెట్టుబడిదారీ విధానపు
రోజులు నిండాయి
అప్పుడు కాలం కడుపుతో వుండి
కార్ల్‌మార్క్స్‌ని ప్రసవించింది.

కార్ల్‌మార్క్స్ ప్రస్తావన లేకుండా లెనిన్ గురించి చెప్పడం సాధ్యం కాని పని. అయితే కార్ల్‌మార్క్స్ కూడా ఇక్కడ చరిత్ర పరిణామ క్రమంలో ఉద్భవించిన మహోపాధ్యాయుడు ఒక వ్యక్తి కాదు.

గుడ్డి సిద్ధాంతాల ఊబిలో చిక్కుకుని
ఉక్కిరిబిక్కిరవుతున్న కమ్యూనిజంలో
ఎప్పుడో కాలం కలిసివస్తేనే
ఈ నరకం నుంచి విడుదల అని
భావించే మనకు
కార్ల్‌మార్క్స్ చూపించాడు
గంభీర చారిత్రక నియమావళిని
చక్రం నడపండని చేతికిచ్చాడు
కార్మికులకు

పారిస్ కమ్యూన్ నుంచి పాఠాలు నేర్చుకుని ఆనాటి కమ్యూనార్డుల నీడలు నేటికీ గొంతెత్తి అరుస్తాయి –

చూడండి, వినండి కామ్రేడ్స్,
మా పరాజయం నుండ నేర్చుకోండి
ఒంటరిగా పోరాడేవాడికి
ఓటమి తప్పదు
మరచిపోకండి మేము నేర్పే
ఈ గుణపాఠాన్ని
శత్రువు నెదుర్కోవాలంటే
శక్తివంతమైన పార్టీ కావాలి
సమస్త కార్మిక వర్గాన్నీ
ఒక బిగించిన పిడికిలిగా మార్చాలి

సరిగ్గా అది లెనిన్ పుట్టిన సంవత్సరంలోనే జరిగింది. లెనిన్, 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి' అంటూ నినదించాడు. లెనిన్ పసిగుడ్డుగా వున్నప్పుడే అది నిశ్చయమైపోయింది.

మార్క్స్ పుస్తకాలు
అచ్చొత్తిన కాగితాలు కావు
అంకెలు కావు లెక్కలు కావు
బూజుపట్టిన కవిలె కట్టలు కావు
దారి తెలియని కష్టజీవులకు
క్రమశిక్షణ నేర్పిన గ్రంథాలవి
విశ్వాసాన్ని వేగాన్ని సాధించి
విప్లవ మార్గాన ముందుకు సాగించే
గ్రంథాలవి

**(ముగింపు వచ్చే సంచికలో)** ✺

# జనసాహితి కార్యవర్గ తీర్మానాలు

## 2023 డిశంబరు 25, 26 తేదీల్లో విజయవాడలో సమావేశమైన జనసాహితి కార్యవర్గం చేసిన తీర్మానాలు

**ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న సామ్రాజ్యవాదుల యుద్ధోన్మాద దాడులను ఖండిస్తున్నాం :**

యుద్ధాలను సృష్టించడం సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలలో ఒక అంశం. ప్రపంచవ్యాప్తంగా చిన్న ఆర్థిక వ్యవస్థలున్న బలహీన దేశాల సంపదలను దోచుకుంటూ అదే దేశాలను పావులుగా మార్చుకోవడం సామ్రాజ్యవాద విధానాలలో ఒక భాగం. తమ ఆధిపత్య విస్తరణవాద విధానాలను ఆ దేశాలపై రుద్దడంకోసం, నిరంతరం ఆయుధ వ్యాపారంలోభాగంగా సామ్రాజ్యవాద దేశాలు వివిధరూపాలు యుద్ధాలు చేస్తున్నాయి. ఈ యుద్ధాలవల్ల బాధిత దేశాలలో ప్రధానంగా మహిళలు, యువత, చిన్నారులు తమ ప్రాణాలు కోల్పోతున్నారు. ఆర్థికంగా, సామాజికంగా నాశనమవుతున్నారు. దశాబ్దాలపాటు తమ దేశాలలో సాధించుకున్న అభివృద్ధిని, నిర్మించుకున్న నాగరికతలను ఈ యుద్ధాలు ధ్వంసం చేస్తున్నాయి. ఈ సామ్రాజ్యవాద యుద్ధోన్మాద దాడులను జనసాహితి వ్యతిరేకిస్తున్నది, ఖండిస్తున్నది.

**పాలస్తీనా ప్రజల న్యాయమైన పోరాటానికి సంఘీభావంగా నిలబడదాం :**

ఆంగ్లో అమెరికన్ సామ్రాజ్యవాదుల కుట్రలవల్ల మాతృభూమిలోనే కాందిశీకులుగా బ్రతుకుతూ, యూదు జాత్యహంకారుల దురాక్రమణకు బలౌతూ, తమ బిడ్డలకైనా స్వతంత్ర జీవితాన్ని ఇవ్వాలనే పట్టుదలతో, జాత్యహంకార ఇజ్రాయెల్ తో గత వందేళ్లుగా పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు జనసాహితి సంఘీభావం ప్రకటిస్తోంది. జాతీయోద్యమ కాలం నుంచి పాలస్తీనా ప్రజల న్యాయమైన పోరాటానికి సంఘీభావంగా నిలబడుతున్న భారత ప్రజల స్ఫూర్తికి విరుద్ధంగా ఇజ్రాయెల్ ప్రభుత్వంతో అంటకాగుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూంది పాలస్తీనాకు సంఘీభావంగా తమ రచనలను, కార్యాచరణను ఎక్కు పెట్టవలసిందిగా రచయితలూ – ప్రజాస్వామికవాదులకు పిలుపునిస్తూ జనసాహితి తీర్మానిస్తోంది.

**మణిపూర్ మారణకాండకు పాలకులే బాధ్యత వహించాలి :**

మణిపూర్ రాష్ట్రంలో పరిణామాల పట్ల జనసాహితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. అక్కడి వివిధ ప్రజల నడుమ ఉన్న వైరుధ్యాలను రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సంఘర్షణ స్థాయికి పెంచటాన్ని, కుకీలపై మొయితీలను రెచ్చగొట్టే విధానాలను జనసాహితి ఖండిస్తోంది. అంతేకాకుండా ఆదివాసి ప్రాంతాలలో జీవించే కుకి తెగపై మోయితి జాతి వారి హింసాత్మక దాడులను, ముఖ్యంగా మహిళలపై సాగించిన అత్యాచారాలను, వారిని నగ్నంగా ఊరేగించిన పైశాచిక కృత్యాలను జనసాహితి తీవ్రంగా ఖండిస్తోంది. పై హత్యాకాండనూ మహిళలపై అత్యాచారాలను నిరోధించలేని రాష్ట్ర ప్రభుత్వం, దాన్ని అదుపు చేయలేని కేంద్ర ప్రభుత్వం ఈ దుస్థితికి కారణంగా మేము భావిస్తున్నాము. మణిపూర్‌తో సహా వివిధ రాష్ట్రాలలోని ఖనిజ సంపదలను దోపిడీ చేసుకోగల అవకాశాలను బడా కార్పొరేట్ కంపెనీలకు కల్పించడానికి భారత పాలకులు సాగిస్తున్న వివిధ ప్రజా వ్యతిరేక చర్యలను జనసాహితి ఖండిస్తోంది మణిపూర్ తో సహా అనేక ఇతర రాష్ట్రాలలోని ఆదివాసీలు తమ హక్కుల కోసం సాగిస్తున్న పోరాటాలకు మద్దతుని సంఘీభావాన్ని తెలియజేస్తోంది.

**జమ్మూ కాశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తి విషయంలో సుప్రీంకోర్టు తీర్పును ఖండిస్తూ :**

జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర ప్రజలకు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పిస్తూ భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 370ని 2019 ఆగస్టు 5న భారత పార్లమెంటు రద్దు పరిచిన దానిని సుప్రీంకోర్టు ఇటీవల సమర్ధించడం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. గత ప్రభుత్వాల వాగ్దానాలను ఇది వమ్ము చేస్తుంది. ప్లెబిసైట్ నిర్వహించడం ద్వారా కాశ్మీరు ప్రజల అభిప్రాయాలను సేకరించి దాని ప్రాతిపదికపై నిర్ణయాలు తీసుకుంటామని భారత ప్రభుత్వం, కాశ్మీర్ ప్రజలకే కాక, ఐక్యరాజ్యసమితి ద్వారా ప్రపంచ ప్రజలకు కూడా వాగ్దానం చేసిన విషయం భారత రాజ్యవ్యవస్థల జ్ఞాపకాలలోనే లేదా అన్నట్లు వ్యవహరించడాన్ని తీవ్రమైన తప్పిదంగా మేము భావిస్తున్నాము. వివిధ జాతులుగా ఉండిన భారత దేశంలో సమాఖ్య తరహా పరిపాలనకు భారత రాజ్యాంగం వాగ్దానం చేసినప్పటికీ దాని నిజమైన స్ఫూర్తిని అమలు చేయటానికి సిద్ధం కాకపోవటం కేంద్ర పాలకుల వైఫల్యాలలో ఒకటి. ఈ జాతుల హక్కుల నిరాకరణను జనసాహితి గర్హిస్తోంది.

**రైతాంగ సమస్యలపై సాగుతున్న ఉద్యమాలకు సంఘీభావం ప్రకటిద్దాం :**

ఈ సంవత్సరపు ఖరీఫ్ సీజన్ సాగుకు వర్షాభావ పరిస్థితి ఏర్పడింది. తీరా అరకొరగానైనా వేసిన పంట చేతికి వచ్చేసరికి 'మిచాంగ్' తుఫాను వలన చేతికందాల్సిన పంటకాస్తా నీళ్ళపాలైన పరిస్థితి. ఈ అనావృష్టి, అతివృష్టి పరిస్థితులు రైతును సంక్షోభపు సుడులలోకి మరింత బలంగా నెట్టివేశాయి.

భూగర్భ జలాలను, 'ఉపరితల జలాలను, వర్షపునీటినీ సమగ్రంగా, శాస్త్రీయంగా నిల్వ చేసుకునే పద్ధతిని విస్మరిస్తూ, నిత్యమూ నదీజలాల వివాదాలు, యాజమాన్య రాజకీయాలు వంటి వాటినే పాలకులు పనిగా పెట్టుకున్నారు. ఇంకొకవైపు చేతికొచ్చిన పంట వరదనీటిపాలౌతుంటే చేతులెత్తేసి చోద్యం చూస్తూ నిలుచున్నారు. ఎన్నికల నాటకాలలో పార్టీలు, జెండాలు, ఎజెండాలు ఏవి ఎటుమారినా.. పాలకులు ఎవరైనా.... భూమి నుండి రైతును వెళ్ళగొట్టే విధానాలనే కొనసాగిస్తున్నారు.

వ్యవసాయం దండగమారి విధానమంటూ, వ్యవసాయదారులు తెలివి తక్కువవారని ప్రచారంచేస్తూ వారిని మార్కెట్ మాయాజాలానికి బలిచేస్తున్నారు. కాకులను కొట్టి గద్దలకు వేసారనే చందాన, అన్నపూర్ణ దేశంలో.... ప్రధాన ఉత్పత్తి వనరైన భూమిని రైతులను కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తున్నారు. పాలకుల ఈ వంచనాత్మక, రైతాంగ వ్యతిరేక విధానాలను జనసాహితి తీవ్రంగా ఖండిస్తున్నది. రచయితలను, కవులు, కళాకారులను, మేధావులను రైతాంగానికి అండగా నిలవాలని కోరుతున్నది.

**పశుప్రవృత్తిని, నేర ప్రవృత్తిని హీరోయిజంగా చూపుతున్న నేటి సినిమాలు :**

కళారంగంలో సినిమా అనేది అత్యంత శక్తింతమైనది. తమతమ జీవితాలలోకి తొంగిచూసుకుని, మరింతగా ఉన్నతీకరించుకునేందుకు ప్రజలకు దారి చూపగలిగే బలమైన సాధనం. తమపై అమలయ్యే పాలక విధానాలను తరచి చూసుకునేందుకు ప్రజలకు ఉపయోగపడే సృజనాత్మక కళారూపం. కానీ ఇక్కడే పాలకులు, ప్రజలను చైతన్యవంతులను చేయగలిగే సినిమా పట్ల అత్యంత జాగరూకతతో ప్రజావ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలలో.. ముఖ్యంగా యువతలో పెడధోరణులను పనిగట్టుకుని మరీ ప్రోత్సహిస్తున్నారు. వందల కోట్ల బడ్జెట్టులు కేటాయించి మరీ యువత మెదళ్ళలో అశ్లీల నేరస్తమయ సంస్కృతిని దట్టిస్తున్నారు. యువతీ యువకులు తమ ఉపాధి, భద్రత, దేశ భవిష్యత్తు వంటి విషయాలను గురించి ఆలోచించనీయకుండా దృష్టిని పక్కదారి పట్టించేందుకు వందల వేల సంఖ్యలో కామిక్కులు, థ్రిల్లర్‌లు వంటి పేర్లతో యధేచ్ఛగా చెత్తను దిగుమతి చేస్తున్నారు. పురాణేతిహాసాల గుంజలకు ప్రజల మెదళ్ళను కట్టివేసే యితివృత్తాలను లేదా నేర ప్రవృత్తిని, పశుప్రవృత్తిని హీరోయిజంగా భ్రమింపజేసే పరమ నీచ సంస్కృతినీ ఇతివృత్తాలుగా సినిమాలు రూపొందించడాన్ని ప్రోత్సహిస్తున్నారు. అడ్డొస్తే అడ్డగోలుగా తెగనరికే స్మగ్లర్ల ఇతివృత్తానికి జాతీయ అవార్డు ఇచ్చి మరీ ప్రోత్సహించడం ఈ విధానాలకు పరాకాష్ట. అక్కడితోనే ఆగక.... పశుప్రవృత్తితో సభ్య సమాజపు పరిధులను అతిక్రమించడమే హీరోయిజంగా యువతను వెర్రెక్కించే సినిమాలను సమాజం మీదికి వదులుతున్నారు.

యువతను దేశాభ్యున్నతికి బాటలు వేసే వారిగా కాక, ప్రజాస్వామిక భావజాలాన్ని వాతావరణాన్నీ, ధ్వంసం చేసేవారిగా మార్చదలుచుకున్న ఈ పెట్టుబడుల సినిమా మాయాజాలాన్ని.... దానికి ఇతోధికంగా సహకరిస్తూ ప్రజల మెదళ్ళను మొద్దుబార్చి ఉంచుతూ తమ పాలకవర్గ ప్రయోజనాలకు అడ్డులేకుండా చూసుకుంటున్న ప్రభుత్వాల ప్రజావ్యతిరేక వైఖరులను, విధానాలనూ జనసాహితి కార్యవర్గం తీవ్రంగా ఖండిస్తున్నది.

**దళితులు, మైనారిటీలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలి :**

"ఆజాదీకా అమృత మహోత్సవ్"ను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తున్న సందర్భంలోనే – తాను చదువుకునే విద్యాసంస్థలోనే కుండలోని నీరు తాగినందుకుగాను తొమ్మిదేళ్ళ దళిత విద్యార్థి ఇంద్రకుమార్ మేఘ్వాల్ అగ్రకులోన్మాదం తలకెక్కిన ఉపాధ్యాయుని చేతిలో తీవ్ర హింసకు గురై ఆగస్టు 15న మరణించాడు. ఉత్తరప్రదేశ్‌లో దళిత అక్కా, చెల్లెళ్ళపై అత్యాచారం చేసి చంపేసి చెట్టుకు వేళ్ళాడ దీశారు. రాలిన మామిడి పండు తిన్నందుకు దళిత బాలుడ్ని, పెళ్ళిలో గుర్రం ఎక్కినందుకు దళిత యువకుడ్ని చంపేశారు. ముస్లిం మహిళ బిల్కిస్‌బానోపై సామూహిక అత్యాచారం జరిపి, ఆమె కుమార్తెతో సహా కుటుంబసభ్యులనేకమందిని హతమార్చిన హిందూ మతతత్త్వ గూండాలను సత్ప్రవర్తన కలవారిగా నిర్ణయించి ఆగస్టు 15న విడుదల చేశారు. ఇంక మణిపూర్‌లో దళిత మైనారిటీలపై జరిగిన దాడుల గురించి మాట్లాడడానికి మాటలు చాలని పరిస్థితి. కేవలం ఒకటో, ఆరో మీడియాలో వచ్చిన వాటి గురించి ప్రశ్నిస్తే, అలాంటివి వందలు, వేలు జరిగాయని, బయట ప్రపంచానికి తెలియరాదనీ ఇంటర్నెట్ సేవలు ఆపమని పాలకులు నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నారు. ఇప్పుడు ప్రస్తావించినటువంటి సంఘటనలు దేశమంతా పెచ్చరిల్లుతున్నాయి. మణిపూర్ లాంటి ఘటనలను సృష్టించి లేదా ప్రజావ్యతిరేక చట్టాల ద్వారాను అదీ కుదరకపోతే మందిర్ మసీద్ లాంటి ఉద్వేగాలను సృష్టించి ప్రజల మధ్య అనైక్యతను సృష్టించి వారిని అణిచి ఉంచి నిరంతరం పాలనలో కొనసాగాలనుకునే పాలకుల కుటిల యత్నాలను ఓడించాలి.

**నిరుద్యోగ సమస్యను పాలకులు వెంటనే పరిష్కరించాలి :**

ఎన్నికల సమయంలో యువత ఓట్లే లక్ష్యంగా ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలను కల్పిస్తూ జాబ్ కేలండర్ విడుదల చేస్తామని కేంద్ర పాలకులు ప్రకటించారు. తానేమీ తక్కువ తినలేదని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జనవరిలోను రెండు లక్షల ఉద్యోగాలంటూ హామీ ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఈ హామీలు నెరవేర్చలేదు సరికదా, ఖాళీగా ఉన్న పోస్టులను కూడా భర్తీ చేయడంలేదు. కొత్త ఉద్యోగాల మాట ఏమోగానీ ఉన్న ఉద్యోగాలు రద్దు చేయకుంటే చాలన్న పరిస్థితి. ఇది చాలదన్నట్లు ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా కట్టబెడుతున్నారు. ఒకపక్క పేదలను విద్య నుండి దూరంచేసే చర్యలు మరోపక్క నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తూ.... ప్రైవేట్, కార్పొరేట్ విధానాలను యువతకు అర్థం కానియ్యకుండా చెయ్యడానికి అనేక విధాలుగా వారిని పక్కదారి పట్టిస్తున్నారు. మద్యం, గంజాయి, అశ్లీల సినిమాలు, వీడియోల మత్తులో యువతను నిరంతరం ఉంచుతున్నారు. కులాల, మతాల, ప్రాంతాలవారీగా వారిని విభజించి ఆ విద్వేషాలను వారిలో రెచ్చగొట్టి తమ రాజకీయ ప్రయోజనాల కోసం బలితీసుకుంటున్నారు. గత 75 సంవత్సరాలుగా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణలు ప్రోత్సహించడం, ప్రభుత్వ రంగాలను నాశనం చెయ్యడం తప్ప, విద్యార్థి, యువజన సమస్యలలో ఒక్కటీ పరిష్కరించలేదన్నది చేదు నిజం.

నిరుద్యోగ సైన్యాన్ని పెంచి పోషిస్తూ యువత శ్రమను కారుచౌకగా దోపిడీ చేస్తున్న సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీలను వాటికి తైనాతీలుగా వ్యవహరిస్తూ వాటి అనుకూల విధానాలను చేపడుతున్న పాలకవర్గ విధానాలను ఖండిస్తూ, ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని జనసాహితి పిలుపునిస్తుంది.

**మహిళలపై నానాటికీ పెరుగుతున్న లైంగిక దాడులు, హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలి :**

అన్నివర్గాల మహిళలపైన లైంగికదాడులు, హింస నానాటికి పెరిగిపోతున్నాయి. తమపై లైంగిక వేధింపులకు కారణమైన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఢిల్లీ నడిబొడ్డున మనదేశ ప్రతిష్ఠను ప్రపంచ వినువీధుల్లో ఎగరవేసిన రెజ్లర్లు ఉద్యమించారు. ఈ మధ్యనే న్యాయస్థానంలోని ప్రధాన న్యాయమూర్తి చేసే లైంగిక వేధింపులు తాళలేక తనకు స్వచ్ఛంద మరణాన్ని ప్రసాదించాలని మహిళా జడ్జి ప్రకటించటమూ వార్తాపత్రికలలో చదువుకున్నాం. ఇక మణిపూర్ మారణహోమంలో సమిధలవుతున్న మహిళలు లైంగిక దాడులకు గురౌతున్న దురంతాలను చూస్తున్నాం. ఇంటా, బయటా పనిప్రదేశాలలో నిరంతరం సాగుతున్న లైంగిక దాడులు, హింసలు అతి మామూలు విషయంగా, జీవన విధానంగా సాగుతున్న సంస్కృతి రోజురోజుకీ పెరిగిపోతున్నది. మహిళలను సాటి మనుషులుగా గుర్తించనీయకుండా వివక్షలకు గురిచేస్తూన్న, హింసనూ, లైంగిక దాడులనూ, పురుషాధిపత్య పీడనకి గురిచేస్తూన్న సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడాలని జనసాహితి పిలుపునిస్తూంది. అన్నిరకాల మద్యం, మత్తుపదార్థాలు, పోర్న్‌సైట్స్ వంటి కార్యక్రమాలను నిషేదించాలని డిమాండ్ చేస్తుంది.

**ఆరోగ్య వైజ్ఞానిక వ్యవస్థల పనితీరు దేశ ప్రజల ఆరోగ్య వైజ్ఞానిక స్థాయి, దేశం యొక్క అభివృద్ధికి ప్రగతికి కొలమానము :**

మనదేశంలో రాజకీయ నాయకులు వారివారి ప్రయోజనాల మేరకు విద్యా, వైద్యరంగాల విధానాలను రూపొందిస్తున్నారు. విద్యా వైద్య రంగాలను వ్యాపారంగా మార్చి కోట్లాది రూపాయల చుట్టూ తిప్పుతూ వైద్యులను, విద్యా బోధకులనూ దళారి ఏజెంట్లుగా మార్చి ఉపయోగించుకుంటున్న దోపిడీ ప్రయివేటు కార్పొరేట్ విద్యా వైద్య సంస్థలను రద్దుపరచాలని, ఉత్తమ విద్యను వైద్యాన్ని ప్రజలకు ప్రభుత్వమే అందించాలని, ఉచిత విద్యా వైద్య రంగాలను ప్రజల ప్రాథమిక హక్కుగా గుర్తించి నిధులను ప్రభుత్వమే విడుదల చేయాలని జనసాహితి డిమాండ్ చేస్తూంది.

భారత ఉన్నత న్యాయస్థానం చెప్పిన ఓ.పి. 25%.. ఇన్‌పేషంట్స్ 10% రోగులకు ఉచిత వైద్యాన్ని అందించాలని కనీస ప్రాతిపదికనయినా అమలు జరపాలని పాలకులను జనసాహితి కోరుతున్నది.

ప్రభుత్వాలు అవలంబిస్తున్న దోపిడీ ఆర్థిక రాజకీయాల వలన విద్యావైద్యం ప్రయివేటు కార్పొరేట్ల, ఇన్సూరెన్స్ కంపెనీలకు అందించడం వల్ల 40% నుండి 50% వరకూ ప్రజలు ఆస్తులు అమ్ముకొని అప్పులు చేస్తున్నారు. ఏటా 5 కోట్ల నుండి 6 కోట్లమంది భారత ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువకు జారిపోతున్నారు. ఈ ప్రజావ్యతిరేక విధానాలని జనసాహితి వ్యతిరేకిస్తున్నది.

**విదేశీ యూనివర్శిటీల చొరబాటుని త్రిప్పికొట్టాలి :**

ప్రయివేటు పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు విద్యావిధానాన్ని ఒక సరుకుగా, వ్యాపారంగా లాభాల రంగంగా మార్చి భారతదేశ విద్యావిధానాలలో లొసుగులని ఆధారం చేసుకొని వారివారి విశ్వ విద్యాలయాలను భారతదేశంలో నెలకొల్పి ఆర్థిక దోపిడీకి పాల్పడే విధానాన్ని జనసాహితి ఖండిస్తూ తీర్మానిస్తున్నది.

**అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లతో చేస్తూన్న సమ్మెకు మద్దతునిద్దాం :**

మన రాష్ట్రంలో 55,607 అంగన్‌వాడీ కేంద్రాలలో ఒక లక్షా 5 వేల మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ హెల్పర్లుగా పని చేస్తున్నారు. వీరి ద్వారా 23 లక్షలమంది చిన్నపిల్లలకు పోషకాహారం అందుతోంది. ఈ కేంద్రాలలో నిర్వహించే ప్రీ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ కూడా చాలామందికి లబ్ధినిస్తోంది. మరల 6 లక్షల మంది గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం, వైద్య అవసరాలు అందుతున్నాయి. ఇంత పని జరుగుతున్నా అంగన్వాడీ కేంద్రాలకు పాలకుల బడ్జెట్ నుండి సరైన కేటాయింపులు లేవు. కనీస అవసరాలు తీరే జీతం కూడా ఇవ్వటంలేదు. తమకు కనీస వేతనాలు పెంచాలని, రిటైర్ అయ్యేటప్పుడు గ్రాట్యుటీ చెల్లించాలని, సరఫరా చేసే సరుకుల నాణ్యత పెంచాలని, గ్యాస్ సరఫరా బాధ్యతను ప్రభుత్వమే చూడాలని, పెండింగ్‌లో వున్న ఛార్జీలు చెల్లించాలని మొదలైన డిమాండ్లతో గత నెలన్నర పైగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల న్యాయమైన పోరాటానికి జనసాహితి మద్దతు ప్రకటిస్తూంది.

**అప్రజాస్వామిక ఎన్నికల సంస్కృతిని ఖండిస్తున్నాం :**

2024 సార్వత్రిక ఎన్నికల వాతావరణం ఇప్పుడు వేడి పుంజుకుంది. నిజానికి ఎన్నికల్లో గెలిచిన నాటి నుండి మళ్ళీ ఎన్నికల వరకు అధికార హింసాసన పీఠాన్ని గెలుపు పందెంగా ఎలా వాడుకోవాలో అనే యావలో తలమునకలవ్వడమే ప్రజాస్వామిక పరిపాలనగా చలామణి అయిపోతోంది. 1935 నాటి వలస పాలన కాలంనాటి ఎన్నికల చట్టం కొనసాగింపుగానే నేటికీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఓటర్లను మభ్యపరచడం, ఎన్నికలలో నిలబడే ప్రతినిధులనూ, గెలిచిన నాయకులనూ కొనడం, మద్యాన్ని, మాదకద్రవ్యాలను ఏరులుగా పారించటం ఎన్నికల రోజుల్లో జరిగే బహిరంగ రహస్యాలే. కులం, మతం, మద్యం, మొదలైన వ్యసనాలతో, వైషమ్యాలతో మన ఎన్నికల వ్యవస్థ నిండి వుంది. ఇప్పుడు దళిత, మైనారిటీ ప్రజలపై హంతక మూకదాడులు, మతతత్త్వపరమైన విద్వేషాలు, విధ్వంసాలు సాగుతున్నాయి. ఆదివాసీ, దళిత మహిళలపై రాజకీయ ప్రయోజనాల కోసం దిగ్భ్రాంతికరమైన పాశవిక లైంగిక దాడులు జరుగుతున్నాయి. పోస్ట్ ట్రూత్ ప్రచారాలతో ప్రజల సున్నితమైన భావోద్వేగాలను హింసకు రెచ్చగొట్టడం ద్వారా మరో కొత్త సంస్కృతిని ప్రచారం చేస్తూంది. ముప్పాతికేళ్ళ స్వాతంత్ర్యంలో "ప్రజాస్వామ్యం" చెట్టు పేరు చెప్పుకొని జరుపుకుంటూ వస్తున్న ఎన్నికలు – ప్రజస్వామిక విలువలు అన్నిటినీ కోల్పోయింది. ఎన్నికలే ప్రజాస్వామ్యం అనేట్లుగానూ, దళారీ బూర్జువా అరాచక పాలక ముఠాల హింసా వినోదంగానూ, పరాధీన ఆర్థిక విధానాల ఆచరణనూ – సామ్రాజ్యవాద అనుకూల లొంగుబాటు రాజకీయాలను నడపడానికి, అప్రజాస్వామిక ఎన్నికల ప్రక్రియ దిష్టిబొమ్మగా మిగిలిపోయింది. ఈ అప్రజాస్వామిక ఎన్నికల సంస్కృతిని ఖండిస్తున్నాం.

# 29వ కోల్‌కతా అంతర్జాతీయ చలనచిత్రోత్సవం

– బాలాజీ (కోల్‌కతా)

**(గత సంచిక తరువాయి)**

జీవితాంతం శ్రామిక వర్గాల కోసమే సినిమాలు నిర్మించిన దర్శకుడు కెన్ లోచ్ తన 87 వ ఏట నిర్మించిన సినిమా 'ది ఓల్డ్ ఓక్'. ఇదే తన ఆఖరు సినిమా అని చెప్పుకుంటున్నాడు. ఈ సినిమా ఈశాన్య ఇంగ్లాండులోని ఒక మైనింగ్ టౌన్‌కి సంబంధించిన కథ. సిరియా నుంచి ఆ ఊరిలో స్థిరవాసం ఏర్పరుచుకోవడానికి వచ్చిన సిరియన్ పరివారాలకూ, స్థానికులకూ మధ్య సంఘర్షణలకు సంబంధించిన మానవీయమైన కథ ఇది. ఒక వైపు ఇది శరణార్థుల కథ అయినా, వైషమ్యాలు పెరుగుతున్న ప్రపంచంలో కార్మికుల వర్గ దృక్పథం ఎలా వుండాలో చెప్పిన కథ.

Kolkata International Film Festival
(Accredited by FIAPF)
5-12 December 2023

**The Old Oak (2023) (UK) :**

అది ఈశాన్య బ్రిటన్‌లోని కౌంటీ దుర్హామ్ అనే బొగ్గుగని పట్టణం. కథాకాలం 2016. 2016 అంటే బ్రిటన్ యూరోపియన్ యూనియన్ నుండి నిష్క్రమించిన (బ్రెగ్జిట్) సంవత్సరం. అప్పటికే వరుసగా టోరీ ప్రభుత్వాల నయా ఉదారవాద నిర్ణయాల ఫలితంగా శ్రామికులు ఉపాధి కోల్పోతున్నారు. సామాజిక సంక్షేమ పథకాల మీద ఆధారపడవలసిన దుస్థితిలో బ్రతుకుతున్నారు. అటువంటి ఒక శ్రామికుడి కథను గుండెను పిండేసే రీతిలో తెరకెక్కించాడు కెన్ లోచ్ తన 'ఐ, డేనియల్ బ్లేక్' (2016) సినిమాలో. ఉద్యోగ భద్రత లేని టెంపరరీ ఉద్యోగాల్లో 'ఎంత కష్టపడితే అంత లాభం' అనే గిగ్ ఎకానమీ పరుగు పందెంలో అలసిసొలసిన పెద్దాయన కథ 'సారీ వియ్ మిస్డ్ యు' (2019)లో చూస్తాం. 'ది ఓల్డ్ ఓక్'ను ఆ రెండు సినిమాలతో కలిపి ఒక త్రయంగా పరిగణించవచ్చు. ఈ ట్రిలాజీలోని సినిమాలన్నింటిలోనూ కథానాయకులందరూ ప్రౌఢ వయస్కులే. 'ఐ, డేనియల్ బ్లేక్'లో ఒక చిన్న పాత్రలో కనిపించే డేవ్ టర్నర్ ఈ సినిమాలో ప్రధానపాత్రలో కనిపిస్తాడు.

ఒకప్పుడు బొగ్గు గనులు పూర్తిస్థాయిలో నడుస్తున్న కాలంలో ఆ ప్రాంతం కళకళలాడేది. అసలు ఆ గనుల కారణంగానే వికసితమైన పట్టణమది. మార్గరెట్ థాచర్ కాలంలో ఆ బొగ్గు గనులను ప్రైవేట్‌పరం చేస్తున్నప్పుడు చాలా పెద్ద పెద్ద సమ్మెలు నడిచాయి. (ఈ దర్శకుడు ఆ ఉద్యమాలతో వ్యక్తిగతంగా సన్నిహిత సంబంధం ఉన్నవాడే!) ఇప్పుడు ఆ ప్రైవేటు గనులు కూడా మూతపడ్డాయి. అక్కడ పేదరికం విస్తరిస్తోంది. ఆస్తుల ధరలు విపరీతంగా పడిపోయాయి. విదేశీయులకు అక్కడి ఇళ్ళు చవగ్గా అమ్మేస్తున్నారు. అక్కడ ఇళ్లు కొనుక్కుని కాపుర ముండడానికి ఒక బస్సు నిండా సిరియా శరణార్థులు రావడంతో సినిమా ప్రారంభమౌతుంది. యుద్ధ వాతావరణంలో అతలాకుతలమౌతున్న మాతృ దేశాన్ని వదిలి ప్రాణాలు కాపాడుకోడానికి వచ్చిన అభాగ్యులు వారు. కానీ స్థానికులు వారిని అవాంఛితులుగా, శత్రువులుగా పరిగణిస్తున్నారు. 'అభద్రతల విషవలయం మనిషిని అహేతుకతలోనికి తోస్తుంది. వర్గ మిత్రుడినే వర్గ శత్రువుగా చూసేలా చేస్తుంది.'

'ది ఓల్డ్ ఓక్' అనేది టీజే బ్యాలెంటైన్ (సూక్ష్మంగా టీజే) అనే ప్రౌఢ వయస్కుడు ఆ ఊరిలో నడుపుతున్న బీరు దుకాణం. ఆ దుకాణానికి కూడా గత వైభవం లేదు. కానీ ఊరిలోని వారు ఒకచోట చేరి కష్టసుఖాలు చెప్పుకునే ఏకైక ప్రాంతం (పబ్లిక్ స్పేస్) అదే. టీజే ఒంటరి వాడు. భార్య వదిలేసింది. ఎదిగిన కొడుకు అతడితో మాట్లాడడు. ఆ దుకాణమే అతడికి జీవనాధారం. అతడు చేరదీసిన 'మారా' అనే కుక్కపిల్ల అతని మనుగడకు ఒక వ్యాపకం. బీరు తాగుతూ సిరియన్ శరణార్థులపై దూషణలు చేయడం అక్కడికి వచ్చే కొందరి నిత్యకృత్యం. 'ఇంగ్లీషు రాని ముస్లిం జనాలు ఈ ప్రాంతాన్ని ఆక్రమిస్తున్నారు. వీరు ఉగ్రవాదులు. ఈ ఆలీబాబా నలభై దొంగలు కొద్ది రోజుల్లోనే ఇక్కడ మసీదు కట్టేసుకుంటారు.' – ఇలా రకరకాల హేళనలు, అపోహలతో మిళితమైన దుష్ప్రచారాలు. వారి మాటల్లో రేసిజం, ఇస్లామోఫోబియా స్పష్టంగా కనిపిస్తూ వుంటాయి. టీజే మాత్రం కొంచెం న్యాయంగా ఉండే వ్యక్తి. శ్రామిక వర్గ దృక్పథం అతడికి వారసత్వంగా వచ్చింది. కాబట్టి వారి అతి దూషణలకు కొంత అడ్డు చెబుతుంటాడు. భయపడాల్సిన పనిలేదు అని చెబుతాడు. 'ప్రాణాలు అరచేత పట్టుకుని పారిపోయి వచ్చిన వారు మనకేం హాని తలపెడతారు?' అని సర్దిచెబుతాడు. కొందరిని సులువుగా మార్చడం కష్టం. కానీ టీజే మాత్రం తన మిత్రురాలితో కలిసి శరణార్థులకు సహాయసహకారాలు అందిస్తుంటాడు.

అక్కడికి వచ్చిన శరణార్థుల్లో యారా (ఎబ్లా మారి) అనే అమ్మాయి బాగా ఇంగ్లీష్ మాట్లాడగలదు. ఆమె మంచి ఫొటోగ్రాఫర్ కూడా! ఫొటోలు తీస్తూ బస్సు దిగుతుండగా ఒక స్థానిక యువకుడు ఆమెతో దురుసుగా ప్రవరిస్తూ ఆమె కెమెరా లెన్సును పగలగొట్టేస్తాడు. పాత కెమేరాలను అమ్మే తన బాబాయ్ చేత యారా కెమేరాను టీజే రిపేరు చేయిస్తాడు. టీజేకీ, యారాకీ మధ్య మంచి స్నేహం కుదురుతుంది. అది వారి దుకాణానికి వచ్చే కస్టమర్ల కోపానికి కారణమౌతుంది. టీజే బీరు

దుకాణానికి వెనుక భాగాన మూసివున్న పెద్ద గది ఒకటి వుంది. ఆ గదిలో గని కార్మికుల జీవితాన్ని రికార్డు చేసిన ఫొటోలుంటాయి. (టీజే పినతండ్రి తీసినవి.) అండర్ గ్రౌండ్ జీవితాలు, 84 నాటి సమ్మెలు – ఇలా శీర్షికల వారిగా గోడపై అమర్చిన ఫొటోలున్నాయి. నిరవధిక సమ్మెలు జరుగుతున్నపుడు అక్కడ సామూహిక పాకశాలల్లో వంటలు చేసుకుని అందరూ కలిసి భోంచేసేవారు. ఆర్థిక ఇబ్బందుల సమయంలో కలిసి వండుకుని తినడం ఒక రకమైన సంఘీభావానికి దారితీస్తుంది. 'When you eat together, you stay together' – అని అక్కడ రాసి వున్న ఒక కొటేషన్ యారాకు నచ్చుతుంది. వారానికి ఒకరోజైనా కలిసి భోంచేస్తే తమ సిరియన్ పరివారాలకూ, స్థానికులకూ మధ్య అపార్థాలను పోగొట్టొచ్చని ఆమె సలహా ఇస్తుంది. పైగా ఇలా చేస్తూ అక్కడి పేద పిల్లలకు వారానికొకసారైనా పోషకాహారం అందించవచ్చు. టీజే సహకారంతో యారా ఆలోచన కార్యరూపం దాల్చుతుంది. సిరియన్ల సమస్యపై మీటింగు పెట్టుకోడానికి గదిని అనుమతించకుండా, ఇప్పుడు అదే గదిని సామూహిక భోజనం కోసం ఇవ్వడం, అది పాపులర్ కావడం, దానికి ట్రేడ్ యునియన్ల నుండే కాక చర్చిల నుండి కూడా సహకారాలు అందడం, ఆ విధంగా 'విదేశీయులకు' లాభాన్ని చేకూర్చటం నచ్చనివారు కొందరు ఆ ప్రాజెక్టుని భగ్నం చేసే కుటిలయత్నానికి పూనుకుంటారు.

టీజే మళ్లీ జీవితంలో విఫలమైనట్టు చతికిలపడతాడు. తన చిన్ననాటి స్నేహితుడు కూడా కుట్రదారుల్లో ఉన్నాడని తెలిసి మరింత మధనపడతాడు. 'మన తండ్రులు భుజంతో భుజం కలిపి చేసిన పోరాటాల్ని మరిచావా? తమ కంటే అంతస్తులో పైనుండే అధికులను కన్నెత్తి చూసే దమ్ముండదు కానీ తమ కంటే హీనులకు హాని తలపెట్టడంలో మాత్రం ముందుంటారందరూ' అని అతడ్ని గట్టిగా దులిపేస్తాడు.

'ఈ భయంకర నిరాశాజనకమైన వాతావరణం నుండి ఏ మాత్రమైనా విముక్తికి అవకాశముందా?' – తప్పకుండా వుంది అని చెప్పదలుచుకున్నాడు దర్శకుడు. 'కార్మికులు కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు' అని టీజే యారాకు చెప్పినట్టుగా సినిమాకు ముగింపిస్తాడు దర్శకుడు. 'శ్రమజీవి మౌలికంగా మంచివాడు. మంచితనమే అతడి సిసలైన గుణం. పరిస్థితుల ప్రభావం వల్లే అతడు అహేతుకంగా, క్రూరుడిగా మారుతాడు. కానీ ఇది తాత్కాలిక దశ మాత్రమే. శ్రమజీవి చివరికంటా మానవత్వం వైపే నిలుస్తాడు.' అని దర్శకుడు తన ముగింపులో చెబుతాడు.

సిరియా అసాద్ ప్రభుత్వం వద్ద బంధితుడిగా ఉన్న యారా తండ్రి చనిపోయాడన్న వార్త అందుతుంది. యారా పరివారాన్ని ఓదార్చడానికి ఆ వూరికి వూరు కదలి రావడం, వచ్చిన వారిలో కుట్ర పన్నినవారూ, దుష్ప్రచారాలు చేసిన వారూ ఉండడం చూస్తే యారా, టీజేలతో పాటు సినిమా చూస్తున్న మనకూ మానవత్వంపై పోయిన నమ్మకం మళ్లీ చిగురిస్తుంది. మన కళ్ళు చెమ్మగిల్లుతాయి. ఆ వూరిలో ప్రతి ఏడాదీ జరిగే గని కార్మికుల సంఘీభావ దినోత్సవం ర్యాలీ దృశ్యంతో సినిమా ముగుస్తుంది. 'ఓక్ చెట్టు' బొమ్మతో పాటు 'Strength Solidarity Resistance' అన్న స్లోగన్ రాసివున్న బ్యానర్‌ను సిరియన్లు స్థానికులకు సినిమాలో ఓ చోట బహూకరిస్తారు. నిజానికి 'ఓక్' చెట్టు 'బలం, దీర్ఘాయువు, ఓర్పు'లకు ప్రతీక. ఆ విధంగా సినిమా శీర్షికకు అర్థం చెప్పుకోవచ్చు. టీజే, యారా ఆ బ్యానర్‌ను పట్టుకుని ర్యాలీలో కదం తొక్కుతూ కనిపిస్తారు. ఈ ముగింపు చూస్తే మనకు ఎం.ఎస్. సత్యూ 'గరం హవా' సినిమాలోని ముగింపు గుర్తొస్తుంది. 'It's not where you're from, it's what you bring.' (నువ్వెక్కడ్నుంచి వచ్చావన్నది కాదు, నీతో ఏ భావజాలం మోసుకొచ్చావన్నది ముఖ్యం.) అన్నది ఈ సినిమాకు ట్యాగ్ లైన్. 'This is not Charity. This is Solidarity.' 'The Cathedral doesn't belong to the Church but to the workers who built it.' ఇటువంటి చాలా అద్భుతమైన సంభాషణలు ఈ సినిమాలో వినిపిస్తాయి.

**Children of Nobody (అనాథ పిల్లలు) (2023) :**

ఇరేజ్ తాద్మోర్ దర్శకత్వంలో వచ్చిన ఈ ఇజ్రాయెల్ సినిమా ఈ చలనచిత్ర ఉత్సవంలో ఉత్తమ సినిమాగా గోల్డెన్ రాయల్ బెంగాల్ టైగర్ అవార్డుతో పాటు 41 లక్షల నగదు బహుమానం గెల్చుకుంది. కథ ఓ అనాథ శరణాలయం చుట్టూ నడుస్తుంది. అనాథ శరణాలయం అనేకంటే దాన్ని తలదాచుకునే ఓ మాదిరి ఏర్పాటు అనడం బావుంటుంది. మార్గలిట్ (టికి డాయన్) అనే ముసలావిడ 40 యేళ్లుగా ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ శివార్లలోని నెవె జెడెక్ అనే ప్రాంతంలో ఆ శిబిరాన్ని నిర్వహిస్తోంది. దొంగతనాలూ, మత్తు మందుల అమ్మకాలూ చేసి పోరంబోకుగా తిరుగుతున్న అనాథ పిల్లలను చేరదీసి వారికి తిండిచ్చి, చదువు చెప్పి, ఏదైనా జీవనోపాధి కల్పించి ప్రయోజకుల్ని చేయాలని ఆమె ఆశ. దాని కోసం తన సంపదంతా ఖర్చుచేస్తూ విశ్వ ప్రయత్నాలు చేస్తుంటుంది. కుక్క వంకర తోకలా వారిలో ఎవరైనా ఎప్పుడైనా పాత నేరానికి పాల్పడితే మొదట వారిని పోలీసుల నుండి రక్షించి, ఓపికగా వారికి సత్ప్రవర్తన నేర్పుతుంది. అక్కడ అందర్లోకీ సీనియర్‌గా చాలాకాలంగా వుంటున్న జాకీ (రాయ్ అస్రఫ్) మార్గలిట్‌కు కుడి భుజంగా సహకరిస్తూ వుంటాడు. ఓ రోజు ఉదయం మార్గలిట్ గదికి వెళ్ళగా ఆమె నిద్రలోనే మరణించిందన్న సంగతి గమనిస్తాడు జాకీ. అది మునిసిపాలిటీ నేలమీద కట్టిన శిబిరం. దానిపై ఎప్పట్నుంచో రియల్ ఎస్టేట్ వారి కళ్ళు పడ్డాయి. ఓ ప్రమోటర్ ఆ స్థలాన్ని తన పేర దక్కించుకున్నాడు కూడా! కాకపోతే, మార్గలిట్ పలుకుబడి కారణంగా దాన్ని కూల్చే సాహసం చేయడం లేదు. ఇప్పుడు ఆమె మరణం సంగతి తెలిస్తే, ఇక ఆ శిబిరాన్ని కాపాడటం కష్టం. పిల్లలంతా మళ్ళీ రోడ్డున పడతారు. అందుకే వారి సంరక్షణ బాధ్యతను తన భుజస్కందాలపై వేసుకుంటాడు జాకీ. మార్గరెట్ శవాన్ని రహస్యంగా పాతేసి, ఆమె చికిత్స కోసం దూరప్రాంతానికి వెళ్ళిందని తప్పుడు వార్త ప్రచారం చేసి కాలయాపన చేస్తాడు. కానీ మొత్తానికి తన తోటి తమ్ముళ్ళ భవిష్యత్తుకు గ్యారంటీ ఇవ్వలేకపోతాడు. నిజం బయటపడుతుంది. మార్గలిట్ శవానికి గౌరవప్రదమైన అంతిమ వీడ్కోలు లభిస్తుంది కానీ ఆమె కలల శిబిరం బుల్డోజరుకి బలౌతుంది. ఆఖర్లో వచ్చే బుల్డోజర్ దృశ్యం చూస్తే మనకు అప్రయత్నంగానే పాలస్తీనా అరబ్బుల ఇళ్ళను కూల్చే ఇజ్రాయెల్ బుల్డోజర్లు గుర్తొస్తాయి. గాజాలో పెద్ద పెద్ద భవనాలను కూల్చే మిస్సైళ్ళు గుర్తొస్తాయి. విధి వక్రమో, విచిత్రమో గానీ, ఆ దేశం నుండి మానవత్వాన్ని ప్రభోదిస్తూ వచ్చిన ఈ సినిమాకు కోల్కతా ఉత్సవంలో అత్యున్నత అవార్డు లభించింది. **(ముగింపు వచ్చే సంచికలో)** ✷

# విజయవాడలో 2024 జనవరి 27, 28 తేదీలలో జరిగిన
# విరసం 29వ మహాసభలలో జనసాహితి సౌహార్ద సందేశం

**విప్లవ** రచయితల సంఘం 29వ మహాసభలో పాల్గొనటానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి విచ్చేసిన మిత్రులందరికీ విప్లవాభివందనలు!

గత సంవత్సరం జనవరి ఏడవ తేదీన హైదరాబాదులో జరిగిన విరసం అధ్యయన తరగతుల సందర్భంగా ఫాసిజాన్ని అర్థం చేసుకోవడం గురించిన చర్చలో మా అభిప్రాయాలను వివరించిన సంగతి ఒకసారి మీ దృష్టికి తీసుకు వస్తున్నాను.

ప్రస్తుతం మనం అత్యంత సంక్లిష్టసంక్షోభ సాంస్కృతిక వాతావరణంలో ఇక్కడ సమావేశమవుతున్నాం. ఇదంతా మన సామాజిక జీవితంలో, ప్రజల రోజువారీ అనుభవంలో ఉన్న సంక్షోభపు వ్యక్తీకరణగా భావించవచ్చు.

75 సంవత్సరాల క్రితపు అర్థవలస అర్థ ఫ్యూడల్ వ్యవస్థనుండి మౌలికంగా తెగతెంపులు చేసుకోగలిగిన నిజమైన ప్రజాస్వామిక మార్పు ఈ దేశంలో సంభవించకపోవడం వల్ల కూడా దినదినం మరింత క్షీణ, పతన విలువలను, మన సమాజం చవిచూస్తోంది.

గడచిన 50 ఏళ్లకు పైగా మన దేశంలో 'క్రైసిస్ మేనేజ్మెంట్ గవర్నమెంట్స్' (Crisis Management Governments)ని మాత్రమే చూస్తున్నాము. భారత రాజ్యాంగంలోని ప్రజా అనుకూలమైన హక్కులు, ప్రజాస్వామిక రక్షణలు, పౌర స్వేచ్ఛలు, ఆర్టికల్ 51 ఏ (హెచ్) లాంటి వాటి పట్ల పాలకులకు ఇసుమంత గౌరవం లేదు. తమకు అవసర మైనప్పుడు చట్టాన్ని ఉల్లంఘించడానికి పాలకవర్గాలు ఎప్పుడూ సిగ్గు పడలేదు. ప్రస్తుత ప్రభుత్వాల విధానాలకు సిగ్గు కూడా సిగ్గుపడే పరిస్థితి వచ్చింది.

కృష్ణా గోదావరి జిల్లాల ప్రాంతంలో గత సంక్రాంతి కాలంలో చట్ట విరుద్ధంగా కోడి పందాలు విపరీతంగా సాగాయని ఏ రాజ్యాంగ పరిరక్షకులకు తెలియదు? పాలకవర్గాలు చట్టాన్ని ఉల్లంఘిస్తే పట్టించుకోని ప్రభుత్వాలు, వారి యంత్రాంగం.... ఎస్మా చట్టాన్ని ప్రయోగించి అంగన్వాడి వర్కర్ల ఆందోళనను అణచివేయచూశారు.

తమ దోపిడీ వర్గాల ప్రయోజనాలకు ఉపయోగపడే అంశాల నన్నిటిని రాజ్యాంగ విలువగా, ప్రజలు ఆమోదించక తప్పనిదిగా ఉల్లంఘించ వీలు లేనిదిగా మారుస్తారు. బడాకుబేర్లు ఎగగొట్టిన లక్షల కోట్ల రూపాయల అప్పులను పారుబాకిల కింద రద్దు చేయగలరు. కార్పొరేట్ కంపెనీలకు పన్నులను తగ్గించి మరెన్నో లక్షల కోట్ల లాభాలు వారికి అందిస్తారు. నిజానికి వారు బాగా ఎరిగినది తమ నకిలీ ప్రజాస్వామిక స్వభావాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజలను బులిబుచ్చే ముసుగుగా రాజ్యాంగాన్ని వాడుకోవడం!!

మెట్టు మెట్టుగా ఎన్నికల వ్యవస్థ దిగజారిపోవడం కొనసాగుతున్న వ్యవస్థీకృత ఆర్థిక, రాజకీయ సంక్షోభపు ఒకానొక ఫలితమే. ఎన్నికల సందర్భంలో నోట్లను నడిబజారుల్లో పరిచి, మద్యాన్ని కాలువలుగా పారించి ఓట్లను పొందే ప్రక్రియ బహిరంగ రహస్యమే! అంతః సత్యమే మిటంటే అప్రజాస్వామికమైన కులమత తత్వాలు ప్రజాస్వామిక రూపమైన ఎన్నికల ప్రక్రియ ద్వారా బలోపేతం కావడం!! చట్టాలకి కట్టుబడి ఎన్నికలలో విజయం సాధించటం అనేది వారికే కష్టసాధ్య మైనదిగా తయారు చేసుకున్నారు. అందుకే రాజ్యాంగ నిర్ణాయక సభ ముగింపు సమావేశంలో అంబేద్కర్ నిర్దేశించిన మౌలిక ప్రజాస్వామిక విలువలను, మొత్తంగా ఆయన స్ఫూర్తిని నిలువులోతు భూమిలో పాతిపెట్టి, ఆయన మూర్తిని మాత్రం ఆకాశమెత్తు ప్రదర్శిస్తున్నారు.

30 సంవత్సరాల క్రితం ఇలాంటి సంక్షోభానికి సులువైన పరిష్కారం అంటూ.... ఆర్థిక రంగంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణను, రాజకీయంగా మతోన్మాద పూరిత ఇస్లామో ఫోబియాను, సాంస్కృతికంగా పోస్టుమోడర్నిజాన్ని ఈ పాలకముఠాలే ముందుకు తెచ్చాయి. ప్రజల నడుమ ఉన్న కుల మత ప్రాంతీయ వైరుధ్యాలను విద్వేషాల స్థాయికి పెంచి వారిని అనైక్యపరచి తాము సురక్షితంగా ఈ అసమానతల వ్యవస్థను కాపాడుకోవాలని చూస్తున్నారు. అయినా సంక్షోభం వెంట సంక్షోభం తలెత్తుతున్న కారణంగా దాని నిర్వహణకు క్రమేణా ఫ్యాసిస్టు లక్షణాలను పెంచుకుంటూ, ఉద్యమించే వివిధ వర్గాల ప్రజలతో పాటు ప్రశ్నించే గొంతులను, అప్రజాస్వామ్యాన్ని ఖండించే కలాలను, జర్నలిస్టులను, కవులను, కళాకారులను మేధావులను, హక్కుల కార్యకర్తలను.... భయోత్పాతానికి గురిచేస్తూ నిర్బంధాలపాలు గావిస్తున్నారు. తనతో అధికారానికై పోటీకి నిలిచే పాలకముఠాలపై కూడా వాటిని ప్రయోగించక తప్పనిస్థితికి చేరుకున్నారు.

ప్రతి చారిత్రక మలుపులోనూ సంస్కరణవాదులు సరికొత్త రూపాలతో ప్రజా ఉద్యమాలను మొద్దుబార్చడం అనేది మన అనుభవంలో ఉన్నది. వీటన్నిటి నడుమ ప్రస్తుత పాలకులు బ్రూట్ మెజారిటీతో రోజురోజుకీ చట్టానికి ప్రజావ్యతిరేక కోరలను పెంచుతున్నారు. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా నిజమైన ప్రత్యామ్నాయం ఒక్కటే ఉంది! అది సంఘటిత ప్రజా ఉద్యమం మాత్రమే!!

దానిపై ప్రజలలో విశ్వాసం కలిగించటానికి గల సమస్త అవకాశాలను వినియోగించుకోవడం ప్రజా ఉద్యమకారుల పద్ధతి. సంఘటిత ప్రజా ఉద్యమంపై అలాంటి విశ్వాసం ప్రజలకు కలగాలంటే వారి జీవన సంఘర్షణ వ్యక్తిగత స్థాయి నుండి సామాజిక రూపాన్ని సంతరించుకోవలసి ఉంటుంది. అందుకు భావజాల రంగంలో సాంస్కృతిక రూపాలలో కృషి సాగించవలసిన రచయితలు కళాకారులమైన మనం, ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించడం నుండి సామ్రాజ్యవాద ప్రపంచీకరణను వ్యతిరేకించే స్థాయి దాకా వారిని చైతన్యవంతం కావించటం మన కర్తవ్యం చేసుకోవాలి. అది అడవుల నుండి మహా నగరాల దాకా, కుల మత ప్రాంతీయ తత్వాలకు అతీతంగా జరగాల్సి ఉంది.

నేటి ప్రత్యేక పరిస్థితులలో మనకు సాంస్కృతిక వారసత్వంగా కొనసాగుతూ వస్తున్న మతసామరస్యపు వివిధ ప్రాంతాల వాస్తవిక అనుభవాలను ప్రజల దృష్టికి విస్తృతస్థాయిలో తీసుకు వెళ్లాలి . ప్రజల మత విశ్వాసాలను గాయపరచకుండా మతోన్మాదపు ప్రమాదాన్ని వారికి అర్థమయ్యేటట్లు సున్నితంగా చెప్పాలి. ఫాసిస్టు భావజాలం కలవారు మాత్రమే అన్య మత ద్వేషాన్ని తమ మతంగా వ్యాప్తి చేస్తారనే వాస్తవం ప్రజలకు తెలియచేయడం మన ప్రస్తుత కర్తవ్యాలలో మరొకటి.

సాహిత్యం ద్వారా, జీవన సంక్లిష్టతలను, అస్పష్టతలను పాఠకులు సుస్పష్టంగా అర్థం చేసుకునేట్లు రచనలు చేసే కర్తవ్యం సాహిత్యకారులది అని ఒక సందర్భంలో కొడవటిగంటి కుటుంబరావుగారు అన్నారు. ప్రజల నడుమ విద్వేషాలు పెంచే మతోన్మాద కేంద్ర పాలకులు అనుసరిస్తున్న విధానాల లోగుట్టును ప్రజలకు అర్థం చేయించడం మన తక్షణ ఉద్యమ కర్తవ్యం. ప్రత్యామ్నాయంగా సంఘటిత ప్రజా ఉద్యమ నిర్మాణానికై భావజాల రంగంలో కృషిసల్పటం మన కీలక బాధ్యత.

ఆ కృషిలో విరసం మరింత చురుకుగా కదులుతుందని ఆశిస్తూ 29వ విరసం మహాసభ విజయవంతం కావాలని జనసాహితి మనస్ఫూర్తిగా కోరుకుంటోంది...

**విప్లవాభివందనలతో....**

**- జనసాహితి**

కవిత

# జగజ్జేత

– రవి నన్నపనేని

లొంగిపోవడం
లేదూ
లొంగదీసుకోవటమో
ఇదేనా మనిషిజీవితం

దావానలంలో కంపించినవాడే
దీపం ముట్టించాడు
ఋతువుల పరిణామంలో
ఎండకి, వానకి, చలికి వణికినవాడే
గూడు, గొడుగు, గొంగళ్లతో
కాపాడుకున్నాడు
వరద ప్రవాహంలో అదిరిపోయినవాడే
నదుల వెంట నడిచిపోయాడు
పేలిన పర్వత ప్రమాదంలో
పరుగులు తీసినవాడే
గిరిశిఖరంపై తొలి పాదం పెట్టాడు

భయపడిపోవడం
లేదూ
భయాన్ని జయించటమో
ఇదేనా మనిషిజీవితం

మనిషి - ఎంత మాత్రం
ఉత్త నిమిత్త మాత్రుడు కాదు
ఆకు పచ్చని లోకం అసలెందుకుందో
విశాల విశ్వ మూల ధాతువేదో
తనకు వివరించి, విప్పి చెప్పమని
ప్రకృతి శక్తి చేత
ఉత్కృష్ట జీవిగా
ఆవిష్కరింపబడిన వాడు

ఆలోచనల తరంగమై
అవతలి ఒడ్డు ఢీకొట్టటానికి
పుట్టినవాడు

ఈ మనిషి
ఎప్పటికైన
ఒక రాత్రి
మరణ రహస్యం ఛేదిస్తాడు
మనిషిమనిషిగా ఓడిపోతున్నవాడు
రేపటి రోజులో
స్వార్థాన్ని మట్టుబెట్టే త్యాగ ధనుడై
చిరస్మరణీయుడవుతాడు
గ్రహాంతర జీవులు
ప్రశంసించే పాఠ్యపుస్తకమౌతాడు

తల వంచడం
లేదూ
తల తెంచడమో కాదు
ఈ అఖిలాండ కోటికి
మనిషే
ఒక బ్రహ్మాండ నాయకుడై
కాలం కథాన్వేషకుడై కదులుతాడు
ఈ మనిషే
మనిషితోనూ మానుతోనూ
అద్భుతంగా అంటుగట్టుకుంటాడు
అణువులోని పరమాణువులా
ఇక్కడ, ఇంకెక్కడైనా
శ్వాసిస్తూ
శాశ్వితంగా ఉండిపోతాడు

ఈ భూలోకాన స్థిర,
చర జీవకుడే కాదు
భవిష్యత్తు యాత్రలో
మనిషి
సత్యాది సప్త లోక సంచారౌతాడు
పాతాళ ప్రవేశ ద్వారం పగల గొడతాడు
మధుర స్వప్న, మహా స్వప్న పేర్లకి
సార్థక నామధేయుడైతాడు

ఏక కణం నుంచి అనేకంగా
బహు కణ సంక్లిష్టత దాక
సమస్త జాతి పరిణామ క్రమంలో
మూగ సైగ నుంచి
మాట్లాడే జంతువు దాక
రాతి యుగం నుంచి
రోదసీ నౌక ప్రయాణం దాక
అమరుడై, అజేయుడై, అనన్యుడైన
మనిషి
సృష్టికి ప్రతిసృష్టి కూడ
కఠోర తన జీవిత వృత్తానికి
తనే కేంద్రబిందువు కూడ
కాల పరీక్షలో కాబోయే జగజ్జేత కూడ
చంపటం
లేదూ
చనిపోవటమో
ఇదేనా మనిషి జీవితం
కాదు, కాదు కూడ -

స్పందన

# మానవత్వాన్ని తట్టి లేపే ప్రయత్నం చేసిన "కిల్లర్స్ ఆఫ్ ద ఫ్లవర్ మూన్"

– మనస్విని

"ఏ దేశ చరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం
దరిద్రులను కాల్చుకు తినడం"

మహాకవి శ్రీశ్రీ అన్నట్టుగా 20వ శతబ్దపు చరిత్ర అంతా దౌర్జన్యాలూ, దోపిడీ, యుద్ధాలు ఇంకా మృత్యువు అన్నట్లే ఉంటుంది. రెండు ప్రపంచ యుద్ధాలు మిగిల్చిన నష్టాలను భరిస్తూ ప్రజలంతా పేదలైతే యుద్ధానికి ఆయుధాలు సరఫరా చేసి పెట్టుబడిదారులు ధనవంతులయ్యారు. ఇలాంటి నేపథ్యంలో ఎన్ని తెగలు, జాతులు తమ భూముల నుండి గెంటివేయబడ్డాయో, తమ సాంప్రదాయిక జీవన విధానం నుండి దూరం అయ్యాయో లెక్కే లేదు. కానీ మార్టిన్ స్కార్సేసీ దర్శకత్వంలో, లియోనార్డో డికాప్రియో, రాబర్ట్ డి నిరో, లిలీ గ్లాడ్‌స్టోన్ వంటి నటీనటులతో తెరకెక్కించబడిన "కిల్లర్స్ ఆఫ్ ద ఫ్లవర్ మూన్" అనే మూడున్నర గంటల సినిమా, ఓసేజ్ అనే జాతి ప్రజల కథని చెప్తుంది. సినిమా ఏంటో తెలుసుకొనే ముందు, ఓసేజ్ ప్రజలు, వాళ్ళ చరిత్రను పరిశీలించాలి.

## ఓసేజ్; పీపుల్ ఆఫ్ ద మిడిల్ వాటర్

19వ శతాబ్దపు చివరివరకూ మిస్సోరి నదీ ప్రాంతాలలో ఒక బలమైన, స్వేచ్ఛాయుతమైన తెగ ఓసేజ్. తమ సాంప్రదాయిక పద్ధతుల్లో వేట, వ్యవసాయం చేస్తూ, ఇతర జాతులతో కలిసి ఉండేవారు. అయితే, 19వ శతాబ్దం చివరి సంవత్సరాలలో అమెరికన్ ప్రభుత్వం బలవంతం చేత ప్రస్తుత ఓక్లహోమా ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డారు. తరువాత ఆ ప్రాంతంలో చమురు నిల్వలు బయట పడడం చేత, అప్పటికే ఆ భూమిపై, ఆ భూమిలోని వనరులపై హక్కులు ఓసేజ్ ప్రజలకే చెందేలా చట్టం ఉండడం వలనా 20వ శతాబ్దం నాటికి ఓసేజ్ ప్రజలు 'రిచెస్ట్ పీపుల్ ఆన్ ది ఎర్త్ పర్ కాపిట"గా గుర్తింపు పొందారు. కానీ, కొంత కాలానికే అంతుచిక్కని విధంగా ఓసేజ్ జాతి ప్రజలు హత్యకావించ బడ్డారు లేదా కనిపించకుండా పోయారు. ఇదంతా వీళ్ళ దగ్గరున్న డబ్బుకోసమేనని స్పష్టంగా ఉన్నా, హత్యల వెనుక ఎవరున్నారనేది చాలా కాలం వరకు తెలియలేదు. డేవిడ్ గ్రన్ రచించిన "కిల్లర్స్ ఆఫ్ ద ఫ్లవర్ మూన్ : ద మర్డర్స్ ఆఫ్ ది ఓసేజ్ అండ్ ద బర్త్ ఆఫ్ ద FBI" (2017) అనే పుస్తకం ఆధారంగా ప్రస్తుత సినిమాని తెర కెక్కించడం జరిగింది. ఇప్పుడు ఈ సినిమా గురించి మాట్లాడుకోవడం ఎందుకో తెలుసుకొనే ముందు స్థూలంగా కథ ఏంటో చూద్దాం.

## మోలీ కైల్, ఎర్నెస్ట్ బర్క్‌హార్ట్, విలియమ్ హాల్

మొదటి ప్రపంచ యుద్ధంలో సైనిక దళానికి వంటవాడిగా పనిచేసి, యుద్ధానంతరం ఉపాధి కోరుతూ తన అంకుల్ విలియమ్ హాల్ దగ్గరకి వస్తాడు ఎర్నెస్ట్ (లియోనార్డో డికాప్రియో). విలియమ్ హాల్ (రాబర్ట్ డి నీరో) అప్పటికే ఓసేజ్ ప్రజల మిత్రునిగా, కింగ్ ఆఫ్ ది ఓసేజ్ హిల్స్‌గా చెలామణి అవుతున్నాడు. ఇక మోలీ కైల్ (లిలీ గ్లాడ్‌స్టోన్), ఓసేజ్ జాతి పెద్దల కుటుంబానికి చెందిన మహిళ. అన్నా బ్రౌన్, మిన్నీ స్మిత్, రీటా స్మిత్ అనే అక్కాచెల్లెళ్ళు ఉన్నారు మోలీకి. తరువాత కొంత కాలానికి ఎర్నెస్ట్, మోలీ వివాహం చేసుకోగా, మిన్నీ స్మిత్ షుగర్ వ్యాధితో మరణిస్తుంది, మోలీ తల్లి కూడా అదే వ్యాధితో మరణించగా, మిగతా ఇద్ద రు అక్కచెల్లెళ్ళను కూడా అడ్డు తొలగిస్తే, ఆయిల్ మనీ పై హక్కులు మోలీకి, తద్వారా ఎర్నెస్ట్‌కు చెందుతాయన్న విలియమ్ హాల్ సలహా మేరకు, అన్నా బ్రౌన్, రీటా, బిల్ స్మిత్, మరియు ఇంకొందరు ఓసేజ్ ప్రజల, ఓసేజ్ ప్రజలకు సహాయపడాలి అనుకున్న తెల్ల జాతీయుల హత్యలకు ఎర్నెస్ట్ సహకరిస్తాడు. చివరికి FBI జోక్యం చేసుకుని ఈ హత్యలకు కారణమైన పలువురిని శిక్షించడం, అదంతా ఎలా జరిగింది అనేది మిగతా సినిమా. కథ గురించిన మరెన్నో వివరాలు సినిమాలో ముఖ్యమైన సందర్భాలలో చూపించినా, నేను ఇక్కడ ప్రస్తావించలేదు. ఎందుకంటే, స్కార్సేసి దాదాపు మూడున్నర గంటల వ్యవధిలో, ఈ హత్యలకు సంబంధించిన విషయాలే కాక, ఓసేజ్ ప్రజల సంస్కృతి, సంప్రదాయాల్ని జాగ్రత్తగానే తెరకెక్కించారు. పైగా అసలు ఏం జరిగిందన్న డాటా కావాలి అనుకుంటే వికిపీడియాలో అంతా వివరంగానే ఉంది. కాబట్టి, కథ ఏంటి అనే విషయం కంటే, ఈ కథని ఒక క్రైం స్టోరీగానో, FBI సాధించిన కేసుగానో కాకుండా, ఓసేజ్ ప్రజల గొంతుతో చెప్పడం వెనుకున్న ఉద్దేశం ఏంటని ఆలోచించాల్సిన అవసరం ఉంది.

సినిమా ప్రారంభంలో ఓసేజ్ సంప్రదాయం ప్రకారం చేసిన అంత్యక్రియల సన్నివేశం నుండి, ప్రతి సన్నివేశంలోనూ వారి సంస్కృతి, పద్ధతులు, భాష, జీవితం పట్ల, ప్రకృతి పట్ల ఉన్న తాత్త్విక దృక్పథం మొదలైనవన్నీ చాలా శ్రద్ధతో చిత్రీకరించినట్లు అర్థం చేసుకోవచ్చు. భూమితో, ప్రకృతితో మమేకమై నడిచేది వాళ్ళ జీవన విధానం. మాతృభూమి నుండి ఎవరైనా వాళ్ళను విడదీయాలని చూస్తే చివరి నెత్తుటి బొట్టు వరకు పోరాడి, గెలవడమో, తోటివారి తోడువీడక మరణించడమో మాత్రమే వాళ్ళకి తెలిసిన దారులు. ఓసేజ్ ప్రజలు మాత్రమే కాదు, ప్రపంచంలోని ఏ జాతి ఆదివాసీ అయినా ఇంతే....

ఇదే నిస్వార్థం, ఇదే అంకితభావం, ఇదే ధైర్యం! నేటివ్ ప్రజలంటే అమాయకులన్నట్టుగా కాకుండా, వాళ్ళలోని ప్రకృతి పట్ల, భూమి పట్ల ఉన్న గౌరవాన్ని, మానవత్వాన్నీ ప్రపంచానికి చూపించడానికి దర్శకుడు చేసిన ప్రయత్నం నిజంగా అభినందించదగినది. దానికి ప్రాణం పోసినట్టుగా లిలీ గ్లాడ్‌స్టోన్ నటన, రాబీ రాబర్ట్‌సన్ సంగీతం సహకరించాయి. సినిమాలోని సాంకేతిక విలువల గురించి ఎంతైనా మాట్లాడొచ్చు గానీ సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, సంగీతం లాంటి అంశాలు, వాటి పాత్ర ఏంటని తెలియకపోయినా ఈ సినిమా ప్రేక్షకులపై గాఢమైన ముద్ర వేస్తుందని చెప్పవచ్చు.

## అసలైన ఫ్లవర్ మూన్ హంతకులు ఎవరు?

ఓసేజ్ ప్రజలకు జరిగిన అన్యాయాన్ని కేవలం మనకి జాలి కలిగించేందుకు చెప్పడం మాత్రమే ఈ సినిమా ఉద్దేశం కాకపోవచ్చు. ఒకవేళ దర్శకుని ఉద్దేశం అంతవరకే అయినప్పటికీ, ప్రేక్షకులుగా మనం అక్కడితో ఆగిపోవాల్సిన పని లేదు. సినిమాని ముగించిన సన్నివేశం చూశాక అసలు హంతకులు ఎవరు? చెప్పీచెప్పకుండా దర్శకుడు చెప్పాలనుకున్నదేమిటి అని ఆలోచిస్తాం. కోర్టు సన్నివేశం, మోలీ మరియు ఎర్నెస్ట్ మధ్య సంభాషణ అయిపోయాక అక్కడి నుండి ప్రస్తుత కాలంలోకి వచ్చేస్తాం. మోలీ చనిపోయిన రోజు పేపర్లలో వచ్చిన వార్తను చదువుతూ “there was no mention of murders” అంటాడు స్కోర్సేసి. అంటే ఒకసారి ఇదంతా అయిపోయాక, చరిత్రలో మరణాల సంఖ్య మాత్రమే ఉంటుంది తప్ప, దానివల్ల జరిగిన సాంస్కృతిక నష్టాన్ని మనం గుర్తించటంలేదని సున్నితంగా చెప్పినట్టు ఉంది. ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడి కాన్పించని కథలన్నీ వెలికితీయడమే దర్శకుడు చేయాలనుకున్న పని కావచ్చు. ఇదంతా ఆలోచిస్తే అసలు హంతకులు ఎవరు అనే ప్రశ్న వస్తుంది.

డబ్బుకోసం అమానవీయంగా హత్యలకు పాల్పడిన కొందరు తెల్ల జాతీయులా? దీనంతటినీ వెనక వుండి నడిపించిన విలియమ్ హేలా? లేక స్వేచ్ఛగా, ప్రశాంతంగా జీవిస్తున్న ఓసేజ్ ప్రజలను బలవంతంగా ఒక్లాహమా దేశానికి పరిమితం చేసి, వాళ్ళ భూములు లాక్కున్న అమెరికన్ ప్రభుత్వమా? ప్రజానుకూల ఉత్పత్తి విధానాన్ని పక్కకి తోసి, లాభాల వెంటపడుతూ, మార్కెట్‌పై, ముడిసరుకులపై ఆధిపత్యం కోసం యుద్ధాన్ని సృష్టిస్తున్న సామ్రాజ్యవాదమా? ప్రస్తుతం జరుగుతున్న, ఇంతకు ముందు జరిగిన ఎన్నో జాతీయ అంతర్జాతీయ సంఘటనల నేపథ్యంలో అంటే ఒకవైపున గాజాపై ఇజ్రాయిల్ అక్రమంగా దురాక్రమణకు పాల్పడడం నుండి, మన దేశంలోనే మణిపూర్ మొదలగు ఈశాన్య రాష్ట్రాలలో సంపదలను కొల్లగొట్టడానికి ప్రజలపై సాగిస్తున్న దౌర్జన్యాలూ, కారంచేడు, చుండూరు సంఘటనలు, గుజరాత్ అల్లర్లు, ప్రజల గొంతు వినిపించే ప్రయత్నం చేస్తున్న జర్నలిస్టుల, రచయితలపై సాగుతున్న హత్యాచారాల వరకూ ప్రతీ సంఘటనా నిజమైన హంతకులు ఎవరు అని ప్రశ్నిస్తూనే ఉంది. దేశాలు ఏవైనా, యే జాతి ప్రజలైనా హంతకులు మాత్రం ఒకటే జాతివాళ్లన్నది మనం అర్థం చేసుకోవాలి. నాడు యూదులను సమూలంగా నిర్మూలించేందుకు హిట్లర్ చేసిన ప్రయత్నాల నుండి, నేడు అనేక దేశాలలో, అనేక జాతులపై జరుగుతున్న ఏకపక్ష యుద్ధాలకు దోపిడీ తప్ప ఇంకేం కారణం లేదు. మానవత్వం అంటే ఒక మనిషికి మరొక మనిషి పట్ల ఉండాల్సిన స్నేహ భావం మాత్రమే కాదనీ, ఒక జాతి నాగరికతను, సంస్కృతిని, భాషని, జాతి మొత్తాన్ని సమూలంగా తుడిచిపెట్టెయ్యడానికి ఏ మాత్రం వెనుకాడని స్వార్థపరుల క్రూరత్వానికి వ్యతిరేకంగా సంఘటితమవ్వడం కూడా అనే ఆలోచనని కలిగించి వదిలేస్తుంది ఈ సినిమా. కోట్ల రూపాయల బడ్జెట్లతో తప్పుదారి పట్టించే విషయాలని ప్రజల మెదళ్లలో గుప్పించే ప్రయత్నం చేసే ఎన్నో సూపర్ హిట్ సినిమాలకంటే మనల్ని ఆలోచనలోపడేసే ఇటువంటి మంచి సినిమాలను ప్రజల పక్షాన నిలబడే వాళ్లంతా అభినందించాలి. ✺

## ఉత్తరం

**హింస** క్రూరత్వం మితిమీరిన వికృత శృంగారం, వస్తు వినియోగ సంస్కృతి, కేరీయరిజం, మాదకద్రవ్యాల వినియోగం, పరాయీకరణ సంస్కృతి, పట్టించుకోనితనం, బలవంతులకు దాసోహం – బలహీనులపై దాష్టీకం లాంటి వికృత సాంస్కృతిక సామ్రాజ్యవాద పతన సాంస్కృతిక విషభావాలు ప్రజల ఆలోచనలను ఆక్రమించుకొనడానికి, వ్యాపించడానికి అమెరికా సామ్రాజ్యవాదం సిఐఏ ద్వారా నిర్వహింపజేసిన సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధ కార్యకలాపాల విషఫలాలే ఇవన్నీ. ‘ప్రజాసాహితి’ నవంబర్ సంచికలో వచ్చిన “సాంస్కృతిక ప్రచ్ఛన్న యుద్ధం – అమెరికా విదేశాంగ గూఢచారి సంస్థ సిఐఏ” వ్యాసం ద్వారా కమ్యూనిస్టు అనుకూల సాహిత్య సాంస్కృతిక అంశాలకు వ్యతిరేకంగా అమెరికన్ సామ్రాజ్యవాదం నిర్వహించిన పాత్ర, మూడవ ప్రపంచ దేశాలలోని రచయితలు, కళాకారులు, రాజకీయ నాయకులను లోబరుచుకున్న విధానం, స్వచ్ఛంద సంస్థల (ఎన్జీవో) ఏర్పాటు (రాక్ ఫెల్లర్, ఫోర్డ్ ఫౌండేషన్ మొ), సోషలిస్టు ముసుగులో జయప్రకాష్ నారాయణ లాంటి వారిని తమ గుప్పెట్లో పెట్టుకోవడం ఇంకా మరెన్నో అంశాలతో పాటు దశాబ్దాలుగా ప్రజల మధ్య కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో వైషమ్యాలు పెంచడంలో అది నిర్వహించిన పాత్ర ప్రస్ఫుటంగా మనకు అర్థమవుతుంది. సిఐఏ ముసుగులో సామ్రాజ్యవాదం సాగించిన అమానుష ప్రయత్నాలు ప్రలోభాలు పైరవీలు ఈ వ్యాసం ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది. వ్యాసం కొంచెం పెద్దదే అయినా అధ్యయనానికి ఉపయోగకరమైన సమాచారం ఉంది. (బ్రిటన్ దేశానికి చెందిన కథా రచయిత్రి స్వతంత్ర సినీ నిర్మాత అయిన ఫ్రాన్సిస్ స్టోనర్ సాండేర్స్ (frances stonor Saunders)తన పరిశోధనల సారాంశాన్ని, “హూ పెయిడ్ ది పైపర్ – ది సి.ఐ.ఏ అండ్ ది కోల్డ్ వార్” (who paid the piper? The CIA and the cultural cold war) అనే గ్రంధాన్ని 1999లో ప్రచురించారు. ఈ పుస్తకాన్ని జీవి భద్రంగారు సమగ్రంగా పరిచయం చేశారు. సాహిత్య సంస్కృతిక సామాజిక అంశాల పట్ల సామ్రాజ్యవాదం నిర్వహించే పాత్ర అవగాహన కోసం ఈ వ్యాసం తప్పక ఉపయోగపడుతుంది.

– డా॥ జి.వి. కృష్ణయ్య ✺

# చైతన్యవాహిని

**2024 జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా వున్న శాంతికాముకులు గాజా సంఘీభావదినంగా ప్రకటించారు. ఆ పిలుపులో భాగంగా జనసాహితి రెండు తెలుగు రాష్ట్రాలలో సంఘీభావ కార్యక్రమాలను నిర్వహించింది.** జనసాహితి శ్రీకాకుళం జిల్లా శాఖ పలాస, సంతబొమ్మాళి, శ్రీకాకుళం ప్రాంతాలలో గాజాకు సంఘీభావ కార్యక్రమాలను నిర్వహించింది.

**పలాస**లో జరిగిన కార్యక్రమాన్ని ఎంపిపిఎస్ కాశీబుగ్గ పాఠశాలలో ఏర్పాటుచేశారు. జనసాహితి సభ్యులు ఏపిటిఎఫ్ రాష్ట్ర పూర్వకార్యదర్శి ఎస్.వి. అనిల్‌కుమార్‌గారు పర్యవేక్షించగా ఏపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సుభాష్‌బాబు, జనసాహితి సభ్యులు కె. గోపి, టి. రామాన్నాయుడు, టి.వి.ఎస్. నారాయణ ఉపన్యసించారు. గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడి అమానుషమైనదని, ఎంతోమందిని బలితీసుకుంటుందని, గత శతాబ్దంలో జరిగిన యుద్ధ విధ్వంసాల్ని ఈ దాడులు గుర్తుచేస్తున్నాయని, ప్రజావ్యతిరేక యుద్ధాలను వ్యతిరేకించాలని ఉపన్యసించారు.

**సంతబొమ్మాళి**లో జరిగిన సంఘీభావ కార్యక్రమాన్ని జనసాహితి సభ్యులు పర్యవేక్షించారు. యువకులు, విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో అందరూ చర్చలో పాల్గొంటూ ఇజ్రాయిల్ గాజా ప్రజలపై, పసిపిల్లలపై, ఆసుపత్రులు, విద్యాలయాలపై చేస్తున్న దాడి అమానుషమని అన్నారు.

**శ్రీకాకుళం** పట్టణంలోని పిఎస్ఎన్ఎం హైస్కూలులో నిర్వహించిన కార్యక్రమంలో జనసాహితి కార్యవర్గ సభ్యులు, ఏపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కె. భానుమూర్తి, 'ప్రజాసాహితి' పత్రిక సంపాదకులు పి. ఎస్. నాగరాజు, జనసాహితి శ్రీకాకుళం జిల్లా సభ్యులు చావలి శ్రీనివాసరావు, సదాశివుని శంకర్రావు, ముందడుగు జోగారావు, త్రినాథ్లు ఉపన్యసించారు.

**అనకాపల్లి**లో జనసాహితి జిల్లాశాఖ ఆధ్వర్యంలో నెహ్రూచౌక్ వద్ద ఇజ్రాయిల్ ఆధిపత్య దాడులకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా రామచంద్రా థియేటర్ నుండి నెహ్రూ చౌక్ వరకు యుద్ధవ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, ఇజ్రాయిల్ గాజాపై చేస్తున్న దాడులను వ్యతిరేకిస్తున్న నినాదాలతో ప్రదర్శన జరిగింది. అక్కడే వున్న అంబేద్కర్ విగ్రహం వద్ద సభను ఉద్దేశించి జనసాహితి జిల్లా అధ్యక్షులు ఐటిఆర్‌వి శివాజీరావు, జనసాహితి సభ్యులు జగదీష్, పెంట్రాది రావు ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రి రంగబాబు, ప్రసాద్, బి. శ్రీను, బలరాం తదితరులు పాల్గొన్నారు.

**విజయవాడ**లో 13-1-24 సాయంత్రం రాఘవయ్య పార్కు నుండి లెనిన్ సెంటర్ వరకు ఉత్తేజపూరిత నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు. లెనిన్ సెంటర్‌లో సభ జరిగింది. ఈ కార్యక్రమంలో వామపక్ష రాజకీయ నాయకులు, జనసాహితి భాగస్వామ్యం గల లౌకిక ప్రజాస్వామ్య వేదిక సంగమం, పాలస్తీనా సంఘీభావ కమిటీ, ముస్లిం విద్యార్థినీ విద్యార్థులతో సభ నిర్వహించారు. ఈ సభలో ఆయా సంఘాల బాధ్యులు ప్రసంగించారు.

**హైదరాబాద్**లో 13-1-24న టాంక్‌బండ్‌పైన మగ్దూం మొహియుద్దీన్ విగ్రహం వద్ద వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో జనసాహితి, ఆల్ ఇండియా పీపుల్స్ లిటరరీ అండ్ కల్చరల్ ఫోరమ్, స్త్రీ విముక్తి సంఘటన సభ్యులు నినాదాలతో వున్న ప్లకార్డులతో పాల్గొన్నారు.

**ఒంగోలు**లో 21-1-24న జనసాహితి, ఓపిడిఆర్, ప్రజాతంత్ర మేధావుల వేదిక సంయుక్తంగా ఈమనిపాలెం నుండి చర్చి సెంటర్, కలక్టరేట్, నెల్లూరు బస్టాండ్, ఎల్ఐసి ఆఫీసు మీదుగా ప్రకాశం భవనం వరకు ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనకి జనసాహితి నాయకులు డా॥ జి.వి. కృష్ణయ్య, డా॥ శాంతికుమార్, ప్రసన్న, డి.వి., ఓ.పి.డి.ఆర్ నాయకులు పి. సుబ్బారావు, ప్రజాతంత్ర మేధావుల వేదిక నాయకులు కారుమంచి సుబ్బారావు తదితరులు నాయకత్వం వహించారు.

**ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులు, శ్రమజీవులు, దోపిడీకి గురౌతున్న పీడిత ప్రజలు, సామ్రాజ్యవాద ఆధిపత్యం వల్ల అణగారిన జాతులవారు ప్రజాపక్షం వహించే రచయితలు, కళాకారులు, మేధావులు.... అందరూ 2024 జనవరి 21న లెనిన్ శతవర్ధంతిని సమాజ మార్పుకై జరగాల్సిన కృషికి అంకితమవుతూ జరుపుకున్నారు. అందులో భాగంగా జనసాహితి ప్రచురించిన 'ప్రజాసాహితి' లెనిన్ ప్రత్యేక సంచిక ఆవిష్కరణలు, పరిచయ సభలను పలుచోట్ల నిర్వహించారు.**

**ఒంగోలు :** ప్రజాస్వామిక సంస్కృతిని నిర్మించటానికి లెనిన్ చూపిన మార్గంలో సాహిత్య కృషి కొనసాగిద్దాం అంటూ ఒంగోలులోని తరిమెల నాగిరెడ్డి భవన్‌లో జనసాహితి సభను నిర్వహించింది. జనసాహితి ప్రకాశంజిల్లా నాయకులు కామ్రేడ్ డి.వి. అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా జిల్లా అధ్యక్షులు డా॥ జి.వి. కృష్ణయ్య ప్రజాతంత్ర మేధావుల వేదిక కన్వీనర్ కారుమంచి సుబ్బారావు ఉపన్యసించారు. జనసాహితి జిల్లా నాయకులు డా॥ శాంతికుమార్, ప్రసన్న, సత్యనారాయణ, విజయ భాస్కరరెడ్డి, తదితరులు సభా నిర్వహణలో బాధ్యత వహించారు.

**విజయవాడ :** జనవరి 21 ఉదయం 10:30గం॥కు విజయవాడ లెనిన్ సెంటర్లోని లెనిన్ విగ్రహం వద్ద మార్క్స్, ఏంగెల్స్, లెనిన్ విగ్రహ కమిటీల ఆధ్వర్యంలో జరిగిన లెనిన్ శతవర్ధంతి సభలో కార్మికవర్గ నాయకుడు, రచయిత కామ్రేడ్ జి.వి. భద్రం 'ప్రజాసాహితి' లెనిన్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రష్యా నుండి తెచ్చిన లెనిన్ కాంస్య విగ్రహానికి సిపిఐ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శులు కె. రామకృష్ణ, వి. శ్రీనివాసరావులు క్రేన్ సహాయంతో లెనిన్ విగ్రహానికి గజమాలను వేశారు. ఆ తర్వాత జరిగిన సభలో ఈడ్పుగంటి నాగేశ్వరరావు తదితర పార్టీల బాధ్యులతోపాటు జనసాహితి అధ్యక్షులు దివికుమార్ మాట్లాడారు.

**అనకాపల్లి :** 21-1-2024న జనసాహితి అనకాపల్లి శాఖ నిర్వహణలో స్థానిక నర్సింగరావుపేటలో గల ఏపిటిఎఫ్ భవన్‌లో లెనిన్ శతవర్ధంతి సభ జరిగింది. ఈ సభకు జనసాహితి జిల్లా అధ్యక్షులు ఐటిఆర్‌వి శివాజీరావు అధ్యక్షత వహించారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) సీనియర్ నాయకులు కా॥ అడారి అప్పారావు 'ప్రజాసాహితి' లెనిన్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఓపిడిఆర్ రాష్ట్ర నాయకులు కె. గౌరీశంకర్, జనసాహితి సంయుక్త కార్యదర్శి ఓవీవీయస్ రామకృష్ణ ప్రసంగించారు. జిల్లా కార్యదర్శి శ్రీశైలం నూకాచారి వందన సమర్పణ చేసిన ఈ సభలో యువజనులు, లాయర్లు, టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.




**భాషా తపస్వి గిడుగు – ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న**

వెలమల సిమ్మన్న ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు. ఉద్యోగ విరమణ తరువాత కూడా విశ్వవిద్యాలయం సేవలో కొనసాగుతున్నారు.

గిడుగువారు తెలుగు భాషా, సాహిత్యాలకు వాటి వికాసానికీ చేసిన కృషిని, జీవిత విశేషాలనూ చెప్పిన పుస్తకం ఇది. శాసనాల పరిశోధకుడిగా, సవర భాషకు పాదులు కట్టిన ప్రజా దృక్పథం గల ఉపాధ్యాయునిగా చేసిన కృషిని ఒకచోట నిక్షిప్తం చేసిన పుస్తకం ఇది. గిడుగు రచనల పరిచయం కూడా వుంటుంది ఇందులో. వ్యావహారిక భాషోద్యమ పిడుగుగా గిడుగువారి పట్టు సడలని దీక్ష, ఆదర్శ పత్రికా సంపాదకునిగా గిడుగు కృషి, ఇలా గిడుగువారిపై తన అభిప్రాయాలను ఈ పుస్తకంలో సంకలితం చేశారు.

1/8 డెమ్మీ; 264 పుటలు; తొలిముద్రణ : 2023; వెల : 200/–; ప్రతులకు : గిడుగు వేంకట నాగేశ్వరరావు, హెచ్.నెం. 3–14–18, ఎస్.టి.నెం.2, శ్రీనివాసపురం, రామాంతపూర్, హైదరాబాద్ – 500016. చరవాణి : 9581 888 989. విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ మొ॥ అన్ని పుస్తక కేంద్రాల్లో.

**అంబేద్కర్ జీవిత చరిత్ర (రెండవ భాగం) – డా॥ కత్తి పద్మారావు**

లోకాయత పబ్లికేషన్స్

"అంబేద్కర్ జీవిత చరిత్ర అంటే – మన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పోరాట చరిత్ర" అనే అవగాహనతో డా॥ కత్తి పద్మారావు ఈ పుస్తకం – ఒకటవ భాగాన్ని పూర్తిచేసి, ఇప్పుడు ఈ రెండోభాగాన్ని మన ముందుకు తెచ్చారు. దీన్ని లోకయత ప్రచురణలుగా తీసుకు వచ్చారు. 9వ పేజీలో ఈ గ్రంథం ముద్రించడానికి ఆర్థికంగా సహకరించిన 19 మంది పేర్ల జాబితా ఇచ్చారు. ఈ పుస్తకంలో 21 చాప్టర్లు వున్నాయి. ఒక్కొక్క చాప్టర్‌కి ఒక్కో పేరు పెట్టారు. 1. సామాజిక శాస్త్రజ్ఞుడు అంబేద్కర్; 2. బ్రాహ్మణవాద పునాదులు తవ్విన అంబేద్కర్; 3. అంబేద్కర్ పరిశోధనా పటిమ; 4. అంబేద్కర్ విద్య జీవితం; 5. అంబేద్కర్ పరిశోధనాక్రమం; 6. చారిత్రాత్మక పరిశోధన; 7. భారతీయ తత్త్వశాస్త్రాన్ని అందించిన అంబేద్కర్; 8. అస్పృశ్యతను ఎదుర్కొన్న అంబేద్కర్; 9. భారత రాజకీయోద్యమ అధ్యయనం; 10. జ్ఞాన జిజ్ఞాసిగా అంబేద్కర్; 11. భారతదేశ పునర్నిర్మాత అంబేద్కర్; 12. అంబేద్కర్ బౌద్ధ విప్లవం; 13. బౌద్ధ జీవన ప్రభావం; 14. బౌద్ధ జీవన గమనం; 15. అంబేద్కర్ కుల నిర్మూలన దర్శనం; 16. గాంధీతో అంబేద్కర్ యుద్ధం; 17. మూఢభావాలపై యుద్ధం; 18. వర్ణవాదంపై యుద్ధం; 19. తాత్త్విక యోధుడు అంబేద్కర్; 20. మనుభావాలపై యుద్ధం; 21. ముగింపులేని యుద్ధం.

1979 నుండి మొదలైన డా॥ కత్తి పద్మారావు గ్రంథముద్రణా ప్రస్థానం అలుపెరగని పోరాటంగా సాగుతోంది.

1/8 డెమ్మీ; 668 పుటలు; లోకాయత పబ్లికేషన్స్; తొలిముద్రణ : జులై 2023; వెల : 600/–; గ్రంథాలయ ప్రతి : 1000/–; ప్రతులకు : కత్తి స్వర్ణకుమారి, అంబేద్కర్ రిసెర్చ్ సెంటర్, లోకాయత ప్రచురణలు, లుంబినీవనం, అంబేద్కర్ కాలనీ, పొన్నూరు – 522124. గుంటూరుజిల్లా. ఫోన్ : 98497 41695. e-mail : padmaraokathi @yahoo.co.in & అన్ని పుస్తక కేంద్రాలలోనూ.

**యుగకర్త డా॥ కత్తి పద్మారావు – బి.ఎస్. రాములు**

లోకాయత పబ్లికేషన్స్

"యుగకర్త డా॥ కత్తి పద్మారావు" అనే ఈ పుస్తకంలో 19 అంశాలున్నాయి. మహాకవిగా డా॥ కత్తి పద్మారావు, రాజకీయ సిద్ధాంత వేత్తగా, రాజకీయ నాయకుడిగా డా॥ కత్తి పద్మారావు అంటూ – కత్తి పద్మారావు ఉద్యమ వ్యక్తిత్వాన్ని, బుద్ధిజం, అంబేద్కరిజం విశ్లేషణనీ వివరిస్తూనే, అంబేద్కర్ దృక్పథంలో – భారత రాజకీయాల్ని' పరిచయం చేశారు బి.ఎస్. రాములు. కత్తి పద్మారావు ప్రసంగాలు, జీవితం – సాహిత్యం, పద్మారావు విమర్శలోని ప్రత్యేకత, దళిత – సాహిత్య ఉద్యమాలూ – విశ్లేషణలతో కూడినదీ ఈ పుస్తకం.

1/8 డెమ్మీ; 280 పుటలు; లోకాయత ప్రచురణలు; తొలిముద్రణ : 2023; వెల : 200/– గ్రంథాలయాలకు : 350/– ప్రతులకు : కత్తి స్వర్ణకుమారి, అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్, లోకాయత ప్రచురణలు, లుంబినీవనం, అంబేద్కర్ కాలనీ, పొన్నూరు – 522124, గుంటూరు జిల్లా. చరవాణి : 98497 41695. అన్ని పుస్తక కేంద్రాల్లోనూ. ✷

## ఆహ్వానం

## 32వ జాతీయ నాస్తికమేళా

**2024 ఫిబ్రవరి 10, 11 చార్వాకాశ్రమం**

**ప్రత్యామ్నాయ** ప్రజాసంస్కృతిని, భౌతికవాద జీవన విధానాన్ని ప్రచారం చేస్తూ 1992 నుండి 32 సం॥లుగా ఫిబ్రవరి రెండవ శని, ఆదివారాలలో చార్వాకాశ్రమంలో నాస్తికమేళా జరుగుతూంది. బి. రామకృష్ణ స్థాపించిన ఈ చార్వాకాశ్రమం, గుంటూరు జిల్లా మంగళగిరి నుండి నిడమర్రుకు వెళ్ళేదారిలో వుంటుంది.

అసమాన సమాజాన్ని మార్చటానికి భౌతికవాద భావజాల తోడ్పాటునూ, అన్వయింపుల గురించి తెలియచేస్తూ వివిధరంగాల ప్రజాసంఘాల బాధ్యుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మేజిక్‌షోలు, మూఢనమ్మకాల గుట్టును రట్టు చేసే అనేక ఇతర కార్యక్రమాలు ఉంటాయి. ✷

## బెంగాలీ కవి, కథారచయిత, నవలా రచయిత మలయరాయ్ చౌధురి మరణం

**బెంగాలీ** కవి, కథకుడు, నవలా రచయిత, నాటకకర్త, వ్యాస రచయిత, ఆకలితరం కవితా ఉద్యమ స్థాపకుడు ఐన మలయరాయ్ చౌధురి తన 83వ యేట 26 అక్టోబరు 2023న మరణించారు. ఆయన పాట్నాలో 29-10-1939న జన్మించారు.

ఆయన తండ్రి, తాత కూడా ఫొటోగ్రాఫర్లే. తల్లి అభ్యుదయ కుటుంబానికి చెందినావిడ. తండ్రి రంజిత్‌రాయ్ చౌధురి. తల్లి అమిత. మలయ్ బాల్యమంతా పాట్నాలో దళిత హిందువులు, షియా ముస్లిములు నివాసముండే పేద మురికివాడ ప్రాంతంలో గడచింది. అక్కడ వున్న బెంగాలీ కుటుంబం వీరొక్కరే. ఆ మురికివాడ జీవితం మలయ్‌ను ప్రభావితం చేసింది. ఆయన విద్యాభ్యాసం బ్రహ్మసమాజ పాఠశాలలో జరగడం వల్ల లౌకిక భావజాలం పెంపొందించుకున్నారు.

1961లో మరో 30 మంది కవులతో కలసి 'హంగ్రియలిస్టు' కవిత్వ ఉద్యమం ప్రారంభించారు. అంటే ఆకలితరం కవితా ఉద్యమం. మలయ్ సోదరుడు సమీర్ రాయ్ చేదోడువాదోడుగా వున్నాడు. వీరు సంప్రదాయ కవితారూపాలను ధిక్కరించారు. పాత ఛందో రూపాలను వదిలేశారు. 1963లో 'ప్రచండ విద్యుతిక్ భూతర్' (స్టార్క్ ఎలక్ట్రిక్ జీసస్) అనే దీర్ఘ కవితను తప్పుపడుతూ కలకత్తాలోని బ్యాంక్ షల్ కోర్టు మలయ్‌పై సోదరుడు సమీర్‌పై మరో పదకొండు మందిపై 1966 కేసు పెట్టింది. ఆ కవిత రాసినందుకు మలయ్‌కు ఒక నెల జైలు శిక్ష విధించింది.

మలయ్ 2005లో తన కవితాసంకలనం ప్రచురించారు. 1961లో ఆకలితరం ఉద్యమం ప్రారంభించిన నాటినుండీ 60 పుస్తకాలు వెలువరించారు. 2014లో తన స్వీయచరిత్ర 'రాహుకేతు' రాశారు. 3 అబ్సర్డ్ నాటకాలు రాశారు.

1965 నుండి ఆధునికానంతరవాద ప్రభావంలో నవలలు రాశారు. కలకత్తా నుండి ముంబాయికి మకాం మార్చిన తర్వాత మాజిక్ రియలిజం టెక్నిక్‌ను తన రచనలలో ఉపయోగించారు.

ఆయన ఇంగ్లీషులో, ఇతర భాషలలో ప్రసిద్ధులైన విలియం బ్లేక్, ఆర్థర్ రింబాడ్, ట్రిస్టాన్ జారా, ఆండ్రే బ్రెటన్, అలెన్ గిన్స్‌బర్గ్ తదితరుల కవిత్వాన్ని బెంగాలీలోకి అనువదించారు.

గిన్స్‌బర్గ్, హెన్రీమిల్లర్, చార్లెస్ బాడిలేర్, జీన్ ఆర్థర్ రింబాడ్, మార్సెల్ ప్రౌస్ట్, అన్నా అఖ్మతోవా, జేమ్స్ జాయిస్‌లను పరిచయం చేస్తూ సాహిత్య వ్యాసాలు రాశారు.

ధర్మవీర్ భారతి హిందీలో రాసిన 'సూరజ్ కా సత్వాన్ ఘోరా' బెంగాలీలోకి అనువదించినందుకు మలయ్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని ప్రకటించింది. కాని మలయ్ దానిని తిరస్కరించారు.

ఆయన రాసిన దీర్ఘకవిత 'స్టార్క్ ఎలక్ట్రిక్ జీసస్' చలన చిత్రంగా 2014లో మృంగాక శేఖర గంగూలీ దర్శకత్వంలో విడుదలై పలు బహుమతులను గెల్చుకుంది.

మలయ్ కవితలను విరివిగా వాడిన మరో చలనచిత్రం 2011లో వచ్చింది.

## సదరన్ రైల్వే రిక్రూట్‌మెంట్ 2024...దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం..

నిరుద్యోగులకు రైల్వేశాఖ ఓ శుభవార్తను మోసుకొచ్చింది. దక్షిణ రైల్వేలో ఖాళీగా ఉన్న 2,860 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలయ్యింది. సదరన్ ఇండియన్ రైల్వే వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అప్రెంటీస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 2,860 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేది ఫిబ్రవరి 28. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగలరు.

విద్యార్హత : 50 శాతం మార్కులతో పదో తరగతి, ఇంటర్‌తో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులైన వారు ఈ అప్రెంటిస్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. మెరిట్ జాబితా, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుంది.



## కృతజ్ఞతలు

'ప్రజాసాహితి' పాఠకుడూ, అభిమాని అయిన కార్జాల రామకృష్ణమ నాయుడు (కె.ఆర్.కె. నాయుడు) రేపల్లె సమీపాన గల నగరంలోని శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో ఆర్థికశాఖాధిపతిగా 1969 నుండీ పనిచేసి 2000 సం॥లో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన 29-1-2007న గుండెపోటుతో తన 65వ యేట తిరుపతిలో మరణించారు. వారి 17వ వర్ధంతి (29-1-2024) సందర్భంగా వారి జీవిత సహచరి పవనకుమారి, కుమార్తెలు శుభాన్విత, సుస్మితలు ఈ సంచిక ముద్రణకై ఆర్థికంగా సహకరించారు. వారికి కృతజ్ఞతలు. కె.ఆర్.కె. నాయుడుకు నివాళి.

**- ప్రజాసాహితి**

# భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో కులవివక్షను చిత్రించిన కవితపై ఆంక్ష

**1952లో** ఫిల్మోత్సవ్‌గా ప్రారంభమై, బొంబాయి, మద్రాసు, తిరువనంతపురం, న్యూఢిల్లీ, కలకత్తా, బెంగళూరు, హైదరాబాదు నగరాలలో ప్రతిఏడూ నిర్వహించబడి, భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంగా (IFFI) మారి 2004 నుండీ శాశ్వత వేదికగా గోవాలో ప్రతి ఏడాదీ నవంబరు, డిశంబరు నెలలో ఈ పోటీలు జరుగుతున్నాయి. ఉత్తమ చలనచిత్రానికి 'బంగారు నెమలి' బహుమతిని ఇస్తున్నారు. ఈ ఏడాది ఈ ఉత్సవాలు నవంబరు 20 నుండి 28 వరకు జరిగాయి. ఈ ఏడాది పర్షియన్ చలనచిత్రం 'ఎండ్‌లెస్ బోర్డర్స్' (అంతులేని సరిహద్దులు) బంగారు నెమలిని గెలుచుకుంది.

చిత్రోత్సవం జరిగిన అన్ని రోజులూ 'ది పీకాక్' (The Peacock – నెమలి) అనే దినపత్రికను, చలనచిత్ర రంగానికి సంబంధించిన వార్తలతోనూ, కథనాలతోనూ, కవితలతోనూ ఈ ఉత్సవాన్ని నిర్వహించే 'ఎంటర్‌టైన్‌మెంట్ సొసైటీ ఆఫ్ గోవా' (ESG) బ్రాడ్‌షీట్‌గా ప్రచురిస్తుంది. నవంబరు 26 ఆదివారం సంచికలో కులవ్యతిరేక చిత్రకారుడు సిద్దేశ్ గౌతమ్ వేసిన రెండు పేజీలకు విస్తరించే చిత్రంతోపాటు ప్రసిద్ధ గోవా రచయిత, పూర్వ బి.జె.పి. శాసనసభ్యుడు విష్ణు సూర్యవాఘ్ రాసిన అభ్యుదయ కవిత ప్రచురించాలనుకొని, పత్రిక నిర్వాహకులు విష్ణు సూర్య మేనల్లుడైన కాస్తుభ్‌నాయక్‌కు ఆ కవితను ఎన్నిక చేసే బాధ్యత అప్పచెప్పారు. ఆయన విష్ణుసూర్య రాసిన ప్రసిద్ధ కవితా సంపుటి 'శూద్రసూక్త' నుండి 'సెక్యులర్' (లౌకికం) అనే కవితను కొంకణి నుంచి ఇంగ్లీషులోకి అనువదించి ఇచ్చారు.

నవంబరు 26 ఆదివారం 'ది పీకాక్' పత్రికలో సిద్దేశ్ గౌతమ్ చిత్రంతోపాటు ప్రచురించాల్సిన ఆ కవితను నవంబర్ 25న ESG కమిటీ తొలగించింది. ఇది ఒక రకమైన సెన్సార్‌షిప్ అని కౌస్తుభ్‌నాయక్ విమర్శించారు.

ఈ 'శూద్రసూక్త' కవితాసంపుటిలో కవితలన్నీ ఈనాటి కులవ్యవస్థను వ్యతిరేకించేవే. ఇది 2017లో కొంకణి భాషలో 'శూద్ర సూక్త – శూద్రుని ప్రార్థనలు' అనే పేరుతో వెలువడింది. కవిత్వశాఖలో గోవా కొంకణి అకాడమీ అవార్డు ఈ సంపుటికి లభించింది. గోవా బహుజన సమాజ చరిత్ర ఆ కవితలలో చిత్రించారు. ఆ సంపుటిలోని కవితలను సందర్భం నుండి విడదీసి – వాటికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో కొందరు ప్రచారం చేశారు. గోవాలో గౌడి సారస్వత బ్రాహ్మణులు (GSB) లకూ మెజారిటీ బహుజన గోవన్ల మధ్య కులపరమైన వైరుధ్యం కొనసాగుతూ వుంది. 2017లో విష్ణు సూర్యవాఘేకి ఇచ్చిన అవార్డుతోపాటు అన్ని అవార్డులను అప్పటి గోవా ముఖ్యమంత్రి కీ.శే. మనోహర్ పారిక్కర్ రద్దు చేశారు. ఆయన గోవా సారస్వత బ్రాహ్మణ కులస్తుడు.

'ది పీకాక్'లో చిత్రకారుడు సిద్దేశ్ గౌతమ్ కూడా కులవివక్షకు గురైనవాడే. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో జరిగిన అనేక సంఘటనలను విద్యార్థిగా, చిత్రకారునిగా అనుభవించినవాడే. ఆయన చిత్రాన్ని సెన్సార్ చేయలేదుగాని విష్ణుసూర్యవాఘే కవితను మాత్రం కత్తిరించేశారు. ఇంతకీ ఆ కవితను ప్రచురించకుండా ఆపడానికి కారణం దానిలో సృజనాత్మకత లోపించడమే కాని కవితలోని వస్తువుతో మేము విభేదించడంలేదని నిర్వాహకులు కుంటి సాకులతో తప్పించుకున్నారు.

ఆ కవిత తెలుగు అనువాదం ఇస్తున్నాం చదవండి!

## లౌకికం

కొంకణి మూలం : విష్ణుసూర్యవాఘే

ఇంగ్లీషు : కౌస్తుభ్ నాయక్


తెలుగు : కొత్తపల్లి రవిబాబు

ఇతరుల కులం
పసిగట్టేవారి కుయుక్తులు
నాకు తెలియవు.

ఒకరోజు మిత్రుని ఇంట్లో
అతని మేనమామ తటస్థపడ్డాడు
బాల్కనీలో కూర్చుని
బాతాఖానీలో పడ్డాం!
"వాఘే! నీవు మా వాడివే!"
ముసిముసి నవ్వులతో అన్నాడు
ఆందోళనలోపడ్డాను
అయితే ఆయన ఇంకా ఖచ్చితంగా
తేల్చుకోవాలనుకున్నాడు
"రిబందర్‌కు చెందిన కామత్ వాఘేలు
నీకు బంధువులా?" అన్నాడు
"లేదు. లేదు" - నా జవాబు
"మరి కార్వార్‌కు చెందినవాడివా?"
"కాదు. మాది గోవా!"
"అలాగా! గోవాలో ఏ ప్రాంతం?
డోంగ్రీ కావచ్చు
రాముని గుడికి చెందిన
మహాజన వంశమా?"
"లేదు - కాదు - సతిమాదేవత
ఇంకా తేల్చుకోలేక
మరో ప్రశ్న.....
"మీ వంశపు దేవుడెవరు?"
"శివనాథ్" చెప్పాను
"షిరోదాకు చెందినవాడేనా?"
"అవును"
"అయితే నీవు జిఎస్‌బి కాదన్నమాట!
(గౌడ సారస్వత బ్రాహ్మణుడివి)
"కాదు! మేం భండారీలం!
ఆయన ముఖంలో చిరునవ్వు
మటు మాయమైంది.
"ఏమీ అనుకోకు!
కేవలం ఆసక్తితో అడిగాను అంతే!
మేమూ కులాన్ని త్యజించాం.
రా! టీ తాగుదాం!
మన గోవాను నాశనం చేసింది కులం
బ్రాహ్మణుడెవరు! శూద్రుడెవరు?
ఎవరు ఏమైతే ఏమిటి?
ఈ విభజనకు అర్థం పర్థం లేదు.
మనం లౌకికవాదులుగా వుండాలి.
కులాతీత వ్యవస్థ అవసరం.
ఏమంటావు?"
అంటూ ఊపిరి పీల్చుకోడానికి ఆగాడాయన
నేను టీ తాగుతూ తల వూపుతూ
ఆయనపై వేలాడుతున్న
జంధ్యాన్నే తదేకంగా చూస్తున్నా!

PRAJA SAAHITI February 2024 (TELUGU) Rs. 20/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2024-2026

No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month



ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada

A PUBLICATION OF JANASAAHITHI